శుక్రవారం 9 అక్టోబరు 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

## నేడు ప్రకాశం జిల్లాలో సీఎం పర్యటన



- గర్భ కండ్రిక భూ సమస్యలకు పరిష్కారం
- 1,301 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్న చంద్రబాబు

- వివరాలు 5 లో..

### గోదావరి-కావేరి అనుసంధానంతో

# దక్షిణాదిలో అద్భుత ఫలితాలు



- కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్
- గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి
- ప్రధాని మోదీతో భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై మోదీకి శుభాకాంక్షలు

గోదావరి-కావేరి అనుసంధానంతో దక్షిణాదిలో అద్భుత ఫలితాలు సాధించవచ్చని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం ఉదయం ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలిశారు. ఏపీ అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రతిపాదనలను ఆయన ముందుంచారు. పోలవరం ప్రాజెక్టు తాజా పరిస్థితిని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడిన లోటు వర్షపాతం, రైతులకు అందిస్తున్న ఊరటను వివరించారు. 2027 గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు ప్రత్యేక ఆర్థిక సాయం కోరారు. కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్ పెట్టవచ్చన్నారు. రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, విశాఖ మెట్రో ప్రాజెక్టులకు ఆమోదంతోపాటు 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధనకు కేంద్ర మద్దతును అర్థించారు. 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మోదీకి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. వికసిత్ భారత్ నిర్మాణంలో మోదీ నాయకత్వాన్ని కొనియాడారు.

2

# బిల్డ్ ఏపీ మా ప్రభుత్వ నినాదం

- ఎంఓయూలను పెట్టుబడులుగా మలిచేలా కార్యాచరణ
- త్వరలోనే పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతా
- ఏపీకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని మరువలేం
- 'సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026' కర్టెన్ రైజర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు




*ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు దేశంలోనే అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'బిల్డ్ ఏపీ' నినాదంతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కేవలం ఎంఓయూలకే పరిమితం కాకుండా వాటిని వాస్తవ పెట్టుబడులుగా మలచడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని స్పష్టం చేశారు. గతంలో ప్రకటించినట్టుగా పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతాను ఈ ఏడాది నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని వెల్లడించారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వ అందిస్తున్న సాయాన్ని మరువలేమన్నారు. రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణం అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. సౌత్ ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చడమే తమ లక్ష్యమన్నారు.*

3



### నేతలంతా పార్టీ లైన్‌కు

# కట్టుబడి ఉండాలి

### టీడీపీ ట్రైనింగ్ రిసోర్స్‌పర్సన్లతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మీట్ అండ్ గ్రీట్

*ఎంతటి సీనియర్ నేతలైనా సరే పార్టీ క్రమశిక్షణ, నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాల్సిందేనని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ స్పష్టం చేశారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ట్రైనర్లతో నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్'లో ఆయన మాట్లాడారు. పార్టీ కంటే ఎవరూ ఎక్కువ కాదని, అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలకు అందరూ తలొగ్గాల్సిందేనని స్పష్టం చేశారు. నాయకుల ఎంపిక, గుర్తింపులో 'పెర్ఫార్మెన్స్' మాత్రమే ప్రామాణికమని, ఎటువంటి సిఫార్సులు, పైరవీలకు చోటులేదని తేల్చి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8,300 మందికి శిక్షణ పూర్తయిందని, 50వేల మంది క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులకు ట్రైనింగ్ ఇవ్వడమే లక్ష్యమని తెలిపారు.*

5

### వ్యక్తులు కాదు...

# వ్యవస్థ ముఖ్యం

- ఐటీడీపీని మరింత బలోపేతం చేయాలి
- ఐటీడీపీ కమిటీ నియామకాలను త్వరగా పూర్తి చేయాలి
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ దిశానిర్దేశం



మంగళగిరి (చైతన్యరథం): వ్యక్తులు కాదు వ్యవస్థ ముఖ్యం అనే లక్ష్యంతో అంతా కలిసి ఐటీడీపీని బలోపేతం చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ సూచించారు.

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని దీటుగా తిప్పికొట్టాలన్నారు. ఐటీడీపీ విభాగంపై మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో లోకేష్ మాట్లాడుతూ ఐటీడీపీ కమిటీలను త్వరగా వేయాలన్నారు.

ఐటీడీపీ సభ్యులను 'మై టీడీపీ యాప్'తో అనుసంధానించాలన్నారు. మిగిలిన విభాగాలతో సమన్వయం చేసుకుంటూ ఐటీడీపీ సాంకేతికంగా ఎదగాలని సూచించారు. సమీక్షలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ పాల్గొన్నారు.



### ఒకే పర్యటన...

# ఎన్నో లక్ష్యాలు

- న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు బిజిబిజీ
- ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులతో వరుస భేటీలు

*రెండు రోజులు... ఎనిమిది కీలక కార్యక్రమాలు... తీరిక లేదు. అలుపు లేదు.... న్యూఢిల్లీలో ఒకటే ఎజెండా... అదే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు. ఒక్క పర్యటనలోనే ఎన్నో లక్ష్యాలను నిర్దేశించుకున్నారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. బుధ, గురువారాల్లో ఆయన దేశ రాజధాని నగరంలో బిజీబిజీగా గడిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, సీఆర్ పాటిల్, పీయూష్ గోయల్, శర్బానంద సోనోవాల్... ఇలా ప్రతి ఒక్కరినీ కలిసిన సీఎం ప్రాజెక్టుల పూర్తికి నిధులు ఇచ్చి ఏపీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 'సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026' కర్టెన్ రైజం ఈవెంట్‌లో చంద్రబాబు పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు, కేంద్రం అందిస్తున్న సహకారం, వివిధ రంగాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు వివరించారు.*

- వివరాలు లోపలి పేజీల్లో..

## గోదావరి-కావేరి అనుసంధానంతో

# దక్షిణాదిలో అద్భుత ఫలితాలు

- కేంద్రం చొరవ, రాష్ట్రాల సమన్వయంతో నీటి కష్టాలకు చెక్
- గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేక నిధులివ్వండి
- ప్రధాని మోదీతో భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనలు
- రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక పరిస్థితిని ప్రధానికి వివరించిన సీఎం
- 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై మోదీకి శుభాకాంక్షలు



న్యూఢిల్లీ (చైతన్యరథం): 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో అరుదైన ఘనత సాధించిన మోదీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. న్యూఢిల్లీలోని ప్రధాని నివాసం 7-లోక్ కల్యాణ్ మార్గ్‌లో గురువారం ఉదయం ప్రధాని మోదీని సీఎం చంద్రబాబు కలిశారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని చూపారని, క్రమశిక్షణ, నిబద్ధతతో దేశానికి సేవలు అందించారన్నారు. దూరదృష్టి.. స్పష్టమైన లక్ష్యం.. దృఢమైన నిర్ణయాలు... సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచ శక్తిగా మలిచారని కీర్తించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో భారతదేశ గమనాన్ని మార్చారని సీఎం చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసి వికసిత్ భారత్‌వైపు దేశాన్ని నడిపిస్తున్నారన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ గౌరవాన్ని, విశ్వసనీయతను మరింత పెంచేలా తోడ్పడ్డారన్నారు. రాష్ట్ర ప్రజల తరపున ప్రధానికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

### నదుల అనుసంధానంపై ప్రతిపాదనలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిపిన భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలక అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రాభివృద్ధికి చెందిన వివిధ కీలక ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వ్యవసాయ, ఇరిగేషన్ వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. నీటిపారుదల రంగానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టు తాజా నివేదికతోపాటు గోదావరి-కావేరి నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాదిలోని ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందుతుందని ముఖ్యమంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా రహదారుల నెట్వర్క్, పవర్ గ్రిడ్ వంటివి ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలోనే జరిగాయని... ఇప్పుడు నదుల అనుసంధాన ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తే వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని ప్రధానిని సీఎం కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా... దేశ, విదేశాల నుంచి సైతం గోదావరి పుష్కరాలకు భక్తులు తరలి వస్తారని సీఎం వివరించారు.

### రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 53శాతం లోటు వర్షపాతం నమోదైందని... ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రధానికి సీఎం వివరించారు. కరువునష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర సహకారంతో మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టి కల్చర్ హబ్ లక్ష్యాలను కూడా ప్రధానికి తెలిపారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు.

### మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై వినతి

రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకారాన్ని సీఎం కోరారు. రాజధాని అమరావతిలో చేపడుతున్న ఔటర్ రింగ్ రోడ్డు వంటి అంశాలపై సీఎం చంద్రబాబు ప్రధాని మోదీతో చర్చించారు. విశాఖకు మెట్రో మంజూరు చేయాలని సీఎం కోరారు. బీచ్ రోడ్డు నిర్మాణం గురించి వివరించారు. 2047 నాటికి రాష్ట్రంలో అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర-2047 విజన్ గురించి ప్రధానికి సీఎం చెప్పారు.

---

# దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటు చేయండి

## కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్‌ను సీఎం చంద్రబాబు వినతి



న్యూఢిల్లీ(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. కేంద్ర ఓడరేవులు, నౌకాయాన శాఖల మంత్రి శర్బానంద సోనోవాల్‌తో సమావేశమైన సీఎం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి,మూలపేట పోర్టులో టెర్మినల్ ఏర్పాటు, దుగరాజ పట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టుల ఆధారంగా పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని సీఎం వివరించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదిత పోర్టులకు అనుసంధానంగా షిప్ బిల్డింగ్, షిప్ రిపేర్, మెరైన్ ఇంజినీరింగ్ వంటి రంగాలను అభివృద్ధి చేస్తే పెద్ద ఎత్తున ఉపాధి, పెట్టుబడులకు అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు అభివృద్ధితో ఉత్తరాంధ్రలో వాణిజ్య కార్యకలాపాలు మరింత ఊపందుకుంటాయన్నారు. పోర్టుకు అవసరమైన టెర్మినల్, అనుబంధ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. మూలపేట పోర్టును కేవలం సరకు రవాణా కేంద్రంగా మాత్రమే కాకుండా పరిశ్రమలు, లాజిస్టిక్స్, ఎగుమతులు, సముద్ర ఆధారిత తయారీ రంగాలకు కీలక హబ్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉందని, కేంద్రం సహకరించాలని కోరారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. నౌకల నిర్మాణంతో పాటు మరమ్మతులు, నిర్వహణ, మెరైన్ పరికరాల తయారీకి అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహిస్తే రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక ఎకో సిస్టమ్ ఏర్పడుతుందని తెలిపారు. అవసరమైన భూమి, మౌలిక వసతులు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చెప్పారు.

---

## మీ మాటలు టీడీపీ కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చాయి

### ప్రధాని మోదీకి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు



అమరావతి (చైతన్యరథం): 'గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు.మీ 25 ఏళ్ల నిరంతర ప్రజా సేవకు, సుపరిపాలన పట్ల మీకున్న సడలని అంకితభావానికి మా కృతజ్ఞతాపూర్వక గౌరవసూచకంగా 'సేవా సంకల్ప యాత్ర' చేపట్టాము. మా తెలుగుదేశం పార్టీ కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర కృష్ణా, గోదావరి జలాలను కాశీకి తీసుకెళ్లడం ఎంతో ప్రాప్తిగా భావిస్తున్నాం. ఇది మన ప్రజలను,మన సంప్రదాయాలను, మన దేశాన్ని ఏకంచేసే బంధాలను చాటి చెప్తోంది. మీ ప్రోత్సాహకరమైన మాటలు ఈ యాత్రలో భాగస్వాములైన ప్రతికార్యకర్తకూ ఎంతో స్ఫూర్తినిచ్చాయి' అంటూ ప్రధాని మోదీకి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలిపారు.

## దుర్గా పూజ నిర్వాహకులకు తీపి కబురు




అమరావతి (చైతన్యరథం): '2026 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గుర్తింపు పొందిన దుర్గా మంటపాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో 3 కిలోవాట్ల వరకు, పట్టణ ప్రాంతాల్లో 5 కిలోవాట్ల వరకు ఉచిత విద్యుత్ లభిస్తుంది. మన సమాజమంతా కలిసికట్టుగా దుర్గామాత దివ్యత్వాన్ని జరుపుకుంటున్న వేళ, ఈ పండుగ వేడుకలకు మా వంతు మద్దతు తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. అందరికీ ఆనందకరమైన, శుభప్రదమైన పండుగ శుభాకాంక్షలు' అంటూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.

# బిల్డ్ ఏపీ మా ప్రభుత్వ నినాదం

- ఎంవోయూలను పెట్టుబడులుగా మలిచేలా కార్యాచరణ
- త్వరలోనే పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతా
- ఏపీకి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని మరువలేం
- 'సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026' కర్టెన్ రైజర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- భారత అభివృద్ధి ప్రయాణంలో ఏపీది కీలక పాత్ర: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్




న్యూఢిల్లీ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు దేశంలోనే అత్యుత్తమ గమ్య స్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'బిల్డ్ ఏపీ' నినాదంతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు అవకాశాలు, కేంద్రం అందిస్తున్న సహకారం, వివిధ రంగాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి వివరించారు. గత ఏడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చంద్రబాబు తెలిపారు. గడిచిన 28 నెలల్లో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చెప్పారు. కేవలం ఎంవోయూలకే పరిమితం కాకుండా వాటిని వాస్తవ పెట్టుబడులుగా మలిచేలా ప్రత్యేకంగా దృష్టి సారించామని స్పష్టం చేశారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీకి వస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రకటించినట్టుగా పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతాను ఈ ఏడాది నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభిస్తామని వెల్లడించారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణం అమలు చేయడా నికి ఏపీ సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

## నీటి వనరులు... గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి

గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులను అనుసంధానిస్తే ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి కొరత ఉండదని చంద్రబాబు అన్నారు. రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సౌత్ ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చడమే తమ లక్ష్యమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు మజగావ్ డాక్‌యార్డ్ లిమిటెడ్ ముందుకు వచ్చిందని, మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు గోవా షిప్ యార్డ్ సంస్థ అంగీకరించిందని వెల్లడించారు. తిరుపతి, లేపాక్షి, కొప్పర్తిలో డ్రోన్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాయలసీమలో ఐదో తరం ఫైటర్ జెట్ ప్రాజెక్టును రక్షణ శాఖ ప్రారంభించిందని తెలిపారు. డేటా లేక్ వంటి వ్యవస్థల ద్వారా ఏఐ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. జీఎస్టీ పన్నుల వసూళ్లలో ఏఐ ఆధారిత సాంకేతికతను అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ఏఐతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో రాణించేలా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను ప్రత్యేక బ్రాండ్ పేరుతో అంతర్జాతీయ మార్కెట్లకు ప్రమోట్ చేస్తామని వెల్లడించారు. బ్లూ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉందని, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నాయని చెప్పారు. అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ద్వారా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందన్నారు. బాపట్లలోని సూర్యలంక వంటి అద్భుతమైన తీర ప్రాంతాలు రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు.

## అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రధాని

దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని చంద్రబాబు అన్నారు. 25 ఏళ్లుగా నిరంతరాయ ప్రజా సేవలో కొనసాగుతున్న ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. దేశంలో డిజిటల్ మౌలిక వసతులను తీసుకురావడంలో ప్రధాని కీలక పాత్ర పోషించారని చెప్పారు. అత్యద్భుతమైన రహదారి నెట్‌వర్క్‌తో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని, రైల్వే నెట్‌వర్క్‌లోనూ కీలక స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, రోడ్లతో బలమైన మౌలిక వసతులను దేశంలో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రక్షణ రంగంలోనూ అత్యంత భద్రమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర విశేషమని సీఎం పేర్కొన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయులు ముందున్నారని, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రముఖ కంపెనీలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చేయూత అందించడంలో కేంద్రం, ప్రధాని మోదీ ముందున్నారన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తోందని చెప్పారు. విశాఖ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సెమీ కండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి వివరించారు.





## చరిత్రలో, వర్తమానంలో ఆంధ్రులది ప్రత్యేక స్థానం: కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

భారత్ అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర అత్యంత కీలకమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమరావతిని పాలించిన శాతవాహనులు వినియోగించిన నాణేల్లో నౌకా చిహ్నం ఉండేదని గుర్తు చేశారు. అప్పట్లోనే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యం ద్వారా ప్రపంచంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించిందని తెలిపారు. ఆ నౌక చిహ్నం భారతీయుల వాణిజ్యం, విశ్వాసం, ఆలోచనలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ అంటే వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలకు చిరునామాగా ఉందని గోయెల్ అన్నారు. విజనరీ నేత చంద్రబాబు 1998లోనే టెక్నాలజీని అందిపుచ్చుకుని రాష్ట్రంలో విస్తృత అవకాశాలు సృష్టించారని ప్రశంసించారు. సన్‌రైజ్ స్టేట్‌గా ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నాయని చెప్పారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తో పాటు అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు అవుతోందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రాలు టీమ్ ఇండియాగా దేశ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నాయన్నారు. కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష అనే విధానంతో ముందుకు సాగుతోందని గోయెల్ చెప్పారు. టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్, టాలెంట్, ట్రెడిషన్ అనే ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని గత భాగస్వామ్య సదస్సులో తాను సూచించానని, ఆంధ్రప్రదేశ్ ఈ అంశాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేసి పారిశ్రామికవేత్తల విశ్వాసాన్ని చూరగొంటూ పెట్టుబడులను సాధిస్తోందన్నారు. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామికవేత్తలు హాజరై రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్రం, రాష్ట్రాలు, పరిశ్రమలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు వెంట పలువురు ఎంపీలు, నేతలు వున్నారు.



చైతన్యరథం

## పోలవరం, జల్‌జీవన్ మిషన్ పనులకు

# ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేయండి

### కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



ఢిల్లీ (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతిని, ఇటీవల రూ.30వేల కోట్లతో చేపట్టిన జల్‌జీవన్ మిషన్-అమరజీవి జలధార పనుల వివరాలను కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వివరించారు. ఈ రెండు ప్రాజెక్టులకు నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సీఆర్ పాటిల్‌తో భేటీ అయ్యారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేసేలా పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో సుదీర్ఘంగా పెండింగులో ఉన్న పలు అంశాలను పరిష్కరించాలని సీఎం కోరారు. ఆ రెండు రాష్ట్రాల్లో పోలవరం నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన ప్రొటెక్టివ్ ఎంబాంక్‌మెంట్స్ పనులకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ పెండింగులో ఉందనే కారణంతో అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన స్టాప్ వర్క్ ఆర్డర్ ప్రస్తుతం అబెయన్సులో ఉన్నప్పటికీ... దాన్ని శాశ్వతంగా ఉపసంహరించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేసేలా ఆ రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి ఒప్పించాలని కోరారు. ఈ మేరకు కేంద్ర జల మంత్రిత్వ శాఖ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రాష్ట్రాల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరస్పర సహకారం, సమన్వయం ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టు వద్ద 41.15 మీటర్ల కాంటూరు వరకు నీటిని నిలిపేందుకు అవసరమైన పునరావాసం, ఆర్అండ్ఆర్ పనులను త్వరితగతిన చేపడుతున్నట్టు కేంద్ర మంత్రికి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యతనిస్తున్నామో... నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పునరావాస పనులకూ అంతే ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పోలవరానికి ఎలాంటి నిధుల కొరత రాకుండా చూడాలని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రిని కోరారు. పోలవరం వద్ద 45.72 కాంటూరు వరకు నీటిని నిలిపేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. చేపట్టాల్సిన పనులపైనా కేంద్ర మంత్రి పాటిల్‌తో సీఎం చంద్రబాబు చర్చించారు. గోదావరి నది నుంచి వేల టీఎంసీల వరద జలాలు సముద్రంలో వృధాగా కలిసిపోతున్నాయని.. ఆ నీటిని సద్వినియోగం చేసుకునేలా పట్టిసీమ ద్వారా నీటిని తరలిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి వివరించారు. పోలవరం ప్రాజెక్టును పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇటీవలే ప్రొద్దుటూరులో జల్‌జీవన్ మిషన్-అమరజీవి జలధార పనులను ప్రారంభించామని... రాష్ట్రంలో మొత్తంగా 95 లక్షల గ్రామీణ కుటుంబాలు ఉంటే... వాటిల్లో 62 లక్షల మంది ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని.. తాజాగా 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు మంచినీటి కనెక్షన్లు అందించేలా పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ పనులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, పనులకు అనుగు ణంగా సత్వరం నిధులు విడుదల చేసేలా చూడాలని ముఖ్య మంత్రి కోరారు. నదుల అనుసంధానంతో కలిగే ప్రయోజనాలను కూడా సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు.

# పోర్టుల అభివృద్ధికి 20వేల ఎకరాల ఉప్పు భూములు ఇవ్వండి

### కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



న్యూఢిల్లీ (చైతన్యరథం): రాష్ట్రంలో పోర్టుల ఆధారిత పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సుమారు 20,378 వేల ఎకరాల ఉప్పు భూములను రాష్ట్రానికి బదలాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో జరిగిన భేటీలో సీఎం ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో పోర్టుల విస్తరణ, అనుబంధ మౌలిక వసతుల అభివృద్ధికి ఈ భూములను వినియోగించుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ డీపీఐఐటీ ఆధీనంలో ఉన్న 20,378 ఎకరాల ఉప్పు భూములను పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం కేటాయించాలని ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పెట్టినట్టు ముఖ్యమంత్రి వివరించారు. పోర్టులకు అవసరమైన అనుసంధాన రహదారులు, రైల్వే మార్గాలు, పారిశ్రామిక కార్యకలాపాలకు అనువైన భూమి అందుబాటులో ఉండటం కీలకమని వివరించారు.

#### వాణిజ్య పంటలకు అండగా నిలవాలి

ఏపీలో రైతులు పండిస్తున్న వాణిజ్య పంటలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర వాణిజ్య శాఖ సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో మిర్చి, పొగాకు, ఆక్వా తదితర వాణిజ్య పంటలకు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఆయా ఉత్పత్తుల ఎగుమతులకు అవసరమైన మార్కెట్ లింకేజీలు, మౌలిక వసతులు, నాణ్యతా ప్రమాణాలు, ప్రాసెసింగ్ సదుపాయాలను బలోపేతం చేయడానికి కేంద్రం సహకరించాలని కోరారు.

### కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో

## ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం



న్యూఢిల్లీ (చైతన్యరథం): రెండు రోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీలో వున్న ఏపీ సీఎం చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి పెండింగులో ఉన్న వివిధ అంశాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన పలు అంశాలపై ఇద్దరూ చర్చించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం గురించి దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించామని... దీన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు చొరవ తీసుకోవాలని అమిత్ షాను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

### అమరావతి ఓఆర్ఆర్‌కు

## పూర్తి సహకారం అందించండి

- పోలవరం వద్ద ఐకానిక్ వంతెన ప్రాజెక్టు చేపట్టండి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీలో సీఎం చంద్రబాబు విజ్ఞప్తి



న్యూఢిల్లీ (చైతన్యరథం): ఏపీ రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. 189 కిలోమీటర్ల పొడవైన ఓఆర్ఆర్ రాజధాని ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకం అవుతుందన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన ముఖ్యమంత్రి వివిధ అంశాలపై విజ్ఞాపన పత్రం అందించారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ వాటికి కేంద్రం నుంచి ఆమోదాలు, నిధులు, అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. రాష్ట్ర తీర ప్రాంత అభివృద్ధితో పాటు కనెక్టివిటీ పెంచేందుకు దోహదపడే బీచ్ రోడ్డు ప్రాజెక్టుపైనా దృష్టి సారించాలన్నారు. తీంర ప్రాంతంలోని నగరాలు, పర్యాటక ప్రాంతాలు, పోర్టులు, పారిశ్రామిక కేంద్రాల మధ్య మెరుగైన అనుసంధానం కల్పించేందుకు బీచ్ రోడ్ ఉపయోగపడుతుందని సీఎం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వద్ద ఎడమ, కుడి గట్లను కలిపేలా ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి సహకారం అందించాలని గడ్కరీని చంద్రబాబు కోరారు. ప్రాజెక్టుకు అనుబంధంగా అవసరమైన రహదారి, వంతెనల నిర్మాణానికి సహకరించాలని విన్నవించారు.

## నానా పటేకర్ అద్భుతమైన నటుడు: సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్యరథం): 'దిగ్గజ నటుడు నానా పటేకర్ మరణ వార్త తీవ్ర విచారానికి గురిచేసింది. భారతీయ సినిమాకి ఆయన అందించిన అద్భుతమైన నటన, విశేషమైన సేవలు రాబోయే తరాల వరకు గుర్తుండిపోతాయి. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, లెక్కలేనంత మంది అభిమానులకు నా సానుభూతి. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

# నేతలంతా పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలి



- చంద్రబాబుని ఆదర్శంగా తీసుకుని ప్రతి నాయకుడు పనిచేయాలి
- టీడీపీ ట్రైనింగ్ రిసోర్స్‌పర్సన్లతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మీట్ అండ్ గ్రీట్

మంగళగిరి (చైతన్యరథం): ఎంత సీనియర్ నేతలైనా టీడీపీ లైన్‌కు కట్టుబడి పనిచేయాల్సిందేనని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అన్నారు. గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శిక్షణా తరగతుల ట్రైనర్లతో లోకేష్ మీట్ అండ్ గ్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,300మంది క్లస్టర్, బూత్ ఇన్చార్జిలకు శిక్షణా తరగతులు పూర్తిచేశామని, 50వేల మందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నాయకులకు శిక్షణ తరగతులు నిరంతరం కొనసాగుతాయని, సమాజమే దేవాలయం -ప్రజలే దేవుళ్లు అన్న పార్టీ మూల సిద్ధాంతానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 45 రోజుల్లో 1.13కోట్ల ఇళ్లను నాయకులు సందర్శించారని చెప్పారు. పార్టీకంటే ఎవరూ గొప్పవారు కాదని, ఏదైనా అంశంపై పార్టీ నిర్ణయం తీసుకున్నాక అందరూ దానికి కట్టుబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. పార్టీలో కేవలం పెర్ఫార్మెన్స్ ఆధారంగానే నాయకులకు గుర్తింపునిస్తామని, ఈ విషయంలో ఎటువంటి సిఫారసులు, పైరవీలకు తావీయబోమని స్పష్టం చేశారు. పార్టీ కార్యక్రమాలను మరింత వేగంగా, సులభంగా గ్రాస్ రూట్ స్థాయి కేడర్‌కు తీసుకెళ్లేందుకు ఏఐని వినియోగిస్తున్నామని, అధునాతన టెక్నాలజీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ తరగతులకు వచ్చే నాయకులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని, అందరూ ఆర్థికంగా బలోపేతమై సొంత కాళ్లపై నిలబడేలా చేయాలన్నదే పార్టీ అధినేత చంద్రబాబు అంతరంగమని లోకేష్ తెలిపారు.

కేంద్రంలో బీజేపీ వరుసగా మూడుసార్లు అధికారంలోకి రావడానికి ఆ పార్టీ కేడర్ కమిట్‌మెంట్ ప్రధాన కారణమని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో కూడా ప్రభుత్వ కొనసాగింపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అందరికీ ఒకేసారి న్యాయం చేయడం సాధ్యం కాదని, వివిధ కారణాల వల్ల తొలి దశలో అవకాశాలు రానివారికి మలి విడతలో అవకాశం కల్పిస్తామని లోకేష్ చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం నుంచీ సేవలందిస్తున్న పలువురు సీనియర్ నాయకుల అనుభవాలను లోకేష్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మానవవనరుల విభాగం కో-ఆర్డినేటర్ వేపాడ చిరంజీవి, ఎంపీ చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు. సమర్థవంతంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నాయకులకు మంత్రి లోకేష్ ప్రశంసాపత్రాలు అందజేశారు.




నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రికి ప్రశంసా పత్రం అందజేస్తున్న లోకేష్





# నేడు ప్రకాశం జిల్లాలో సీఎం పర్యటన

- గర్భ కండ్రిక భూ సమస్యలకు పరిష్కారం
- పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్న చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రకాశం జిల్లాలో పర్యటించనున్నారు. జరుగుమల్లి మండలం నర్సింగుల గ్రామంలో 'మీ భూమి-మీ హక్కు' పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సీఎం హాజరు కానున్నారు. ప్రత్యేకించి దశాబ్దాలుగా పెండింగులో ఉన్న గర్భ కండ్రిక భూ సమస్యలకు ఆయన పరిష్కారం చూపనున్నారు. మొత్తం 4 మండలాల్లో 8 గ్రామాల్లో విస్తరించిన 2,915 ఎకరాల భూములను వివాదాల నుంచి తొలగించి 1,301 మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. కొండపి మండలంలోని ఇలవర, వెన్నూరు, జరుగుమల్లి మండలంలోని పచ్చవ, వర్ధినేనిపాలెం, నర్సింగోలు, కె.బిట్రగుంట, నాగులుప్పలపాడులోని ఓబన్నపాలెం, సింగరాయకొండలోని కాలికివాయ గ్రామాల్లో గర్భ కండ్రిక భూములకు వివాదాల నుంచి విముక్తి కల్పించనున్నారు. శుక్రవారం ఉదయం అమరావతి నుంచి బయల్దేరి ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం నర్సింగోలు చేరుకుంటారు. గ్రామంలోని రైతులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా మాట్లాడనున్నారు. 8 గ్రామా ల్లోని రైతులకు గర్భకండ్రిక భూముల సమస్యలను పరిష్కరించి పట్టాలు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు 'మీ భూమి-మీహక్కు' పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ బహిరంగ సభలో ప్రసంగిస్తారు. గ్రామసభలో పాస్ పుస్తకాల పంపిణీ అనంతరం పార్టీ శ్రేణులతో చంద్రబాబు సమావేశమవుతారు. సాయంత్రం 5.30 గంటలకు అమరావతి చేరుకుంటారు.

## నానా పటేకర్ పాత్రలు చిరస్థాయిగా నిలిచిపోతాయి: లోకేష్



అమరావతి (చైతన్యరథం): దిగ్గజ నటుడు నానా పటేకర్ మరణ వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. తన ప్రత్యేకమైన గొంతు, గంభీరమైన తెరపై ప్రదర్శనతో (స్క్రీన్ ప్రెజెన్స్) అద్భుతమైన నటనను కనబరిచిన ఆయన హిందీ, మరాఠీ చిత్రసీమలో మరచిపోలేని ఎన్నో అద్భుతమైన పాత్రలను మనకు అందించారు. పటేకర్ నటించిన పాత్రలు రాబోయే తరాల వరకు చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అసంఖ్యాకమైన అభిమానులకు నా సానుభూతి' అంటూ సామాజిక మాధ్యమం వేదికగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో

# మంత్రి లోకేష్ ప్రజా దర్బార్

### ప్రజలు, టీడీపీ కార్యకర్తల నుంచి వినతుల స్వీకరణ - సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చిన ప్రజలు, కార్యకర్తలను కలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్రంలో గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ వ్యవస్థలో విధులు నిర్వర్తిస్తున్న సంక్షేమ, విద్యా సహాయకులకు ప్రమోషన్ ఛానల్ కల్పించడంతోపాటు విద్యా శాఖలో పదోన్నతి అవకాశాలు కల్పించాలని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

గిరిజన బంజారా తండాల్లోని గుడి పూజారులకు నెలకు రూ.15వేల గౌరవ వేతనం మంజూరు చేయడంతోపాటు బంజారా దేవాలయాలకు ధూప, దీప, నైవేద్య పథకాన్ని వర్తింపజేయాలని బంజారా ధర్మ రక్షా సమితి ప్రతినిధులు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు గౌరవ వేతనం పెంచాలని రాష్ట్ర గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

చిత్తూరు జిల్లా గుడుపల్లి మండలం చీకటిపల్లె గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు శ్మశానవాటికకు బీటీ రోడ్డు నిర్మించాలని సి.విజయకుమార్ కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.





















చైతన్యరథం

# మెల్లెంపూడిలో గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు

## గంధ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్



మెల్లెంపూడి (చైతన్యరథం): సూఫీ ఆధ్యాత్మిక గురువు హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీని స్మరించే పవిత్ర ఉత్సవం గ్యార్మీ షరీఫ్ పండుగ. దీనిని మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి మండలం మెల్లెంపూడి గ్రామంలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్యార్మీ గంధ మహోత్సవాల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముస్లిం సోదర సోదరీమణులతో కలిసి ఆయన ప్రత్యేక దువాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఖాదిర్ బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. ఆధ్యాత్మిక చింతనను పండుగ ప్రబోధిస్తుందని.. మత సామరస్యం, సోదరభావానికి గ్యార్మీ లాంటి పండుగలు ప్రతీకగా నిలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మెల్లెంపూడి గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ ఖాశీంబాబు, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, పఠాన్ ఖాశీంఖాన్, తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు దాసరి కృష్ణ, హజరత్ మహబూబ్ సుభానీ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.















# గుడ్డు.. పోషకాహారానికి చౌకైన వనరు

- ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్‌ది అగ్రస్థానం
- 2,739.04 కోట్ల గుడ్ల ఉత్పత్తి.. దేశ ఉత్పత్తిలో 18.37 శాతం వాటా
- ప్రజల పోషక భద్రతకు, పౌల్ట్రీ రైతుల ఆదాయ వృద్ధికి ప్రాధాన్యం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పౌల్ట్రీ రంగానికి ప్రోత్సాహం
- పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీతో ఆధునిక యూనిట్లు, మౌలిక సదుపాయాలకు చేయూత
- స్థానిక వినియోగం, ఎగుమతుల పెంపుతో విస్తృత వ్యాపార అవకాశాలు
- ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




అమరావతి (చైతన్యరథం): అందరికీ సరసమైన ధరలో లభించే నాణ్యమైన పోషకాహారం గుడ్డు అని, గుడ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అక్టోబర్ 9న ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఒక ప్రకటనలో ప్రజలు గుడ్డు పోషక విలువలపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన ప్రోటీన్‌ను అందించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించడంలో పౌల్ట్రీ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ నెల రెండో శుక్రవారం ప్రపంచ గుడ్డు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని, గుడ్డు వల్ల కలిగే పోషక ప్రయోజనాలను ప్రజలకు తెలియజేయడం, సమతుల్య ఆహారంలో దాని ప్రాధాన్యతపై అవగాహన కల్పించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రి వివరించారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ప్రోటీన్‌తోపాటు పలు అవసరమైన పోషకాలను పొందేందుకు గుడ్డు ఉపయోగపడుతుందన్నారు. పిల్లలు, యువత, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, శారీరక శ్రమ చేసేవారు తమ వయస్సు, ఆరోగ్య పరిస్థితి, పోషక అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఆహారంలో గుడ్డును చేర్చుకోవచ్చని సూచించారు. రాష్ట్రంలో 1,190.88 లక్షల కోళ్ల సంపదతో పౌల్ట్రీ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారంగా కొనసాగుతోందని అచ్చెన్నాయుడు తెలిపారు. 2024-25లో ఆంధ్రప్రదేశ్ 2,739.04 కోట్ల గుడ్ల ఉత్పత్తిని నమోదు చేసి దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి అయిన 14,911 కోట్ల గుడ్లలో రాష్ట్ర వాటా 18.37 శాతంగా ఉందని వివరించారు. ఈ స్థాయికి చేరుకోవడంలో పౌల్ట్రీ రైతుల కృషి ప్రశంసనీయమని, రాష్ట్ర అగ్రస్థానాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పౌల్ట్రీ రంగానికి ప్రోత్సాహం అందిస్తోందన్నారు.

**పౌల్ట్రీ రంగానికి మరింత ప్రోత్సాహం**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణాంధ్ర-2047, వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా పౌల్ట్రీ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పెరుగుతున్న అవసరాలను తీర్చడం, స్వయం సమృద్ధిని సాధించడం, కొత్త అభివృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడం లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ డెవలప్‌మెంట్ పాలసీ 2026-29ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. పౌల్ట్రీ రైతులకు మౌలిక సదుపాయాలు, ఆధునిక పౌల్ట్రీ యూనిట్ల ఏర్పాటు, వడ్డీ రాయితీలు, తదితర ప్రోత్సాహకాలతో ఈ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని వివరించారు. స్థానికంగా గుడ్ల వినియోగాన్ని పెంచడంతోపాటు వివిధ పౌల్ట్రీ ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తలసరి గుడ్ల వినియోగం సంవత్సరానికి సుమారు 108 గుడ్లుగా ఉందని, జాతీయ స్థాయిలో తలసరి వార్షిక గుడ్ల లభ్యత సుమారు 104గా ఉందని మంత్రి తెలిపారు. తలసరి వార్షిక వినియోగాన్ని 180 గుడ్లుగా పరిగణిస్తే రాష్ట్రంలో సుమారు 959 కోట్ల గుడ్లకు, దేశంలో సుమారు 26,280 కోట్ల గుడ్లకు డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ అంచనాలు పౌల్ట్రీ రంగంలో ఉత్పత్తి విస్తరణకు, పెట్టుబడులకు, కొత్త వ్యాపార అవకాశాలకు ఉన్న సామర్థ్యాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. గుడ్ల ఉత్పత్తి పెరగడం ద్వారా పౌల్ట్రీ రైతులకు స్థిరమైన ఆదాయ అవకాశాలు లభించడంతోపాటు ప్రజలకు సరసమైన ధరలో నాణ్యమైన ప్రోటీన్ అందుతుందని అచ్చెన్నాయుడు అన్నారు. అందువల్ల ఉత్పత్తి, వినియోగం రెండింటినీ ప్రోత్సహించడం రాష్ట్ర ఆహార, పోషక భద్రతలో ముఖ్యమైన అంశమని స్పష్టం చేశారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, గుడ్లు, పౌల్ట్రీ ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడం, వినియోగదారులకు సురక్షితమైన ఆహారాన్ని అందించడం లక్ష్యంగా పశుసంవర్ధక శాఖ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పౌల్ట్రీలో వ్యాధుల నియంత్రణ, బయోసెక్యూరిటీ, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, పరిశుభ్రత, సురక్షితమైన గుడ్ల ఉత్పత్తిపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని పౌల్ట్రీ రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపీ మారిటైమ్ దూకుడు.. మహారాష్ట్ర ప్రశంసలు

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో మహారాష్ట్ర మంత్రి భేటీ
- గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, షిప్‌బిల్డింగ్‌పై విస్తృత చర్చ
- ల్యాండ్ లార్డ్ మోడల్‌పై మహారాష్ట్ర ఆసక్తి.. ఏపీ విధానాలపై అధ్యయనం





అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ప్రముఖ మారిటైమ్, పోర్ట్, లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై మహారాష్ట్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. మహారాష్ట్ర పోర్టులు, మత్స్యశాఖ మంత్రి నితేష్ రాణే గురువారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, షిప్‌బిల్డింగ్, లాజిస్టిక్స్, పోర్టు ఆధారిత పారిశ్రామిక అభివృద్ధిపై ఇరువురు మంత్రులు విస్తృతంగా చర్చించారు.

**ల్యాండ్ లార్డ్ మోడల్‌కు ప్రశంసలు**

ఆంధ్రప్రదేశ్‌లో మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను ల్యాండ్ లార్డ్ మోడల్‌లో అభివృద్ధి చేస్తున్న విధానాన్ని మహారాష్ట్ర మంత్రి నితేష్ రాణే ప్రశంసించినట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రభుత్వం పోర్టు మౌలిక వసతులను అభివృద్ధి చేసి, అనంతరం ప్రైవేట్ సంస్థలకు ఆపరేషన్లు అప్పగించే విధానంపై ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ విధానం ద్వారా ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ఒక్కో పోర్టుకు రూ.4,500 కోట్ల పెట్టుబడి**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీని మారిటైమ్, పోర్ట్, లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్న ఒక్కో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సుమారు రూ.4,500 కోట్ల పెట్టుబడి వ్యయంతో పనులు చేపడుతున్నట్లు వివరించారు. 2027 నాటికి పోర్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**షిప్‌బిల్డింగ్‌పై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలో షిప్‌బిల్డింగ్ రంగాన్ని కూడా విస్తరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దుగరాజపట్నంలో మజగావ్ డాక్ యార్డ్, మచిలీపట్నంలో గోవా షిప్‌యార్డ్ యాంకరేజ్‌కు ఎంవోయూలు కుదిరాయని, కాకినాడలో షిప్‌బిల్డింగ్‌కు సంబంధించిన ప్రతిపాదన పురోగతిలో ఉందని వివరించారు. షిప్‌బిల్డింగ్, మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, తదితర అనుబంధ రంగాల్లో పెట్టుబడులతో పాటు నైపుణ్యం కలిగిన మానవ వనరులకు డిమాండ్ పెరుగుతుందని తెలిపారు.

**ఫిషింగ్ హార్బర్లపై మహారాష్ట్ర ఆసక్తి**

మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్లను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని మంత్రి వివరించారు. మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించి, అనంతరం అనుభవం కలిగిన ప్రైవేట్ సంస్థలకు ఆపరేషన్లు అప్పగించే విధానంపై మహారాష్ట్ర మంత్రి ఆసక్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.

**వాటర్ మెట్రో.. సీప్లేన్ సేవలకు ప్రణాళిక**

విజయవాడ-అమరావతి వాటర్ మెట్రో ప్రాజెక్టుకు అనుమతులు లభించాయని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సీప్లేన్ సేవల కోసం 9 ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా గుర్తించిందని పేర్కొన్నారు. శ్రీశైలం-విజయవాడ మధ్య సీప్లేన్ ట్రయల్ రన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన విషయాన్ని కూడా వివరించారు.

**రాయలసీమకు మల్టీమోడల్ కనెక్టివిటీ**

రాయలసీమ నుంచి వ్యవసాయ, హార్టికల్చర్ ఉత్పత్తులను దేశ, విదేశీ మార్కెట్లకు వేగంగా తరలించేందుకు మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పోర్టులు, రైల్వేలు, జాతీయ రహదారులు, అంతర్గత జల రవాణా మార్గాలను అనుసంధానించడం ద్వారా పోర్టు ఆధారిత అభివృద్ధి ప్రయోజనాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించడమే లక్ష్యమన్నారు.

**20 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్‌కు ప్రతిపాదన**

భవిష్యత్ మారిటైమ్ మౌలిక వసతుల కోసం తీర ప్రాంతంలోని సుమారు 20 వేల ఎకరాల ఉప్పు భూములను ఏపీ మారిటైమ్ బోర్డుకు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్‌లో పోర్టులు, లాజిస్టిక్స్, పారిశ్రామిక మౌలిక వసతులు, ఇతర మారిటైమ్ ప్రాజెక్టులకు ఈ భూములను వినియోగించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

**రెండు రాష్ట్రాల మధ్య సహకారానికి నిర్ణయం**

మహారాష్ట్రలో పోర్టులు, మత్స్య రంగ అభివృద్ధికి అమలు చేస్తున్న విధానాలపై కూడా ఇరువురు మంత్రులు చర్చించారు. గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, పీపీపీ విధానం, మారిటైమ్ బోర్డు ఆధ్వర్యంలోని అభివృద్ధి మోడళ్లపై పరస్పర అనుభవాలను పంచుకోవాలని నిర్ణయించారు. తీరప్రాంత రాష్ట్రాల మధ్య సమన్వయం, ఉత్తమ విధానాలు, సాంకేతిక అనుభవాల మార్పిడి ద్వారా మారిటైమ్ రంగంలో మరింత అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని ఇరువురు మంత్రులు అభిప్రాయపడ్డారు.

# 2027 నాటికి పోలవరం పూర్తి లక్ష్యం

- ఫేజ్-2కు కేంద్రాన్ని రూ.42,500 కోట్లు కోరాం
- పోలవరంతో జలరవాణాకు మార్గం సుగమం
- గోదావరి-కావేరి అనుసంధానంతో ఐదు రాష్ట్రాలకు ప్రయోజనం
- పోలవరం చుట్టూ రోడ్ కనెక్టివిటీకి ప్రాధాన్యత
- అద్భుత పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

న్యూఢిల్లీ (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భవిష్యత్తులో కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్, ఉన్నతాధికారుల సమక్షంలో గురువారం జరిగిన సమావేశం సానుకూల వాతావరణంలో జరిగిందని మంత్రి రామానాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషిని కేంద్ర ప్రభుత్వం అభినందించిందన్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశం వివరాలను అనంతరం మీడియాకు మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేశారు.

**పోలవరం పనుల్లో గణనీయమైన పురోగతి**

గత వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును ప్రశ్నార్థకంగా మార్చడంతో పాటు డయాఫ్రమ్ వాల్‌ను విధ్వంసం చేసిందని మంత్రి నిమ్మల విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరాన్ని 2027 నాటికి పూర్తి చేయాలనే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనులను వేగవంతం చేసిందన్నారు. ప్రస్తుతం పోలవరం సివిల్ పనులు 88 శాతం, భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులు ఆర్థికంగా 64 శాతం, మొత్తంగా ప్రాజెక్టు భౌతిక పురోగతి 83 శాతం, ఆర్థిక పురోగతి 78 శాతానికి చేరిందని మంత్రి నిమ్మల తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి జలశక్తి మంత్రి పాటిల్‌కు, కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

**ఫేజ్-2కు రూ.42,500 కోట్లు కోరాం**

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2019కు ముందు ఫేజ్-1, ఫేజ్-2 అనే విభజన లేదని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2019 ఫిబ్రవరిలోనే టీడీపీ ప్రభుత్వం ఉన్న సమయంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రూ.55,548.87 కోట్లకు ఆర్‌సీఈ ఆమోదం పొందిందన్నారు. తరువాత వచ్చిన జగన్ రెడ్డి ప్రభుత్వంలోనే ఫేజ్-1, ఫేజ్-2 అనే ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ప్రస్తుతం 41.15 మీటర్ల కాంటూర్ వరకు ఫేజ్-1లో నీటిని నిల్వ చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు, తరువాత 45.72 మీటర్ల కాంటూర్ వరకు




ప్రాజెక్టును పూర్తి చేయాల్సి ఉందన్నారు. మిగిలిన భూసేకరణ, పునరావాసం తదితర అవసరాల కోసం సుమారు రూ.42,500 కోట్ల వరకు అవసరమవుతుందని, ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని కోరినట్లు మంత్రి నిమ్మల తెలిపారు.

**పోలవరం చుట్టూ రోడ్ కనెక్టివిటీకి ప్రాధాన్యత**

పోలవరం పూర్తయిన తర్వాత దేశవ్యాప్తంగా ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా అభివృద్ధి చెందనున్నందున, మెరుగైన రహదారి కనెక్టివిటీ అవసరమని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అమరావతి-ఖరగ్‌పూర్ సిక్స్ లేన్ ఎకనామిక్ కారిడార్ పోలవరం దిగువ నుంచి వెళ్తున్నందున, దాన్ని పోలవరం స్పిల్‌వేకు సుమారు ఒక కిలోమీటర్ సమీపానికి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్‌హెచ్-365 బీబీ కొవ్వూరు, ఎన్‌హెచ్-516 ఈ రాజమండ్రి, ఎన్‌హెచ్-16 రాజానగరం మీదుగా చెన్నై-కోల్‌కతా మార్గాలతో పోలవరానికి మెరుగైన కనెక్టివిటీ కల్పించాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

**పర్యాటక ఆకర్షణగా పోలవరం స్పిల్‌వే**

పోలవరం స్పిల్‌వే సుమారు 1,118 మీటర్ల పొడవు, 48 రేడియల్ గేట్లు, సుమారు 50 లక్షల క్యూసెక్కుల వరదను విడుదల చేయగల సామర్థ్యం కలిగి ఉన్నందున, గోదావరి చరిత్రను ప్రతిబింబించేలా స్పిల్‌వేను అభివృద్ధి చేయాలని కోరినట్లు మంత్రి నిమ్మల తెలిపారు. స్పిల్‌వే వద్ద వ్యూ గ్యాలరీలు, లైటింగ్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసి పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించినట్లు చెప్పారు.

పోలవరం పరిధిలోని సుమారు 9,900 ఎకరాలను సమగ్ర టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని కేంద్ర జలశక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గోదావరి కొండలు, ప్రకృతి సౌందర్యం, 194 టీఎంసీల భారీ రిజర్వాయర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు.

**జలరవాణాకు మరింత ప్రాధాన్యత**

భద్రాచలం నుంచి రాజమండ్రి, కాకినాడ వరకు జాతీయ జలమార్గాన్ని మరింత అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2009లో క్లాస్-3గా నోటిఫై చేసిన ఈ జలమార్గాన్ని కొనసాగిస్తూ విస్తరించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

**గోదావరి-కావేరి అనుసంధానం వేగవంతం చేయాలి**

గోదావరి-కావేరి నదుల అనుసంధానాన్ని బనకచర్ల మీదుగా త్వరితగతిన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గోదావరి నుంచి కావేరికి నీటిని అనుసంధానం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు భవిష్యత్తులో నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌లను వేగంగా సిద్ధం చేసి ముందుకు వెళ్లాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు.

సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా ఈ ఏడాది గోదావరి నుంచి భారీగా వరద నీరు సముద్రంలోకి వెళ్లిందని మంత్రి తెలిపారు. ఒక రోజులోనే సుమారు 122 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని, గోదావరి వరద జలాలను సద్వినియోగం చేసుకునేలా గోదావరి-కావేరి అనుసంధానం చేపడితే భారీగా నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

**జలవనరుల రంగంలో విప్లవాత్మక మార్పులు**

గత వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని మంత్రి రామానాయుడు విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ఒక్కొక్కటిగా సరిచేస్తూ, నిలిచిపోయిన ప్రాజెక్టులను తిరిగి పట్టాలెక్కిస్తోందన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టులో ఐదు సంవత్సరాల్లో గత ప్రభుత్వం చేయలేని పనులను కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే పూర్తి చేసి 728వ కిలోమీటర్ వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లిందని తెలిపారు.

అదేవిధంగా మూడు దశాబ్దాల కలగా మిగిలిన వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను పూర్తి చేసి, గత ఆగస్ట్ 31న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా కృష్ణా జలాలను ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు తీసుకెళ్లిన విషయాన్ని మంత్రి రామానాయుడు గుర్తు చేశారు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌పై ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం కనీసం దృష్టి పెట్టలేదని, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే సుమారు రూ.1,800 కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేసిందన్నారు. గోదావరి జలాలు ఉత్తరాంధ్ర నేలను తాకేలా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.

గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడిని సీఈవో ఆఫ్ ఆంధ్రప్రదేశ్ గా పిలిచేవారని, ప్రస్తుతం జలవనరుల రంగంలో ఆయన చేస్తున్న కృషి కారణంగా వాటర్ మేన్ గా గుర్తింపు పొందుతున్నారని మంత్రి నిమ్మల తెలిపారు. సాగునీరు, తాగునీరు, జలవనరుల అభివృద్ధిలో రాష్ట్రానికి కొత్త దిశను చూపుతూ కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# పర్యావరణ హితంగా ఖనిజాన్వేషణ

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వనరుల అభివృద్ధి
- రాష్ట్ర వ్యాప్తంగా ఉండే ఖనిజాల వివరాలు డిజిటల్ విధానంలో మ్యాపింగ్
- 'మెరిట్' గవర్నింగ్ బాడీ రెండో సమావేశంలో అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచనలు

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ మైనింగ్ రంగాన్ని అన్ని రంగాల్లో అత్యద్భుతంగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో 'మెరిట్' (మినరల్ ఎక్స్‌ప్లొరేషన్, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ ట్రస్ట్) గవర్నింగ్ బాడీ రెండవ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్టంగా ఉపయోగిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షించే విధానాలతో మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేసి, రాష్ట్ర ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా 'మెరిట్' పని చేస్తోందని, రాష్ట్ర మైనింగ్ రంగాన్ని దేశంలోనే ఉత్తమం గా నిలిపేలా పని చేయాలని మంత్రి సూచించారు. కాగా రాష్ట్రంలో మైనింగ్ అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం, కొత్త ఖనిజ నిల్వలను గుర్తించడమే ధ్యేయంగా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

అంతకు ముందు అధికారులు వివిధ అంశాలను వివరిస్తూ మైనర్ మినరల్ లీజుదారుల నుంచి వచ్చే సీనరేజి రుసుములో 2% విరాళం, కేంద్ర ఎన్ఎంఈటీ గ్రాంట్ల ద్వారా ఇప్పటి వరకు 'మెరిట్' ట్రస్ట్‌కు రూ. 177.05 కోట్ల రాబడి సమకూరిందన్నారు. ఇందులో ఇప్పటివరకు రూ.



21 కోట్లు (11.9%) వివిధ అన్వేషణ పనులకు ఖర్చు చేయగా, ప్రస్తుతం రూ.156.05 కోట్ల నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా 'ప్రీ-ఎంబెడెడ్ క్లియరెన్స్' విధానం అమలు చేస్తున్నాం. సాధారణంగా గనుల వేలం పూర్తయ్యాక పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు రావడానికి సుమారు 48 నెలల సమయం పడుతుంది. అయితే, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వమే స్వయంగా పర్యావరణ, మైనింగ్ ప్లాన్ అనుమతులను తీసుకుని వేలం వేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని వివరించారు.

జయంతిపురం, దేవుడి, గుండ్లకుంట, అలగుమల్లిపాడు, నడికుడి, రామాపురం, పిల్లుట్ల పిడుగురాళ్ల వంటి 9 బ్లాక్‌లకు అనుమతుల ప్రక్రియ వేగవంతం చేశామని అధికారులు తెలిపారు. ఈ-వేలం 2027 జనవరి 1 నుండి 22 మధ్య పూర్తి కానుంది. దేశంలోనే 95% బైరటీస్ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే కడప జిల్లా మంగంపేట గనిలో ప్రస్తుత నిల్వలు మరొక 3 నుండి 4 సంవత్సరాలకు మాత్రమే సరిపోతాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గని ఆయుష్షును పెంచేందుకు మెస్సర్స్ ఆటోమియోనిక్స్ ఇండియా సంస్థతో కలిసి రూ. 9.90 లక్షలతో ఆధునిక 'క్వాంటమ్ గ్రావిమీటర్' ద్వారా భూగర్భంలో అదనపు ఖనిజ నిల్వలను గుర్తించే ప్రయోగాత్మక సర్వేకు ఈ సమావేశంలో ఆమోదం తెలిపారు. మెస్సర్స్ జియోవేల్ సర్వీసెస్ సంస్థ ద్వారా చేపట్టిన రాష్ట్రవ్యాప్త మైనింగ్ మ్యాపింగ్‌లో ప్రాథమికంగా 339 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు.

రాబోయే ఐదేళ్లపాటు ఖనిజ అన్వేషణకు సంబంధించిన సమగ్ర రోడ్‌మ్యాప్‌ను కూడా ఈ సంస్థ త్వరలోనే సమర్పించనుంది. అనంతపురం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో క్రిటికల్ మినరల్స్ అన్వేషణకు ఐఐటీ హైదరాబాద్ అనుబంధ సంస్థ క్రిటికల్ మినరల్ ట్రాకర్స్ ద్వారా ఏఐ/ఎంల్ మ్యాపింగ్ పూర్తి చేశారు. బండలమోటు పాత గనుల వ్యర్థాలలో రాగి, వెండి, కోబాల్ట్, రేర్ ఎర్త్ మూలకాల లభ్యతపై అధ్యయనం పూర్తైంది. ఐఐటీ ధన్‌బాద్ (౦జుశవీ×చీ)తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు, సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్‌తో కడప బేసిన్‌లో లిథియం, గాలియం వంటి వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణకు మైత్రి ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్రంలో ఐరన్ ఓర్, లైమ్‌స్టోన్, క్వార్ట్జ్, తదితర ఖనిజాల అన్వేషణకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆమోదం పొందిన 18 ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీలను ఎంప్యానెల్ చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా వేలంలో పారదర్శకతతో రూ. 7.01 కోట్ల విలువైన 6 ప్రధాన అన్వేషణ పనులను అప్పగించారు. సమావేశంలో మైనింగ్ డైరెక్టర్ డబ్ల్యూబీ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగ్గా ఐపీ సేవలు

- గత ఆరు నెలల్లో 8% వృద్ధి
- వైద్య సిబ్బంది హాజరు 80% నుంచి 90% నమోదు
- మధ్యాహ్నం కూడా నమోదు చేయాలన్న మంత్రి సత్యకుమార్ యాదవ్
- ప్రధాన ఆసుపత్రుల్లో పడకల సంఖ్య పెంచాలని ఆదేశం
- గత 2 త్రైమాసికాల్లో కేంద్ర నిధుల వినియోగంలో భారీ పెరుగుదల పట్ల హర్షం
- ఆసుపత్రులు, మంత్రిత్వ శాఖ పనితీరుపై 4 గంటలు సమీక్షించిన మంత్రి



అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వాసుపత్రుల ఐపీ (ఇన్ పేషెంట్) సేవల్లో గణనీయమైన పురోగతి ఉందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబరు, 2026) ప్రభుత్వాసుపత్రుల పనితీరు, బడ్జెట్ వ్యయంపై గురువారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో 4 గంటలపాటు మంత్రి సత్యకుమార్ లోతుగా సమీక్షించారు. రోగులకు అందుతున్న సేవలు, వివిధ శాఖల పనితీరుపట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షల మేరకు ప్రజల సంతృప్తి స్థాయికి అనుగుణంగా నాణ్యమైన సేవలు అందించడం అందరి సమష్టి బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.

### ఐపీ అడ్మిషన్లల్లో భారీ వృద్ధి

గత ఆరు నెలల కాలంలో వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు భారీగా పెరిగినట్లు మంత్రి నిర్వహించిన సమీక్షలో వెల్లడైంది. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వాసుపత్రుల్లో మొత్తం 27,29,534 మంది రోగులు చికిత్స నిమిత్తం చేరారు. ప్రస్తుత సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో ఇన్‌పేషెంట్ల సంఖ్య 15,77,398కి చేరి, గత సంవత్సరంలోని మొదటి 6 నెలల కంటే సుమారు 8% వృద్ధి నమోదైనట్లు అధికారులు వివరించారు. ఈ పరిణామం ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ, విశ్వాసానికి చిహ్నమని, ఈ స్ఫూర్తితో వైద్య సిబ్బంది మరింత దీక్షతో సేవలు అందించాలని మంత్రి సత్యకుమార్ సూచించారు. అంతేకాకుండా ఇన్ పేషంట్ల రద్దీకి తగ్గట్టు ప్రధాన బోధన ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని డీఎంఈ అధికారులను ఆదేశించారు.

ఆయుష్ ఆసుపత్రుల్లో చేరిన ఇన్‌పేషెంట్ల సంఖ్య గత ఆరు నెలల్లో 21% పెరగడం ఈ సేవల పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు తార్కాణమని మంత్రి అన్నారు.

### నిలకడగా ఓపీ సేవలు

గత ఆరు నెలల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2025-26తో పోల్చితే ఓపీ సేవలు నిలకడగా కొనసాగాయి. డీఎంఈ ఆసుపత్రుల్లో గత ఏడాది ప్రథమార్ధంతో పోలిస్తే దాదాపు 2% వృద్ధి నమోదైంది. ఆయుష్ ఆసుపత్రుల్లో ఓపీ సేవల్లో 15% భారీ పెరుగుదల కనిపించింది. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో గత ఏడాది స్థాయిలో ఓపీ సేవలు కొనసాగగా, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది.

### డయాగ్నస్టిక్ సేవల్లోనూ పురోగతి

రోగాల నిర్ధారణకు కీలకమైన డయాగ్నస్టిక్ సేవలు 2025-26లో 18.19 కోట్లుగా నమోదు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ఇవి 9.65 కోట్లుగా నమోదై 3.03% పెరిగాయి. ప్రభుత్వాసుపత్రుల పనితీరు, వాటిపట్ల ప్రజాభిప్రాయాన్ని వెల్లడించే ఈ మూడు అంశాల్లో గత ఆరు నెలల్లో సత్ఫలితాలు రావడంపట్ల మంత్రి సత్యకుమార్ సంతోషం వ్యక్తం చేశారు.

### మధ్యాహ్నం పూట కూడా వైద్యుల హాజరు నమోదు

ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు పొందే రోగులకు నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండేలా చేసేందుకు మధ్యాహ్నం పూట కూడా వారి హాజరును నమోదు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా కూటమి ప్రభుత్వ హయాంలో వైద్య సిబ్బంది హాజరు 80% నుంచి 90% వరకు నమోదవుతోందని, అయినా పనివేళల్లో కొందరు వైద్యులు విధుల్లో ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం చేసే హాజరు నమోదుకు అదనంగా మధ్యాహ్నం పూట కూడా హాజరు తీసుకోవడంపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

గత ఆరు నెలల్లో వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సిబ్బంది హాజరు 85.8% నుంచి 92.0% వరకు నమోదుకాగా, డీఎంఈ ఆసుపత్రుల్లో మాత్రం హాజరు 5% తగ్గి 76.02%గా నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది. ఈ తగ్గుదలకు కారణాలను సమగ్రంగా విచారిస్తామని మంత్రికి డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ హామీ ఇచ్చారు. మంత్రిత్వ శాఖలోని 9 వివిధ విభాగాల్లో గత ఆరు నెలల్లో ఆరింట్లో హాజరు పెరగ్గా, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఐపీఎంలో హాజరు కొంతమేరకు తగ్గినట్లు నమోదైంది.

### గాడినపడ్డ బడ్జెట్ వ్యయం

గత ఆరు నెలల్లో బడ్జెట్ వ్యయం బాగా పెరిగినట్లు సమీక్షలో వెల్లడైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ (మొదటి త్రైమాసికం) కాలంలో బడ్జెట్ వ్యయాన్ని మంత్రి సత్యకుమార్ సమీక్షించినప్పుడు బడ్జెట్ వ్యయం 20% లోపుగానూ, కేంద్ర నిధుల వినియోగం కేవలం 17% మాత్రమే నమోదు అవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేసి, రెండో త్రైమాసికం చివరకు బడ్జెట్ వ్యయం 50% ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరిమిలా తాజా సమీక్షలో కేంద్ర నిధుల వ్యయం గత ఆరు నెలల కాలానికి 52% నమోదు కాగా, మొత్తం బడ్జెట్ వ్యయం 44%కి చేరుకుంది. గత 3 నెలల్లో ఈ విషయంలో సాధించిన ప్రగతిపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంత్రిత్వ శాఖలోని ప్రధాన విభాగాలకు మొత్తం కేటాయింపులు రూ.19,316.25 కోట్లు కాగా, గత ఆరు నెలల్లో మొత్తం రూ.8,501.44 కోట్ల ఖర్చు నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ వ్యయంలో కేంద్ర సాయం రూ.2,673.28 కోట్లు ఉండగా, గత ఆరు నెలల్లో వివిధ విభాగాలు రూ.1,390.01 కోట్ల మేరకు వినియోగించుకోవడం గమనార్హం.

### ఇంజినీరింగ్ విభాగంపై మంత్రి తీవ్ర అసంతృప్తి

సమీక్షలో ప్రభుత్వాసుపత్రులకు సంబంధించిన పలు ప్రధానమైన నిర్మాణ పనులకు సంబంధించి ఏపీఎస్ఎంఐడీసీ ఇంజినీరింగ్ విభాగం వైఫల్యాలు వెల్లడికావడంపై మంత్రి సత్యకుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాత, కొత్త సర్వజనాసుపత్రులు, వైద్య కళాశాలల నిర్మాణాలకు సంబంధించిన కేటాయింపుల్లో అతి స్వల్ప వ్యయం నమోదుకావడానికి ఇంజినీరింగ్ విభాగం పనితీరు కారణమని నిర్ధారణ అయింది. ఈ విషయంపై సమీక్ష జరుగుతున్న సమయంలో ఏపీఎస్ఎంఐడీసీ చీఫ్ ఇంజినీర్‌తో పాటు, సహచర ఇంజినీర్లు సమీక్షలో లేకపోవడంపట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగం పనితీరును గాడిన పెట్టేందుకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని శాఖ కార్యదర్శి వీర పాండియన్‌ను మంత్రి ఆదేశించారు.

### సమీక్షా నిర్ణయాలు పటిష్ఠంగా అమలు

మంత్రి సత్యకుమార్ గురువారం చేపట్టిన సుదీర్ఘ సమావేశంలో వెల్లడైన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను పటిష్ఠంగా అమలు చేయాలని వివిధ విభాగాధిపతులను, ఉన్నతాధికారులను మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీర పాండియన్ ఆదేశించారు. జరిగిన చర్చ మేరకు బడ్జెట్ అంశాలను మరింత స్పష్టంగా, సమగ్రంగా నివేదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ పద్మావతి, ఆయుష్ కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ, ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పీడీ స్మరణ్ రాజ్, డ్రగ్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్ జనరల్ అరుణ్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు విద్యే పెద్ద ఆస్తి

- పురపాలక మంత్రి నారాయణ ఉద్ఘాటన
- సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ రూపు తెస్తున్నామని వెల్లడి
- నెల్లూరు డీఎస్ఆర్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యా కమిటీ, తల్లిదండ్రులతో మంత్రి ఆత్మీయ సమావేశం



నెల్లూరు (చైతన్యరథం): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. మూలాపేటలోని డీఎస్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో గురువారం ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులతో మంత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

డీఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించిన పాఠశాలను పరిశీలించిన తల్లిదండ్రులు పాఠశాల రూపురేఖలు పూర్తిగా మార్చిన మంత్రి నారాయణ, డీఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం విద్యా కమిటీ సభ్యులను మంత్రి సత్కరించారు. తన కుమార్తె పొంగూరు షరణితో కలిసి విద్యార్థులతో మధ్యాహ్న భోజనం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను తాటాకు గుడిసెలో పుట్టి కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నానని తెలిపారు. పైసా పెట్టుబడి లేకుండా గుడిసెలో ఐదుగురు విద్యార్థులకు ట్యూషన్ చెప్పడం ప్రారంభించానని, అంచెలంచెలుగా ఎదిగి నారాయణ విద్యాసంస్థలను 30 రాష్ట్రాలకు విస్తరించానని చెప్పారు. తాను పురిటిగడ్డ రుణం తీర్చుకోవాలన్న సేవాభావంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. పేదరిక నిర్మూలనలో తన వంతు కృషి చేస్తూనే నెల్లూరును అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని అన్నారు.

పేదల కోసం పక్కా ప్రణాళికతో పనిచేస్తుంటే వైసీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ఉనికి కోసం అసత్య ఆరోపణలు చేస్తూ అవాకులు, చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు.

### ప్రభుత్వ సొమ్ము లేకుండానే ఆధునీకరణ

డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు మంత్రి నారాయణ శ్రీకారం చుట్టారన్నారు. పేదలకు విద్యను ఆస్తిగా ఇవ్వాలన్న సంకల్పంతో ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేయకుండా సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు అనుగుణంగా నెల్లూరు సిటీలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. పాఠశాలల ఆధునీకరణ బాధ్యతలను అపార అనుభవం ఉన్న నారాయణ కుమార్తె పొంగూరు షరణికి అప్పగించడం అభినందనీయమన్నారు.

### కార్పొరేట్ స్థాయి విద్య ఉచితంగా

పొంగూరు షరణి మాట్లాడుతూ నెల్లూరులో విద్యావిప్లవానికి తన తండ్రి నారాయణ శ్రీకారం చుట్టారన్నారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. నారాయణ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నామని, లక్షల రూపాయల విలువైన కార్పొరేట్ స్థాయి విద్యా వాతావరణాన్ని పేద విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో డీఈఓ బాలాజీరావు, ఎంఈఓ తిరుపాల్, ఐసీడీఎస్ పీడీ శైలజ, డీఎస్ఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అసిస్టెంట్ కమిషనర్ రేష్మా, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, డీఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ ప్రతినిధి అనీల్, డివిజన్ టీడీపీ నాయకులు మనోహర్, గండవరపు నాని, అన్నంగి ప్రసాద్, విద్యా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో ఏపీ టూరిజానికి సరికొత్త హంగులు

**ఏఐ, క్వాంటం టెక్నాలజీతో పర్యాటకం కొత్త పుంతలు - స్పెయిన్ పర్యటనలో రాష్ట్ర టూరిజం మంత్రి కందుల దుర్గేష్ - టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో ఏపీ పర్యాటక రంగంపై ప్రశంసలు**




అమరావతి (చైతన్యరథం): అంతర్జాతీయ పర్యాటక రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, టెక్నాలజీ వినియోగంపై ఎన్నో విలువైన విషయాలు తెలుసుకున్నామని, స్పెయిన్ టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో పొందిన అద్భుతమైన అనుభవాలను, ఉత్తమ విధానాలను ఏపీలో పర్యాటక అభివృద్ధికి పూర్తిస్థాయిలో అమలు చేయడానికి విశేష కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. స్పెయిన్ లోని సెవిల్లె-ఫిబెస్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్-2026'లో భాగంగా మూడో రోజు టూరిస్టెక్ స్టార్టప్ ఫెస్ట్, టూరిజం స్టార్టప్ అట్లాస్, టెక్నలాజికల్ టూర్స్, ట్రావెల్ ఏజెన్సీస్ సమ్మిట్, డిస్కవర్ సెవిల్లె, అర్జెంటీనా డెస్టినేషన్ పార్టనర్ 2026, టూరిజం 4 నేచర్ అవార్డ్స్, అలాగే వెల్‌కమ్ పార్టీ, డిస్కవర్ సెవిల్లె విత్ సిటీ సైట్ సీయింగ్ తదితర కార్యక్రమాలలో గురువారం మంత్రి దుర్గేష్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, పర్యాటక రంగ దిగ్గజాలతో మంత్రి దుర్గేష్ ముఖాముఖి చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాంతాల విశిష్టతలను వారికి వివరించడంతో పాటు, ఏపీ పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్ బుక్స్ ను అందజేశారు. ఈ సదస్సు ద్వారా ఏర్పడిన బలమైన నెట్‌వర్క్, పారిశ్రామిక పరిచయాలను రాష్ట్రానికి పెట్టుబడులుగా మలిచేందుకు పూర్తి స్థాయిలో చొరవ తీసుకుంటానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ సదస్సులో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమ్మిట్ స్టూడియోలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ... ప్రపంచ స్థాయి టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో భాగస్వామి కావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దూరదృష్టిగల నేతృత్వంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని విప్లవాత్మకంగా మారుస్తున్నామని తెలిపారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన సాంకేతికతలను పర్యాటక రంగంలోకి విజయవంతంగా తీసుకువచ్చినట్లు వెల్లడించారు. విశాఖపట్నం నుంచి తిరుపతి వరకు యాత్రికుల సౌకర్యార్థం పిలిగ్రిమ్ టూరిజం, ఎకో టూరిజంతో పాటు సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతంలో ప్రత్యేక వెల్‌నెస్ సెంటర్లు, అమ్యూస్‌మెంట్ పార్కులు, స్టార్ హోటళ్లు, రిసార్ట్‌లను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఎక్స్‌ప్లర్ సంస్థతో కుదుర్చుకున్న ఎంఓయూ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే పర్యాటకులు ఎలాంటి ఖర్చులేకుండా ఉచితంగా 130కి పైగా భాషల్లో 100 పర్యాటక ప్రాంతాల విశేషాలను తెలుసుకునే సరికొత్త సదుపాయాన్ని ఏపీలో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. చరిత్ర ఏదైనా, భాష ఏదైనా.. ఏపీ పర్యాటక కేంద్రాల విశేషాలను చిటికెలో తెలిపే అత్యాధునిక డిజిటల్ గైడ్ టెక్నాలజీని ఏపీలో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ద్వారా దేశ, విదేశీ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో పర్యాటకాభివృద్ధిని వేగవంతం చేసి రెండేళ్ల కాలంలోనే సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులను సాధించామని, తద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్ ద్వారా పర్యాటక రంగంలో సాంకేతికతను మరింత విస్తృతంగా ఎలా ఉపయోగించవచ్చనే అంశంపై అద్భుతమైన అనుభవం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పర్యాటక ప్రముఖులకు మంత్రి దుర్గేష్ తన చేతుల మీదుగా 'టూరిజం ఇన్నోవేషన్ అవార్డులు' అందించడం విశేషం. ఈ పర్యటనలో మంత్రి దుర్గేష్ తో పాటు ఏపీటీపీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు..



# 'గిలకలదిండి' పనుల్లో ఇంత జాప్యమా?

**- అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ తీరుపై మంత్రి రవీంద్ర ఆగ్రహం**

**- ఫిషింగ్ హార్బర్ పనుల్లో ఆలస్యంతో మత్స్యకారులు నష్టపోతున్నారని ఆవేదన**

మచిలీపట్నం (చైతన్యరథం): గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పనుల్లో జరుగుతున్న జాప్యంపై అధికారులు, కాంట్రాక్ట్ సంస్థపై రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మచిలీపట్నం సమీపంలోని గిలకలదిండి ఫిషింగ్ హార్బర్‌ను గురువారం రాత్రి మంత్రి కొల్లు రవీంద్ర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల్లో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. పనులు ఎందుకు జాప్యం చేస్తున్నారంటూ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయలేకపోతే వదిలేసి వెళ్ళిపోండి.. ఇంకో సంస్థతో పనులు చేయించుకుంటాం. వేలాది మంది మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసేలా కాంట్రాక్టు సంస్థ వ్యవహరిస్తోంది. రెండున్నర సంవత్సరాలుగా కాంట్రాక్టర్ పనులు చేయకుండా జాప్యం చేస్తున్నారు. సీ మౌత్ కోసం చెన్నై ఐఐటీ నివేదికలు, డిజైన్ రావాలని పదేపదే చెప్పి జాప్యం చేస్తున్నారు.కనీస పనులు కూడా ఎందుకు చేయలేదో సమాధానం చెప్పాలని సంస్థ ప్రతినిధులపై ఆగ్రహం. పనులు చేయకుండా మాటలు మాత్రమే చెబితే ఉపేక్షించేది లేదు. ఉదయం వరకు హార్బర్ వద్దనే ఉంటాను.. అన్ని నివేదికలతో అధికారులు రావాలని ఆదేశంమంత్రి ఆదేశించారు. వెంటనే కాంట్రాక్ట్ కంపెనీని తొలగించి నిధులన్నీ రికవరీ చేయాలని కూడా ఆదేశించారు. మత్స్యకారుల జీవితాలతో ఆడుకునేలా కాంట్రాక్ట్ సంస్థ వ్యవహరించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. హార్బర్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై కలెక్టర్‌తో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాంట్రాక్టు సంస్థ, అధికారుల నిర్లక్ష్యంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల కోసం పని చేస్తున్నారా.. కాంట్రాక్టు సంస్థ కోసం పని చేస్తున్నారా అంటూ అధికారులపై మంత్రి రవీంద్ర మండిపడ్డారు.

# పల్లె పండుగ 3.0తో గ్రామీణాభివృద్ధికి కొత్త ఊపు

- **గొడ్డలి పార్టీ వైసీపీ పాలనలో గ్రామాలపై నిర్లక్ష్యం**
- **ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యం**
- **మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టీకరణ**
- **రామచంద్రపురం రూరల్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**



రామచంద్రపురం (చైతన్యరథం): గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం రూరల్ మండలంలో మంత్రి సుభాష్ గురువారం సుడిగాలి పర్యటన నిర్వహించి పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవం చేశారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ సాంబశివరావు, రామచంద్రపురం రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, ఎంపీడీవో పద్మజ్యోతి, పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ డిఈ రామారావు ఇతర అధికారులు, కూటమి పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రూ.2.84 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, వాటర్ ట్యాంక్ ప్రారంభోత్సవం చేశారు. నరసాపురపుపేటలో రూ.19.20 లక్షలు, యనమదలలో రూ.8 లక్షలు, తాడిపల్లిలో రూ.24 లక్షలు, కాపవరంలో రూ.14.50 లక్షలు, హసనబాదలో రూ.24.50 లక్షలు, భీమక్రోసుపాలెంలో రూ.14 లక్షలు, తోటపేటలో రూ.10 లక్షలు, అన్నయ్యపేటలో రూ.10 లక్షలు, వెంకటాయపాలెంలో రూ.17 లక్షలు, వేగాయమ్మపేటలో రూ.10 లక్షలు, తాళ్లపొలంలో రూ.11.50 లక్షలు, ఉట్రుమిల్లిలో రూ.16.50 లక్షలతో మౌలిక వసతుల పనులకు శంకుస్థాపనలు, అలాగే భీమక్రోసుపాలెంలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.69.30 లక్షలు వ్యయంతో నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకును మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూపల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.11,085 కోట్లతో గ్రామీణాభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, కాలువలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థ, వీధి దీపాలు, ఇతర మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ ప్రాంతాలకు మళ్లీ అభివృద్ధి వెలుగులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

గడచిన మూడు రోజుల్లోనే రామచంద్రపురం పట్టణంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం) నిధుల ద్వారా రూ.17 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, కె.గంగవరం మండలంలో రూ.1.37 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, తాజాగా రామచంద్రపురం రూరల్ మండలంలో రూ.2.84 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి, వాటర్ ట్యాంక్ ప్రారంభించామన్నారు. ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని స్పష్టం చేశారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, అందుకే గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నారని పేర్కొన్నారు.

పల్లె పండుగ 3.0 వంటి కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్ ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత వేగంగా ప్రభుత్వ సమాచారం

## - డిజిటల్ యాప్‌ను ప్రారంభించిన మంత్రి కొలుసు పార్థసారథి





విజయవాడ (చైతన్యరథం): ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ రూపొందించిన సమీకృత మొబైల్, వెబ్ అప్లికేషన్‌ను ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు సమాచారాన్ని స్వీకరించే విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయన్నారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా, డిజిటల్, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందించాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన ప్రామాణిక సమాచారాన్ని అత్యంత వేగంగా ప్రజలకు చేరవేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రభుత్వం, మీడియా, ప్రజల మధ్య మరింత బలమైన డిజిటల్ వారధిగా ఈ యాప్ పనిచేస్తుందని పేర్కొన్నారు.

మాన్యువల్ ప్రక్రియలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వం ప్రజలతో మరింత అనుసంధానం కావడానికి ఈ యాప్ దోహదపడుతుందని మంత్రి తెలిపారు. యాప్ రూపకల్పన, వినియోగంలోకి తీసుకురావడనికి కృషి చేసిన శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా యాప్ రూపకల్పనలో భాగస్వాములైన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సాంకేతిక బృందాన్ని కూడా మంత్రి అభినందించారు. సరైన సమాచారాన్ని సరైన సమయంలో, సరైన డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రజలకు చేరవేసేలా సాంకేతికతను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్ మాట్లాడుతూ, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్‌డోర్ మీడియా, ఫ్యాక్ట్ చెక్, కేడర్ మేనేజ్‌మెంట్, తదితర విభాగల సమాచారాన్ని సమీకరించి ఈ డిజిటల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ సమాచార ప్రసారం, మీడియా నిర్వహణ, పౌర సంబంధాలు, వాస్తవాల ధృవీకరణ, ప్రకటనలు, కేడర్ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వివరించారు.

మొబైల్ అప్లికేషన్ ద్వారా అధికారులు ఎక్కడి నుంచైనా శాఖకు సంబంధించిన ముఖ్యమైన కార్యకలాపాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు కూడా వార్తా విశేషాలు, ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచార ప్రసార కార్యకలాపాలను ఈ యాప్ ద్వారా ప్రజలకు చేరవేసే అవకాశం ఉంటుందని వెల్లడించారు. దీని వలన క్షేత్రస్థాయి సమాచారం కూడా ప్రజలకు వేగంగా అందుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూదన్, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ టి. నాగరాజు, మీడియా రిలేషన్స్ విభాగం ఉప సంచాలకులు దున్న రమేష్, డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.రాణి సుస్మిత,ప్రత్యేక అధికారి గల్లా శేషు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో అన్ని చోట్లా కూటమి జెండా ఎగరాలి

- **వైసీపీ అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదు**
- **గతం మరిచి గురివింద తీరులా జగన్ మాటలు**
- **బీసీలకు 34 శాతం కోటాకు కట్టుబడిన టీడీపీ**
- **శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ సమావేశంలో తిరుపతి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ నూకసాని బాలాజీ**



శ్రీకాళహస్తి (చైతన్యరథం): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఘన విజయం కోసం టీడీపీ నాయకులు, శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని తిరుపతి జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పిలుపు ఇచ్చారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ కుమార్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్రీకాళహస్తి మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, తదితర అన్ని స్థానాలను కూటమి కైవసం చేసుకునేలా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

### ఐదేళ్ల వైసీపీ పాలనను ప్రజలు మర్చిపోలేదు

2019-2024 మధ్య వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షాలను, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేసిందో రాష్ట్ర ప్రజలకు తెలుసు. కేసులు, అరెస్టులు, రాజకీయ ఒత్తిళ్లు, దాడులు, వేధింపులతో టీడీపీ శ్రేణులను భయపెట్టాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ టీడీపీ కార్యకర్తలు భయపడలేదు. పార్టీ జెండాను వదల్లేదు. చివరకు 2024 ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పుతో వైసీపీ అరాచక పాలనకు తగిన సమాధానం చెప్పారని డాక్టర్ బాలాజీ అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూడా గత ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లడం, కేసులు పెట్టడం, వేధించడం వంటి ఘటనలు జరిగాయి. అధికార బలంతో కార్యకర్తలను అణచివేయవచ్చని అప్పట్లో భావించారు. కానీ కార్యకర్తల ఆత్మగౌరవాన్ని, ప్రజల తీర్పును ఎవరూ అణచివేయలేరన్నారు.

### వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలి

2019లో 151 అసెంబ్లీ స్థానాలతో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ 2024లో కేవలం 11 స్థానాలకు పరిమితమైంది. ఈ తీర్పు టీడీపీ నాయకులు ఇచ్చింది కాదు- ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చారు. ప్రజలు ఎందుకు అంతటి కఠినమైన తీర్పు ఇచ్చారో జగన్‌మోహన్‌రెడ్డి ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని డాక్టర్ బాలాజీ హితవు పలికారు. ఐదేళ్ల పాటు సాగించిన అరాచక పాలనను మర్చిపోయి, ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉంది. తమ పాలనలో జరిగిన దారుణాలను మర్చిపోయి గురివింద గింజ సామెతలా ఇతరులకు నీతులు చెప్పడం మానుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు.

### స్థానిక ఎన్నికలపై జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

స్థానిక సంస్థల ఎన్నికల్లో కేంద్ర బలగాలు కావాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరగవని జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై డాక్టర్ బాలాజీ తీవ్రంగా స్పందించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని మేమూ కోరుకుంటున్నాం. ప్రతి పార్టీకి స్వేచ్ఛగా పోటీ చేసే హక్కు ఉండాలని మేమూ కోరుకుంటున్నాం. కానీ ఈరోజు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న 2019-24 కాలంలో ప్రతిపక్ష కార్యకర్తలకు ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయో ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. అప్పుడు అధికార బలంతో టీడీపీ కార్యకర్తలను అణచివేయాలని చూశారు. ఇప్పుడు అదే వ్యక్తులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారన్నారు.

### ప్రతీకార రాజకీయాలకు దూరం

చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గత ప్రభుత్వంలా ప్రతీకార రాజకీయాలు చేయదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఉపేక్షించదు. ఎవరైనా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటుంది. అదే సమయంలో ప్రతిపక్షాలను అణచివేయడం, కార్యకర్తలను వేధించడం మా ప్రభుత్వ విధానం కాదని డాక్టర్ బాలాజీ స్పష్టం చేశారు.

### బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడిన టీడీపీ

బడుగు, బలహీన వర్గాల రాజకీయ సాధికారతకు తెలుగుదేశం పార్టీ ఎప్పటి నుంచో కట్టుబడి ఉందని డాక్టర్ బాలాజీ తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కట్టుబడిఉంది. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడం టీడీపీ రాజకీయ సిద్ధాంతంలో భాగం. బీసీల హక్కుల విషయంలో ఎవరు ఏం చేశారు, ఎవరు ఏం చేయలేదు అనే విషయాలను ప్రజలకు స్పష్టంగా వివరిస్తామన్నారు.

### అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ బాలాజీ తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, అవసరమైన అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోంది. ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి పనిని ప్రజలకు కార్యకర్తలు వివరించాలన్నారు. వైసీపీ చేస్తున్న విమర్శలకు సమాధానం ఇవ్వడానికి కేవలం సోషల్ మీడియా పోస్టులు సరిపోవని, ప్రతి కార్యకర్త ప్రజల మధ్యకు వెళ్లి వాస్తవాలను వివరించాలని సూచించారు.

### ఎన్నికల కార్యాచరణకు సిద్ధం కావాలి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి క్లస్టర్, ప్రతి యూనిట్‌ను ఎన్నికల కేంద్రంగా మార్చాలని డాక్టర్ బాలాజీ సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ పరిస్థితిని సమీక్షించాలి. బలహీన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. ప్రతి ఓటరుతో పార్టీ బంధాన్ని బలోపేతం చేయాలి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి. బలమైన, ప్రజల్లో ఆమోదం ఉన్న అభ్యర్థులను గుర్తించాలి. కూటమి భాగస్వామ్య పార్టీలతో సమన్వయంతో పనిచేయాలి. కార్యకర్తల మధ్య అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయాలి. ఎన్నికల వరకు నిరంతరంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని డా. బాలాజీ పిలుపు ఇచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మున్సిపాలిటీతో పాటు అన్ని మండలాల్లో కూటమి జెండా ఎగరాలి. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు నాయకత్వం అండగా ఉంటుందన్నారు.

ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, తొట్టంబేడు, ఏర్పేడు, శ్రీకాళహస్తి, రేణిగుంట మండలాల పార్టీ అధ్యక్షులు, శ్రీకాళహస్తి టౌన్ పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, యూనిట్ ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం నగరి నియోజకవర్గంలో పుత్తూరు మండలం, పుత్తూరు టౌన్, వడమాలపేట మండల కార్యకర్తల సమావేశంలో డా. బాలాజీ పాల్గొన్నారు.

# డబుల్ రిజిస్ట్రేషన్లతో రూ.45.80 లక్షలకు మోసం

- గత ప్రభుత్వ హయాంలో నకిలీ బీసీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు.. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి
- ఉపాధి కోసం ఆఫ్రికా వెళ్తే నిలువు దోపిడీ.. రూ.80 లక్షల యంత్రాలు, పాస్‌పోర్ట్ లాక్కుని దౌర్జన్యం
- అక్రమంగా ప్లాటు ఆక్రమించి ఫెన్సింగ్.. అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం
- న్యాయం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు
- అర్జీలు స్వీకరించిన మంత్రి సవిత, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి పలు సమస్యలపై బాధితులు తరలివచ్చి వినతులు సమర్పించారు. బీసీ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్ సవిత, శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు.. అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

కృష్ణా జిల్లా కంకిపాడుకు చెందిన కొప్పురపు శివరామకృష్ణారావు అర్జీ ఇస్తూ.. కొత్తపూడి గ్రామానికి చెందిన జన్నా నాగమహాలక్ష్మయ్య కుటుంబం వద్ద తాము రెండేళ్ల క్రితం భూమి కొనుగోలు చేసి 45 లక్షల 85 వేల రూపాయలకు మోసపోయామని ఫిర్యాదు చేశారు. 21-12-2024న కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తన పేరున ఒక ఎకరం, భార్య లతామంగేష్కర్ పేరున ఒక ఎకరం చొప్పున మొత్తం 2 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. రిజిస్ట్రేషన్ పూర్తయి బయటకు రాగానే వేరే చీటింగ్ కేసులో జన్నా నాగమహాలక్ష్మయ్యను తాడికొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరా తీయగా సదరు వ్యక్తి గతంలోనూ ఒకే భూమిని ఇద్దరు ముగ్గురికి రిజిస్ట్రేషన్ చేసి మోసాలకు పాల్పడినట్లు తెలిసింది. తమ వెంటనే మరోచోట ఈసీ తీయించి పరిశీలించగా, తమకు అమ్మిన భూమి 2021లోనే రెండు దఫాలుగా ఇతరుల పేరిట రిజిస్టర్ అయి ఉన్నట్లు తేలింది. తాము మోసపోయామని గ్రహించి భూమి కొనుగోలులో మధ్యవర్తులుగా ఉన్నవారిని, భూమి అమ్మిన జన్నా నాగమహాలక్ష్మయ్య కుటుంబాన్ని డబ్బులు తిరిగివ్వాలని నిలదీయగా.. సమాధానం చెప్పకపోగా చంపుతామని బెదిరింపులకు దిగారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం వామకుంట్ల గ్రామానికి చెందిన చిల్లపల్లి నరసింహారావు విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సుమారు 30 కుటుంబాలు అసలైన కాపు కులానికి చెందినవారై ఉండి, కాపు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు పొందడమే కాకుండా.. పాఠశాల రికార్డులు, సర్వీస్ రిజిస్టర్లలో 'శెట్టిబలిజ', 'వాడబలిజ'గా తప్పుడు పేర్లు నమోదు చేయించుకుని బీసీ రిజర్వేషన్లు కాజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడిని ఉపయోగించి అక్రమంగా బీసీ సర్టిఫికెట్లు పొంది రిజర్వేషన్ ఉద్యోగాలు పొందడం వల్ల నిజమైన బీసీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. కావున వారిపై చర్యలు తీసుకొని అర్హులైన బీసీలకు న్యాయం చేయాలని కోరారు.

బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన ముప్పరాజు శ్రీనివాసరావు విజ్ఞప్తి చేస్తూ.. తమ కుమారుడు ఉపాధి కోసం బోర్లు వేసే అత్యాధునిక డ్రిల్లింగ్ మెషినరీ, ట్రక్కు, కారు, ముడి సరుకులను చట్టబద్ధంగా ఆఫ్రికాకు తీసుకువెళ్లారని తెలిపారు. అయితే, అక్కడ అతను అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని (స్థానిక భారతీయ మూలాలున్న వ్యక్తి) దుర్బుద్ధితో దాదాపు రూ.80 లక్షలకు పైగా విలువైన యంత్రాలు, వాహనాలు, మెటీరియల్‌తో పాటు పాస్‌పోర్ట్, వీసా పత్రాలను అక్రమంగా లాక్కున్నాడు. అర్ధరాత్రి సమయంలో తుపాకులతో బెదిరించి, తమ కుమారుడిని నడిరోడ్డుపైకి గెంటివేశాడు. ఈ దారుణ ఘటనపై తన కుమారుడు స్థానిక న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. పలుమార్లు దాడులు జరిగినా ధైర్యంగా న్యాయపోరాటం చేసి, కోర్టులో అనుకూల తీర్పు పొందాడు. ఆస్తులను వెంటనే తిరిగి అప్పగించాలని, లేనిపక్షంలో నిందితుడిని అరెస్టు చేసి పరిహారం చెల్లించాలని కోర్టు తుది తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ అక్కడి పోలీసులు, అక్కడి భారత ఎంబసీ అధికారుల నుంచి తగిన స్పందన, సహాయం లభించకపోవడంతో ఇప్పటివరకు తీర్పు అమలుకు నోచుకోలేదు. వ్యాపారం కోసం తెచ్చిన పెట్టుబడులు, చేసిన అప్పులు తీర్చలేక స్వగ్రామంలో ఉన్న వ్యవసాయ భూమిని అమ్ముకోవాల్సి వచ్చిందని, గత మూడేళ్లుగా తమ కుటుంబం తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తోంది. ఈ సమస్యపై గతంలోనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంకు చెందిన జి.డి.వి. ప్రసాద్ విజ్ఞప్తి చేస్తూ.. చీపురుపల్లి ఉప్పాడ సర్వే నం. 15/1 లోని ప్లాట్ నం. 182 (200 గజాల విస్తీర్ణం)ను కొనుగోలు చేశానని తెలిపారు. తరువాత సదరు ప్లాటును ఇతరులు ఆక్రమించుకుని అక్రమంగా ఫెన్సింగ్ వేయడంతో న్యాయం కోసం అధికారులను ఆశ్రయించాను. ఈ వివాదంపై స్పందన ద్వారా, అలాగే ఆర్డీవో లేఖ ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇంతవరకు ఎలాంటి పరిష్కారం లభించలేదు. ఈ స్థలానికి సంబంధించి న్యాయస్థానం అనుకూలంగా జడ్జిమెంట్ ఇచ్చినప్పటికీ దానిని అమలు చేయటంలో స్థానిక రెవెన్యూ యంత్రాంగం అలసత్వం ప్రదర్శిస్తోంది. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన పాపినేని బాపమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో పాత ఇల్లు శిథిలావస్థకు చేరడంతో 2010లో కొనుగోలు చేసిన 2 సెంట్ల స్థలంలో నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మిస్తుండగా, పక్కనే ఉండే బంధువులు కక్ష కట్టి తరచూ దాడులకు పాల్పడుతున్నారు. మార్చి 24న ఇంటిపై దాడి చేసి కిటికీలు, సీసీ కెమెరాలు ధ్వంసం చేయడంతో పాటు తమని ఈడ్చిపడేశారు. ఈ వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదు రోజుల పాటు చికిత్స పొంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డాను. దీనిపై పెదకాకాని పోలీసులు క్రైమ్ నెం. 193/2026 కింద కేసు నమోదు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశారన్న కోపంతో జూలై 22న తన కుమారుడిపై విచక్షణ రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. తాజాగా అక్టోబర్ 6వ తేదీ రాత్రి, అక్టోబర్ 7వ తేదీ వేకువజామున మరోసారి ఇంటి పైకి వచ్చి బూతులు తిడుతూ, "పోలీసులకు సీసీ ఫుటేజీ ఇచ్చినా తమ పలుకుబడి ముందు ఎవరూ ఏమీ చేయలేరంటూ చంపుతామని బెదిరించారు. దాడులకు సంబంధించిన స్పష్టమైన సీసీటీవీ ఫుటేజీలు అందించినప్పటికీ పోలీసులు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడంతో దుండగులు మరింత రెచ్చిపోతున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.



గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన విజయలక్ష్మి కుమారి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలోని తమ ఇంటికి పడమర వైపున ఉండే ఇంటి యజమాని తమ స్థలాన్ని ఆక్రమించుకోవడంతో పాటు, వర్షం నీరు మొత్తం తమ స్థలంలోనే పడేలా అక్రమంగా రేకులు ఏర్పాటు చేశారు. ఆ రేకులను తొలగించాలని కోరినప్పటికీ స్పందించకపోగా, తమ సరిహద్దు గోడను పడగొట్టి అక్రమాలకు పాల్పడ్డారు. తమ అత్తగారి పేరున ఉన్న సుమారు ఒకటిన్నర సెంటు స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారు. కావున వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## ఏపీ ఏఐ ఆధారిత జీఎస్టీ అడ్మినిస్ట్రేషన్‌కు

# జాతీయ స్థాయిలో గుర్తింపు

### ప్రత్యేకంగా అభినందించిన కౌన్సిల్

అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలన విధానం (ఏఐ ఎనేబుల్డ్ జీఎస్టీ అడ్మినిస్ట్రేషన్) జాతీయ స్థాయిలో ప్రశంసలు, గుర్తింపు సాధించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు ఏపీ వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ పరిపాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమర్థవంతంగా వినియోగిస్తూ తీసుకొచ్చిన ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలన విధానం ఇప్పుడు యావత్ భారతదేశం దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా న్యూఢిల్లీలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కూడా ఈ విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించింది. జీఎస్టీ పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ ఎండ్ టు ఎండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్న తీరు జీఎస్టీ కౌన్సిల్‌ను అమితంగా ఆకట్టుకుంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నులు శాఖ తీసుకొచ్చిన ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపా లన విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ విధానం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్టీ పరిపాలనలో నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారితనం పెరిగిందని పేర్కొంది. జీఎస్టీ పరిపాలన, పన్ను ల ఎగవేత గుర్తింపు, ఆదాయ వనరుల పెంపులో ఏఐ సాంకేతికతను ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా వినియోగిస్తున్న తీరు ఆదర్శ ప్రాయమని కొనియాడింది. అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌ను ఆదర్శంగా తీసుకుని ఈ ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలనా విధానాన్ని అనుసరించాలని జీఎస్టీ కౌన్సిల్ సూచించింది. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించి ఇక్కడి ఏఐ ఆధారిత జీఎస్టీ అడ్మినిస్ట్రేషన్ విధానాన్ని అధ్యయనం చేసి వెళ్లిన విషయాన్ని ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఆ రాష్ట్రాలు ఈ విధానాన్ని తమ రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయని, అస్సాం, ఢిల్లీ, ఉత్తరాఖండ్ సహా మరికొన్ని రాష్ట్రాలు కూడా ఏపీ మోడల్ పట్ల ఆసక్తి ప్రదర్శి స్తున్నాయని జీఎస్టీ కౌన్సిల్‌కు ఏపీ తెలిపింది.



చైతన్యరథం

# హిరణ్యకశిపుడి మరో రూపమే జగన్ రెడ్డి

- సీఎం హోదాలో ఉండీ బాబాయి హంతకులను అరెస్ట్ చేయించకుండా కాపాడిన జగన్
- డాక్టర్ సునీతకు న్యాయం చేయకపోగా ఆమె భర్తపై తప్పుడు కేసులతో వేధింపులు
- అందుకే న్యాయం కోసం సీఎం చంద్రబాబును ఆశ్రయించిన సునీత
- దీనిపైనా జగన్, ఆయన పార్టీ నేతల దిగజారుడు మాటలు
- అంత వణుకు, భయానికి కారణమేమిటి?
- జగన్ ప్రతిపక్షంలో ఉండగా సీబీఐ విచారణ కోసం పిటిషన్.. అధికారంలోకి రాగానే వెనక్కి తీసుకోవటంలో మర్మమేమిటి?
- వివేకా హత్యకు రూ.40 కోట్ల సుపారీ ఇచ్చిందెవరు
- అన్నీ బయటకొస్తాయి.. అందరికీ చట్టప్రకారం శిక్ష తప్పదు
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య



అమరావతి (చైతన్యరథం): సొంత బాబాయి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి గొడ్డలిపోటుతో దారుణ హత్యకు గురైతే, ఆ హంతకులను కాపాడేందుకు తరువాత ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి చట్టాన్ని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలకు పాల్పడ్డారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ వివేకా హత్య కేసులో జగన్ ద్వంద్వ వైఖరిని, ఆయన కుమార్తె డాక్టర్ సునీత పడిన నరకయాతనను వివరించారు. జగన్మోహన్ రెడ్డి నైతికతను నిలదీస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సొంత తమ్ముడు వైఎస్ వివేకానందరెడ్డి.. జగన్మోహన్ రెడ్డికి సొంత బాబాయి. అలాంటి బాబాయిని గొడ్డలితో తల నరికి అత్యంత పాశవికంగా హతమార్చారు. తండ్రిని కోల్పోయిన ఆవేదనతో న్యాయం కోసం వచ్చిన చెల్లెలు డాక్టర్ సునీతకు అండగా నిలవాల్సింది పోయి, ఆమె ముందు జగన్ ఎంతో కపటంగా నటించారని వర్ల ఆవేదన వ్యక్తం చేశారు.

**నాడు సీబీఐ కావాలని, నేడు ఎందుకు పారిపోయారు?**

ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి సాక్షాత్తూ గవర్నర్‌ను కలిసి వివేకా హంతకులెవరో తేల్చాలి, సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అంతేకాదు, సీబీఐ దర్యాప్తు కోరుతూ హైకోర్టులో స్వయంగా రిట్ పిటిషన్ కూడా దాఖలు చేశారు. తీరా ప్రజలు నమ్మి అధికారం ఇచ్చి ముఖ్యమంత్రిని చేశాక.. అసలు బాబాయి హత్యకు గురయ్యాడన్న విషయమే ఆయనకు గుర్తులేకుండా పోయింది. హంతకులను రక్షించే ఉద్దేశంతో సీబీఐ దర్యాప్తు కోసం హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కూడా సిగ్గులేకుండా వెనక్కి తీసుకున్నారు. వివేకా హంతకులెవరో నీకు తెలుసు.. వాళ్లను చట్టానికి పట్టించి.. న్యాయం చేయన్నా అంటూ డాక్టర్ సునీత ఎన్నోసార్లు వేడుకుంటే కనికరం చూపించాల్సింది పోయి జగన్ బెదిరింపులకు దిగారు. బాబాయి హత్య కేసులో నిందితులను అరెస్టు చేయించాల్సింది పోయి, న్యాయం అడిగిన సొంత చెల్లెలిని భయభ్రాంతులకు గురిచేయడం జగన్ రాక్షసత్వానికి నిదర్శనం. ముఖ్యమంత్రి అయిన అన్నే హంతకులను కాపాడుతుంటే ఆ నిస్సహాయురాలైన ఆడబిడ్డ ఎక్కడికి పోవాలి? అందుకే న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగింది. ఢిల్లీలోని సుప్రీంకోర్టు గడప తొక్కింది. సొంత రక్తం పంచుకుపుట్టిన బాబాయిని హత్య చేసిన వారిని కాపాడేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేసిన చరిత్ర జగన్‌ది. న్యాయం కోసం డాక్టర్ సునీత చేసిన పోరాటానికి, చిందించిన కన్నీటికి సార్థకత చేకూరేలా న్యాయస్థానాలు, ప్రజలు తప్పకుండా హంతకులకు, వారి వెనుక ఉన్న శక్తులకు తగిన బుద్ధి చెబుతారని వర్ల రామయ్య హెచ్చరించారు.

**శిక్ష తప్పదు**

వివేకా హత్య కేసులో న్యాయం చేయాల్సిన అన్నే రాక్షసుడిలా మారి హంతకులను కాపాడుతుంటే, నిస్సహాయురాలైన చెల్లెలు డాక్టర్ సునీత న్యాయం కోసం చంద్రబాబు నాయుడుని ఆశ్రయించడంలో తప్పేముందని వర్ల రామయ్య సూటిగా ప్రశ్నించారు. ఐదేళ్ల జగన్ పాలనలో సీబీఐ దర్యాప్తును అడ్డుకున్న తీరును, సునీతపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న దిగజారుడు వ్యాఖ్యలను తీవ్రంగా ఎండగట్టారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి తన చెల్లెలు సునీతపై ఏనాడూ కనికరం చూపించలేదు. కనీసం సీబీఐ అధికారులనైనా స్వేచ్ఛగా పనిచేయనిచ్చారా అంటే అదీ లేదు. దర్యాప్తును అడుగడుగునా అడ్డుకున్నారు. వివేకాను చంపిన ముద్దాయిలను అరెస్ట్ చేయడానికి అధికారులు వస్తే అడ్డం పడ్డారు. ఏకంగా కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారుల పైనే తప్పుడు కేసులు పెట్టించి వేధించారు. దీన్నిబట్టి వివేకాను చంపిన హంతకులు ఎవరో జగన్‌కు స్పష్టంగా తెలుసని, అందుకే వారిని రక్షించేందుకు అధికారాన్ని దుర్వినియోగం చేశారని ప్రజలందరికీ అర్థమైపోయింది. న్యాయం కోసం అన్ని గడపలూ తొక్కి విసిగిపోయిన డాక్టర్ సునీత.. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి న్యాయం చేయాలని వేడుకున్నారు. దీనిపై జగన్, ఆయన పార్టీ నేతలు అత్యంత దిగజారి మాట్లాడుతున్నారు. సునీత ఎప్పుడు వెళ్లినా చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారు..వాళ్ల మధ్య ఎంత సాన్నిహిత్యం.. అంటూ నీచంగా ఎగతాళి చేస్తున్నారు. కడుపుకోతతో న్యాయం కోసం ఒక ఆడబిడ్డ ప్రజా ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తే ఇంత దారుణంగా మాట్లాడతారా? జగన్మోహన్ రెడ్డికి అర్థమయ్యేలా ఒక పౌరాణిక సత్యాన్ని గుర్తుచేస్తున్నాను. రాక్షస రాజైన హిరణ్యకశిపుడి ఇంట్లో పుట్టిన కొడుకు ప్రహ్లాదుడు భగవంతుడైన విష్ణుమూర్తిని నమ్ముకున్నాడు. తండ్రి రాక్షసత్వాన్ని ఎదిరించి ధర్మం వైపు నిలబడ్డాడు. చివరకు దేవుడు ప్రహ్లాదుడిని కాపాడి, హిరణ్యకశిపుడిని సంహరించాడు. సరిగ్గా వైఎస్ కుటుంబంలో కూడా ఇదే జరుగుతోంది. ఆ కుటుంబంలో జగన్మోహన్ రెడ్డి హిరణ్యకశిపుడైతే.. డాక్టర్ సునీత భక్త ప్రహ్లాదుడు. రాక్షస మనస్తత్వంతో హంతకులను వెనకేసుకొస్తున్న అన్నను కాదని, ధర్మం కోసం, న్యాయం కోసం ఆమె విష్ణుమూర్తి లాంటి చంద్రబాబు నాయుడు శరణు కోరింది. జగన్మోహన్ రెడ్డి.. ఆలోచనలు సరైనవైతే మీ చెల్లెలు న్యాయం కోసం చంద్రబాబు దగ్గరకు ఎందుకు వెళ్తుంది? మీరు అధికారంలో ఉన్న ఐదేళ్లలో బాబాయిని చంపిన వాళ్లను అరెస్టు చేయించి ఉంటే, సీబీఐకి సహకరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదుకదా? మీ రాక్షస పాలన పోయింది, ఇప్పటికైనా పాపాలు ఒప్పుకోకపోతే చరిత్ర మిమ్మల్ని క్షమించదు. ధర్మమే గెలుస్తుంది, హంతకులకు, వారి వెనుక ఉన్న శక్తులకు శిక్ష తప్పదని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

**తల్లిని, చెల్లిని గెంటేసిన జగన్‌కు బాబాయి కూతురు ఓ లెక్కా?**

తల్లిని, సొంత చెల్లిని గెంటేసిన క్రూర మనస్తత్వం ఉన్న జగన్‌కు బాబాయి కూతురు కన్నీళ్లు పట్టకపోవడంలో ఆశ్చర్యం లేదని ఆయన మండిపడ్డారు. కన్నతల్లిని నిరాదరణకు గురిచేసి బయటకు పంపిన చరిత్ర నీది. తోడబుట్టిన సొంత చెల్లెలు షర్మిలను రోడ్డుపైకి నెట్టేసిన సంస్కృతి నీది. అలాంటి నీకు బాబాయి కూతురు సునీత ఆవేదన, ఆమె కన్నీళ్లు ఒక లెక్కా? వివేకాను చంపిన హంతకులను రక్షించడానికి జగన్ పడుతున్న తాపత్రయం చూసి రాష్ట్ర ప్రజలంతా అసహ్యించుకుంటున్నారు. హంతకుడు.. హంతకుడు.. నా తండ్రిని చంపించింది ఇతనే అని డాక్టర్ సునీత కోడై కూస్తున్నా, బాహాటంగా పేర్లు చెబుతున్నా.. ఆ హంతక ప్రముఖుడిని పక్కన పెట్టుకుని మళ్లీ ఎంపీ టికెట్ ఇచ్చి ఎలా నెత్తిన పెట్టుకున్నావు? హంతకులను రక్షించడానికి ప్రజాధనాన్ని తగలేసి కోర్టుల్లో కోట్లాది రూపాయల ఫీజులతో పెద్ద పెద్ద లాయర్లను ఎందుకు పెట్టించావో ప్రజలకు నోరువిప్పి సమాధానం చెప్పగలవా? ఆ రోజు హత్య జరిగిన వెంటనే నారా చంద్రబాబుపై బురదజల్లడానికి సాక్షి పేపర్‌లో 'నారాసుర రక్తచరిత్ర' అని విషం చిమ్మింది నువ్వు కాదా? ఐదేళ్లు సీఎంగా ఉండి బాబాయిని చంపిన వాళ్లను ఎందుకు అరెస్ట్ చేయించలేదు? హత్య జరిగిన రోజున సాక్ష్యాలు లేకుండా నేరస్థలాన్ని మొత్తం తుడిచిపెట్టేసి ఛిన్నాభిన్నం చేస్తుంటే ఎందుకు చూస్తూ ఊరుకున్నావు? శవానికి బ్యాండేజీలు కట్టి, గొడ్డలి పోట్లను గుండెపోటని, రక్తపు వాంతులని నీ ఛానళ్లు, పత్రికల్లో ప్రచారం చేయించిందెవరు? దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారుల పైనే తప్పుడు కేసులు ఎందుకు పెట్టించావు? న్యాయం కోసం అడిగిన సునీత భర్త రాజశేఖర్ రెడ్డి పైనే ఎదురు కేసులు పెట్టి వేధించింది నిజం కాదా? జగన్ పాపాల పుట్ట పగిలిపోయింది. హంతకులను, వారి వెనుక ఉండి నడిపించిన జగన్‌ను చట్టం, ప్రజలు ఎప్పటికీ వదిలిపెట్టరు, శిక్ష అనుభవించక తప్పదని వర్ల హెచ్చరించారు.

**రూ.40 కోట్ల సుపారీ ఇచ్చిందెవరో చెప్పే ధైర్యం ఉందా?**

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు అంత తేలిగ్గా ముగిసిపోదని, ఈ హత్య వెనుక జరిగిన రూ.40 కోట్ల సుపారీ డీల్ గుట్టును జగన్మోహన్ రెడ్డి బయటపెట్టాలని వర్ల రామయ్య డిమాండ్ చేశారు. వివేకా హత్య కేసు అంత సులభంగా మరుగున పడిపోదు. ఈ దారుణ హత్యకు ఏకంగా రూ.40 కోట్ల రూపాయల సుపారీ ఎవరు ఇచ్చారో ప్రజలకు సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం జగన్మోహన్ రెడ్డికి ఉన్నాయా? ఆ రూ.40 కోట్ల సుపారీ ఇచ్చింది నేనే.. అని ఒప్పుకునే దమ్ముందా? దీనికి రాష్ట్ర ప్రజలకు కచ్చితంగా సమాధానం చెప్పి తీరాలి. 2019 ఎన్నికల ముందు సొంత బాబాయి హత్యను అడ్డం పెట్టుకుని, ప్రజల్లో తప్పుడు సానుభూతిని కూడగట్టి, రాజకీయంగా గెలిచి అధికారాన్ని అనుభవించింది నిజం కాదా? నాడు శవాన్ని అడ్డం పెట్టుకుని ఓట్లు దండుకున్న జగన్‌కు, ఆ తర్వాత న్యాయం చేయాలన్న ఆలోచన ఎందుకు రాలేదు? ఇప్పటికీ మించిపోయింది ఏమీ లేదు. నీ ఆత్మకు, మనస్సాక్షికి జవాబుదారీగా ఉండాలనుకుంటే.. బాబాయిని చంపిన అసలు నేరస్థులను వెంటనే పట్టివ్వు. రూ.40 కోట్ల సుపారీ వెనుక ఉన్నది ఎవరో తేల్చి, కన్నీరుమున్నీరవుతున్న నీ చెల్లి, పిన్ని కన్నీళ్లు తుడువు. అలా చేయకపోతే ఆ భగవంతుడు కూడా నిన్ను క్షమించదు. రాక్షసత్వంపై ధర్మం గెలవడం ఖాయం, పాపాలు పండిన హిరణ్యకశిపుడికి పతనం తప్పదని వర్ల రామయ్య స్పష్టం చేశారు.

# మద్యం కుంభకోణంపై జగన్ మౌనం వీడాలి

- నకిలీ, కల్తీ మద్యంతో రూ. 3,200 కోట్లు దోపిడీ
- పేదల కష్టం, రక్తం, చెమటను సొమ్ము చేసుకున్న జగన్
- టీడీపీ నేత మోకా ఆనంద్ సాగర్ ధ్వజం

అమరావతి (చైతన్యరథం): జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలన మొత్తం కుంభకోణాల మయం.. ప్రతి రోజు, ప్రతి గంట, ప్రతి నిమిషం కోట్లాది రూపాయల కుంభకోణాలతో ఐదేళ్లు వికృతంగా, రాక్షసంగా, అప్రజాస్వామికంగా, అరాచకంగా జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని నడిపారని టీడీపీ నేత మోకా ఆనంద్ సాగర్ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో మహిళల కన్నీళ్లు తుడుస్తానని, కాపురాలు బాగుచేస్తానని, మద్యపాన నిషేధం చేస్తానని ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన జగన్, ముఖ్యమంత్రి అయిన వెంటనే మద్యాన్ని తనకు కోట్లు కూడబెట్టే వ్యాపారంగా మార్చుకున్నాడని పేర్కొన్నారు. నకిలీ, కల్తీ మద్యం ద్వారా రూ. 3,200 కోట్లు దోచుకొని తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకున్నాడని, దీని వల్ల 30 వేల మంది మహిళల తాళిబొట్లు తెగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. మద్యం కుంభకోణం చార్జ్‌షీట్‌లో జగన్‌మోహన్ రెడ్డి పేరు రెండు చోట్ల ప్రస్తావించారని, అప్పటి ఏపీఎస్‌బీసీఎల్ ప్రత్యేక అధికారి డి. సత్యప్రసాద్, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజిత్ భార్గవ ఏసీబీ కోర్టులో వాంగ్మూలం ఇస్తూ.. ఈ కుంభకోణం మొత్తం తాడేపల్లి ప్యాలెస్‌లోనే జరిగింది. అంతిమ దోపిడిదారుడు జగన్‌మోహన్ రెడ్డే.. అని స్పష్టం చేశారని గుర్తు చేశారు. పేదవాడి రక్తాన్ని, నెత్తురుని, చెమటని చీపులిక్కర్ తో సొమ్ము చేసుకున్న దుర్మార్గుడు జగన్‌మోహన్ రెడ్డి. ఈ వాస్తవాలు బయటపెడుతున్న సత్యప్రసాద్ మానసిక స్థితి సరిగా లేదని ఆ గొడ్డలి పార్టీ యాక్టీ ఛానళ్లలో, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తోంది. ఈ వాస్తవాలపై జగన్‌మోహన్ రెడ్డి మౌనం వీడి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వ మద్యం విధానాన్ని రద్దు చేసి, నకిలీ బ్రాండ్లను పారదోలి, కల్తీలేని నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని



వివరించారు. దాదాపు 3,396 షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించి, రూ.99కే నాణ్యమైన మద్యం అందిస్తున్నామని, కల్లుగీత కార్మికులకు 340 షాపులు కేటాయించి లైసెన్స్ ఫీజు సగం తగ్గించామని తెలిపారు. మద్యం తయారీ నుంచి వినియోగం వరకు ట్రాక్ అండ్ ట్రేస్ విధానం, "ఏపీ ఎక్సైజ్ సురక్ష" మొబైల్ యాప్, 13 రకాల పరీక్షలు, ఆకస్మిక తనిఖీలు అమలు చేస్తూ నకిలీ, కల్తీ, అక్రమ మద్యాన్ని అరికడుతున్నామని పేర్కొన్నారు. మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వం రాష్ట్రానికి మరింత ప్రమాదకరమన్నారు. ప్రజలు ఇప్పటికే జగన్ అవినీతిని గుర్తించి గత ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేశారని, ఇప్పుడు చేయబోయే పాదయాత్ర జైలు యాత్రగా మారుతుందని స్పష్టం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి రూ. 3,200 కోట్ల మద్యం కుంభకోణం గురించి మాట్లాడాలని, మౌనం వీడాలని సవాల్ చేశారు. 2029లో వైసీపీ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని ఆనంద్ సాగర్ హెచ్చరించారు.

# టీడీపీతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యత

- బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించింది ఎన్టీఆర్
- రిజర్వేషన్లు 34 శాతం చేసిన ఘనత చంద్రబాబుదే
- మండల్ కమిషన్ సిఫార్సుల అమలులోనూ టీడీపీ కీలక పాత్ర
- బీసీల అభ్యున్నతిని అడ్డుకున్న ద్రోహి జగన్ రెడ్డి
- స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ కుట్రలు
- రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



అమరావతి (చైతన్యరథం): బీసీలకు రాజకీయ ప్రోత్సాహం టీడీపీతోనే సాధ్యమని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ సమాయత్తమవుతున్న వేళ వైసీపీ నాయకత్వం హైకోర్టులో వీగిపోయిన కేసును మళ్లీ సుప్రీంకోర్టు దాకా తీసుకెళ్లడం రాష్ట్ర ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీయాలనే కుట్రలకు తెరలేపడం తప్ప మరొకటి కాదన్నారు. 'సర్' ముసుగులో స్థానిక సంస్థల ఎన్నికలను ఏ విధంగానైనా అడ్డుకోవాలనే దురుద్దేశమే వైసీపీ నాయకత్వంలో కనిపిస్తోందన్నారు. ఒకవైపు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని, అందుబాటులో ఉండే ఓటరు జాబితాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుని ఏర్పాట్లు చేస్తుంటే.. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్లాగైనా అడ్డుకోవాలని వైసీపీ సుప్రీంకోర్టుకు వెళ్లడం రాష్ట్ర ప్రయోజనాలను, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని దెబ్బతీయడమే అవుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి రోజా జగన్మోహన్‌రెడ్డి సొంత మీడియాలో పుంఖానుపుంఖాలుగా అసత్య కథనాలను వండి వారుస్తున్నారని కాలవ శ్రీనివాసులు విమర్శించారు. వైసీపీ నాయకత్వానికి బీసీల ప్రయోజనాలతో ఎక్కడైనా, ఎప్పుడైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. ఒక్కటంటే ఒక్క ఉదాహరణ చూపించాలని సవాల్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని వైసీపీ ఎప్పుడైనా ఆలోచన చేసిందా? అంతకుముందు జగన్మోహన్‌రెడ్డి తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎప్పుడైనా ఈ ఆలోచన చేసిందా? అని ప్రశ్నించారు.

**ఎన్టీఆర్ హయాంలోనే బీసీలకు రిజర్వేషన్లు**

1987లో స్థానిక సంస్థల్లో మొట్టమొదటిసారిగా మహనీయుడు ఎన్టీ రామారావు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చారని కాలవ శ్రీనివాసులు తెలిపారు. చంద్రబాబు నాయుడు 1995లో ముఖ్యమంత్రి అయ్యే వరకు 20 శాతం రిజర్వేషన్లే కొనసాగాయని తెలిపారు. 1995లో బీసీల రిజర్వేషన్లను 34 శాతానికి పెంచిన చరిత్ర చంద్రబాబు నాయుడిదేనన్నారు. ఎన్టీ రామారావు ఇచ్చిన రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి బీసీలకు స్థానిక సంస్థల్లో మరింత ప్రాధాన్యం కల్పించిన నాయకుడు చంద్రబాబు నాయుడేనని అన్నారు. 1995 నుంచి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యే వరకు, 2022లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వరకు 34 శాతం రిజర్వేషన్లే అమలయ్యాయని తెలిపారు. 1995 తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా వాటినే కొనసాగించాయని అన్నారు. అలాంటప్పుడు జగన్మోహన్‌రెడ్డి 34 శాతాన్ని 24 శాతానికి ఎందుకు కుదించారో స్పష్టమైన సమాధానం లేదన్నారు. 34 శాతం రిజర్వేషన్లను నిలబెట్టే ప్రయత్నాన్ని చిత్తశుద్ధితో చేయలేదని విమర్శించారు.

**బీసీలకు 16,800 పదవులు నష్టం**

వైసీపీ పాలనలో ఇచ్చిన జీవోలను హైకోర్టు కొట్టివేసిన తర్వాత సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లలేదని కాలవ శ్రీనివాసులు ప్రశ్నించారు. హైకోర్టు తీర్పు వచ్చిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లారని విమర్శించారు. దాదాపు 16,800 పదవులు బీసీలకు రావాల్సి ఉండగా.. గ్రామ పంచాయతీల్లో వార్డుల నుంచి సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్ల వరకు స్థానిక సంస్థల్లో 10 శాతం రిజర్వేషన్లు తగ్గడం వల్ల బీసీలు ఎంతో నష్టపోయారని, దానికి జగన్మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అడుగులు వేస్తుంటే.. వైసీపీ ఎందుకు అడ్డుకుంటుందో సమాధానం చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీఓలను హైకోర్టులో కొట్టివేసిన తర్వాత సుప్రీంకోర్టుకు వెళ్లి పోరాటం చేస్తుంటే వైసీపీ నాయకత్వం దాన్ని ఎగతాళి చేస్తోందన్నారు. అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలని, అన్ని దశల్లోనూ న్యాయస్థానం తలుపు తట్టాలని చిత్తశుద్ధితో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వైసీపీ ఎందుకు హర్షించదని ప్రశ్నించారు. దాని వెనుక బీసీలపై టీడీపీకి ఉన్న నిజమైన చిత్తశుద్ధిని అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**34 శాతానికి పైగా స్థానాలు కేటాయిస్తున్నాం**

యువనాయకుడు, మంత్రి నారా లోకేష్ చెప్పినట్లుగా తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో 34 శాతానికి పైగా బీసీలకు స్థానాలు కేటాయిస్తుందని కాలవ శ్రీనివాసులు తెలిపారు. మరి వైసీపీ నాయకత్వం నుంచి అలాంటి మాట ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. నిజంగా బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీసీలకు న్యాయం చేయించేందుకు వైసీపీ తన వంతు సహకారం ఎందుకు అందించడం లేదని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకూడదనేదే వైసీపీ నాయకత్వం ఉద్దేశమని ఆరోపించారు. అందుకే అడుగడుగునా స్థానిక సంస్థల ఎన్నికలకు వైసీపీ నాయకత్వం అడ్డు తగులుతోందన్నారు.

**ఓటమి భయంతోనే అడ్డంకులు**

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతుందనే భయంతోనే ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల్లో, సర్పంచులుగా పోటీ చేసే వైసీపీ మద్దతుదారులు దారుణంగా ఓడిపోతారనే భయంతోనే జగన్మోహన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలు జరగనివ్వకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. రెండో కారణం 16వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్రానికి రాకూడదని, పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరగకూడదనే దురుద్దేశంతో స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకోవడానికి వైసీపీ నాయకత్వం విశ్వప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు.

**మండల్ కమిషన్ సిఫార్సుల అమలులో టీడీపీ కీలకపాత్ర**

వైసీపీ నాయకులు గానీ, అంతకుముందు ఉన్న కాంగ్రెస్ పార్టీ గానీ బీసీలను ఆదరించాలని, బీసీలకు అధికారంలో అసలైన భాగస్వామ్యం కల్పించాలని ఎప్పుడైనా ఆలోచించాయా.. అని కాలవ శ్రీనివాసులు ప్రశ్నించారు. దేశంలో శతాబ్దాలుగా అణచివేత, దోపిడీ, పీడనకు గురైన వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనే ఆలోచనతో 1979లో కేంద్ర ప్రభుత్వం మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేసిందని తెలిపారు. 1980లో మండల్ కమిషన్ సిఫార్సులతో కూడిన నివేదికను కేంద్రానికి సమర్పించిందన్నారు. 1980 తర్వాత రెండు ప్రభుత్వాలు కేంద్రంలో మారినా 1990 వరకు మండల్ కమిషన్ సిఫార్సులను పట్టించుకోని పరిస్థితి ఉందన్నారు. 1990లో ఎన్టీ రామారావు నాయకత్వంలో ఏర్పాటైన నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం, వీపీ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడానికి నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఎన్టీ రామారావు చైర్మన్‌గా ఉన్న నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుందన్నారు.

మండల్ కమిషన్ సిఫార్సుల అమలుకు నిర్ణయం తీసుకున్న వెంటనే దేశంలో అనేక ఉద్యమాలు, నిరసనలు జరిగాయని కాలవ శ్రీనివాసులు తెలిపారు. కొంతమంది సుప్రీంకోర్టుకు వెళ్లారని, ఆ తర్వాత సుప్రీంకోర్టు కూడా మండల్ కమిషన్ సిఫార్సులను అంగీకరించి ఆమోద ముద్ర వేసిందని అన్నారు. దానికి మూల కారణం తెలుగుదేశం పార్టీకి బీసీలపై ఉన్న ప్రేమ, అనురాగమేనని అన్నారు. ఎన్టీ రామారావుకు బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చిన అనుభవం, చరిత్ర ఉండటంతో ఆయన నాయకత్వంలో ఏర్పాటైన నేషనల్ ఫ్రంట్ బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించిందన్నారు. దేశవ్యాప్తంగా బీసీలు చదువుకునేలా, ఉద్యోగాలు సంపాదించేలా చర్యలు తీసుకుందని తెలిపారు. బీసీల పురోగమనానికి దేశంలో బలమైన పునాదులు వేసింది తెలుగుదేశం పార్టీ నాయకత్వమేనని అన్నారు.

**తెలుగుదేశంతోనే బీసీల ప్రగతి**

తెలుగుదేశం పార్టీకి బీసీలతో ఉన్నది దశాబ్దాల అనుబంధమని కాలవ శ్రీనివాసులు అన్నారు. ఈ బంధం రక్తసంబంధం కంటే బలమైనది, దృఢమైనదని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ రాజకీయాల్లో అనేక సందర్భాల్లో కీలక భూమిక పోషించడానికి కారణం బలమైన బలహీనవర్గాల పునాదిపై నిర్మితమై ఎదగడమేనన్నారు. అందుకే తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీగా ముద్ర వేసుకుందని తెలిపారు. బీసీల ప్రయాణం, బీసీల ప్రగతి తెలుగుదేశం పార్టీతో ప్రారంభమై టీడీపీతోనే ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రంలోనూ, దేశంలోనూ మరే పార్టీకి, మరే రాజకీయ వ్యవస్థకు బీసీలతో ఇంత అవినాభావ సంబంధం, ఆత్మీయ అనుబంధం లేదని స్పష్టం చేశారు.

**కూటమి గెలుపు బీసీల గెలుపు**

బీసీల ఎదుగుదలను, బీసీల రాజకీయ భాగస్వామ్యాన్ని ఓర్చుకోలేని, సహించలేని వైసీపీ నాయకత్వానికి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమిని బలపరచాలని, కూటమి గెలుపును బీసీల గెలుపుగా భావించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా చేస్తున్న కుట్రలను వైసీపీ నాయకత్వం ఇప్పటికైనా మానుకోవాలని హెచ్చరించారు. వైసీపీ కుట్రలు, దురాలోచనలను బీసీ యువత, బీసీ మేధావులు గ్రహించారన్నారు. వారు ఆలోచన చేస్తున్నారని తెలిపారు. వైసీపీ ఇప్పటికే 11 స్థానాలకు పడిపోయిందని, దాని ప్రతిష్ట పాతాళానికి చేరిందని విమర్శించారు. ఇంకా ఇలాంటి కుట్రలు చేస్తే ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీకి అడ్రస్ గల్లంతవుతుందని హెచ్చరించారు. బీసీలందరూ దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ నాయకత్వంతో, చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమితోనే తమ ప్రయాణాన్ని కొనసాగిస్తారని కాలవ శ్రీనివాసులు విశ్వాసం వ్యక్తం చేశారు.



# డేటా సెంటర్లపై గొడ్డలి పార్టీ విష ప్రచారం

- అడ్డుకునేందుకు జగన్ రెడ్డి కుట్రలు, కుహనా మేధావులతో కోర్టుల్లో కేసులు
- పేటీఎం బ్యాచ్‌తో సోషల్ మీడియాలో అసత్య కథనాలు
- నీటి కొరత, పర్యావరణంపై అపోహలు సృష్టించే పన్నాగం
- రాష్ట్ర భవిష్యత్తు, యువతకు ఉపాధి, పెట్టుబడులే కూటమి లక్ష్యం
- వైజాగ్ ఏఐ, హైపర్ స్కేల్ డేటా సెంటర్.. రాష్ట్ర ఆర్థికరంగానికి అత్యంత కీలకం
- ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్



అమరావతి (చైతన్యరథం): విశాఖపట్నాన్ని అంతర్జాతీయ స్థాయి టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్న ప్రాజెక్టుల్లో ఏఐ హైపర్‌స్కేల్ డేటా సెంటర్ అత్యంత కీలకమైనదని.. అయితే డేటా సెంటర్లపై గొడ్డలి పార్టీ విష ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తుందని ఏపీ బయో డైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ దుయ్యబట్టారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైజాగ్ ఏఐ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రూపురేఖలను మార్చబోయే ప్రాజెక్ట్ అన్నారు. విశాఖపట్నం గ్లోబల్ టెక్నాలజీ సెంటర్‌గా అభివృద్ధి చెందుతుంటే.. దీన్ని అడ్డుకునేందుకు జగన్మోహన్ రెడ్డి, ఆయన పేటీఎం బ్యాచ్ కోర్టుకెళ్లారు. జగన్ కనుసన్నల్లో ఉండే స్వయం ప్రకటిత పర్యావరణవాదులు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ)కు వెళ్లారు. కానీ హైకోర్టు, ఎన్జీటీ.. గొడ్డలి పార్టీ నేతల పిటిషన్‌లను పట్టించుకోలేదు. కోర్టు మొట్టికాయలు వేసినా జగన్ తీరు మార్చుకోవటం లేదు. తన పేటీఎం యూట్యూబర్లు, మేధావులతో డేటా సెంటర్లపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడని విజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పేటీఎం బ్యాచ్‌తో ఫేక్ ప్రచారం**

వైజాగ్ ఏఐ, హైపర్ స్కేల్ డేటా సెంటర్ సంస్థ ఐర్లాండ్‌లో మూసేసారని, అటువంటి కంపెనీ విశాఖలో ఏర్పాటవుతుందని, దీని వలన పర్యావరణ నష్టం, నీటి కొరత ఏర్పడుతుందని దుష్ప్రచారం చేస్తున్నారు. కనీసం కంపెనీ పేరును గూగుల్‌లో సెర్చ్ చేయడం కూడా చేతకాని వారు యూ ట్యూబ్‌లో ఏదేదో మాట్లాడేస్తున్నారు. ఈ సంస్థ ఐర్లాండ్‌లో మూసివేయలేదు. ఐర్లాండ్‌లో కొత్త డేటా సెంటర్లకు అనుమతులు ఇవ్వకూడదనే విధాన నిర్ణయం తీసుకురావడంతో కొత్త డేటా సెంటర్ పెట్టాలని యోచించిన హైపర్ స్కేల్ సంస్థ నేడు మన రాష్ట్రంలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని చూసి విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందని విజయ్ కుమార్ తెలిపారు.

**పెట్టుబడులను తరిమేయడమే జగన్ ఏకైక అజెండా**

డేటా సెంటర్ల ఏర్పాటు వలన ఉత్తరాంధ్రలో ప్రధానంగా విశాఖలో నీటి కొరత ఏర్పడుతుందని ఈఏఎస్ శర్మ లాంటి కుహనా మేధావుల చేత జగన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేయిస్తున్నాడు. క్షేత్రస్థాయి సాంకేతిక వాస్తవాలను గాలికొదిలి, రాష్ట్రానికి వచ్చే రూ. లక్షన్నర కోట్ల పెట్టుబడులను తరిమేసేలా కుట్రపూరిత ప్రచారాలకు తెరలేపారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన అధికారిక సమాధానాలు, పోలవరం ప్రాజెక్టు జలాల కేటాయింపులపై ఉన్న పక్కా లెక్కలు, హైకోర్టు ఇచ్చిన స్పష్టమైన తీర్పులను ఒకసారి తెలుసుకోవాలని విజయ్ కుమార్ హితవు పలికారు.

**విశాఖలో నీటి కొరత.. దుష్ప్రచారం**

డేటా సెంటర్ల వలన నీటి కొరత ఏర్పడుతుందనేది పూర్తిగా అవాస్తవం, ప్రజలను తప్పుదోవ పట్టించే దుష్ప్రచారం. విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ నగర ప్రజల తాగునీటి సరఫరా వ్యవస్థకు, ఈ డేటా సెంటర్లకు కేటాయించే నీటి వ్యవస్థకు ఎక్కడా సంబంధం లేదు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ-అనకాపల్లి ప్రాంతానికి వచ్చే మిగులు జలాలు మొత్తం 28.44 టీఎంసీలు. ఇందులో మున్సిపల్ పరిధిలోని ప్రజల వార్షిక తాగునీటి కోటా కేవలం 12 టీఎంసీలు మాత్రమే. ఈ తాగునీటి కోటాను ప్రభుత్వం తాకదు. దాని జోలికి వెళ్లడం లేదు. అనకాపల్లి, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలోని పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన 7.44 టీఎంసీల నీటిలో నుంచే ఈ కేటాయింపులు జరుగుతున్నాయి. ప్రతి ఏటా సముద్రంలో వృథాగా కలిసే 3,000 టీఎంసీల గోదావరి జలాల నుండి ఈ పరిశ్రమలకు ఇస్తున్నారే తప్ప, రైతుల కోసమో, ప్రజల తాగునీటి కోసమో కేటాయించిన నీటిని ప్రభుత్వం తీసుకోలేదు. గూగుల్ డేటా సెంటర్ పూర్తి స్థాయిలో పనిచేయడానికి సంవత్సరానికి కేవలం 3.5 టీఎంసీలు అవసరమవుతాయి. విశాఖపట్నం ఐటీ కారిడార్ గరిష్ట సామర్థ్యమైన 6.5 గిగావాట్లకు చేరుకున్నప్పుడు మాత్రమే ఈ నీటి అవసరం ఉంటుంది. అంటే గోదావరి నుండి సముద్రంలో వృథాగా కలిసే 3 వేల టీఎంసీల జలాల్లో ఇది కేవలం 0.1 శాతం మాత్రమేనని విజయ్ కుమార్ స్పష్టం చేశారు.

**సభ సాక్షిగా డేటా సెంటర్ల నీటి వినియోగంపై స్పష్టత**

రాజ్యసభలో సుధా మూర్తి అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ అధికారికంగా సమాధానం ఇస్తూ, పర్యావరణ అనుమతి మంజూరు చేసే ముందే సమగ్ర వాటర్ బ్యాలెన్స్ నివేదిక ఇవ్వడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ జారీ చేసిన నిబంధనల ప్రకారం వాణిజ్య/మౌలిక ప్రాజెక్టులకు భూగర్భ జలాల తోడకంపై అత్యంత కఠినమైన నియంత్రణలు ఉంటాయి. ఆధునిక హైపర్ స్కేల్ డేటా సెంటర్లు మురుగునీటిని నేరుగా వదలవు. ఇవి క్లోజ్డ్-లూప్ ఎయిర్/వాటర్ కూలింగ్ మెకానిజమ్స్, గ్రే-వాటర్ రీసైక్లింగ్ పద్ధతులను వాడుతాయి. అంతేకాకుండా, గూగుల్ వంటి సంస్థలు 2030 నాటికి 'వాటర్ పాజిటివ్' కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాయి. అంటే వారు వాడే నీటి కంటే ఎక్కువ నీటిని స్థానిక చెరువుల పునరుద్ధరణ, టెర్షియరీ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వారా తిరిగి సమాజానికి అందిస్తాయని విజయ్ కుమార్ వివరించారు.

**పర్యావరణ నష్టం ఉండదు**

2006 పర్యావరణ ప్రభావ అంచనా (ఈఐఏ) నోటిఫికేషన్ ప్రకారం "డేటా సెంటర్" రంగానికి ప్రత్యేకంగా లేదా స్వతంత్రంగా పర్యావరణ అనుమతులు పొందే నిబంధన లేదు. వీటి భవన నిర్మాణ వైశాల్యం ఆధారంగా ఐటమ్ 8 (ఏ), ఐటమ్ 8 (బీ) పరిధిలోకి వస్తాయి. విశాఖ ప్రాజెక్టు భవన నిర్మాణ నిబంధనల ప్రకారం ఐటమ్ 8 (ఏ) పరిధిలోకి వస్తుంది. ఈఐఏ నోటిఫికేషన్-2006 లోని అపెండిక్స్ IV మార్గదర్శకాల ప్రకారం ఐటమ్ 8 (ఏ) భవన నిర్మాణ ప్రాజెక్టులన్నింటికీ స్టేజ్-3 'ప్రజాభిప్రాయ సేకరణ' నుంచి సంపూర్ణ చట్టబద్ధమైన మినహాయింపు ఉంది. ఈ మినహాయింపు వెనుక బలమైన సాంకేతిక కారణం ఉంది. సాధారణ భవనాల లాగా కాకుండా, ఏఐ డేటా సెంటర్లు అత్యంత సంక్లిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు. వీటి పర్యావరణ ప్రభావాన్ని పబ్లిక్ ఫోరంల్లో కేవలం నినాదాలతో అంచనా వేయలేము. కాబట్టి డబ్ల్యూయూఈ, పీయూఈ, క్లోజ్డ్ లూప్ కూలింగ్ వంటి సాంకేతిక అంశాలను విశ్లేషించే బాధ్యతను చట్టం సియా (ఎస్ఈఐఏఏ) పరిధిలోని రాష్ట్ర స్థాయి నిపుణుల మూల్యాంకన కమిటీ (ఎస్ఈఏసీ) పరిశీలనకే అప్పగించింది. ఈ ఏడాది జూన్ 10న రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ అన్ని నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే చట్టబద్ధంగా అనుమతులు మంజూరు చేసింది. విశాఖపట్నం అడవివరం, ముడసర్లోవ ప్రాంతాలలో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టులు వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు లేదా ఎకో-సెన్సిటివ్ జోన్ల నిబంధనలకు కట్టుబడి ఉంటాయి. రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా అథారిటీ (ఎస్ఈఐఏఏ), రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (ఎస్‌పీసీబీ) నిర్దేశించిన గ్రీన్ బఫర్ జోన్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ (జడ్ఎల్‌డీ) వంటి కఠినమైన పర్యావరణ ప్రమాణాలను పాటిస్తూనే ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రకృతిని నాశనం చేయడం కాదు, గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ తో పర్యావరణ హితంగా వీటిని రూపుదిద్దుతున్నారని విజయ్ కుమార్ స్పష్టం చేశారు.

**న్యాయస్థానం స్పష్టత**

విశాఖపట్నంలోని అడవివరం, ముడసర్లోవ ప్రాంతాల్లో డేటా సెంటర్ల ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం స్పష్టమైన తీర్పునిచ్చింది. సొంత రిస్క్‌తో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించుకోవచ్చు అని హైకోర్టు స్పష్టం చేసింది. భారీ పెట్టుబడులు పెట్టామనే కారణంగా కోర్టుల నుంచి ఎలాంటి ప్రత్యేక ఈక్విటీ లేదా స్టే కోరడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, సీనియర్ లాయర్ అవినాష్ దేశాయ్ వాదనలను పరిగణలోకి తీసుకున్న కోర్టు, ప్రాజెక్టు తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేస్తూనే, పిటిషనర్లు పర్యావరణ విధ్వంసానికి సంబంధించి ఎలాంటి బలమైన ఆధారాలు చూపలేకపోవడంతో ప్రాజెక్టును నిలిపివేసేందుకు నిరాకరించిందని విజయ్ కుమార్ వివరించారు.

**డేటా సెంటర్లతో కరెంట్ కష్టాలు అపోహ**

గూగుల్, అదానీ భాగస్వామ్యంతో విశాఖలో ఏర్పాటవుతున్న డేటా సెంటర్ కారిడార్ కేవలం సాంప్రదాయ విద్యుత్ గ్రిడ్‌పైనే పూర్తిగా ఆధారపడదు. ప్రపంచవ్యాప్తంగా గూగుల్ సంస్థ తమ హైపర్ స్కేల్ డేటా సెంటర్ల కోసం 100% పునరుత్పాదక ఇంధన విధానాలనే అనుసరిస్తుంది. స్థానిక విద్యుత్ సరఫరా వ్యవస్థపై భారం పడకుండా ప్రత్యేక గ్రీన్ ఎనర్జీ పీపీఏల ద్వారా నేరుగా గ్రీన్ పవర్ ను సమకూర్చుకునేలా ప్రణాళికలు రూపొందించారు. కాబట్టి సాధారణ గృహ వినియోగదారులకు లేదా చిన్న పరిశ్రమలకు ఇచ్చే విద్యుత్ కోతలకు దీనికి ఎలాంటి సంబంధం లేదు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసినట్లుగా, ఒక గిగావాట్ (1 జీడబ్ల్యూ) సామర్థ్యం గల థర్మల్ పవర్ ప్లాంట్ వార్షికంగా దీనికి దాదాపు 10 రెట్లు ఎక్కువ నీటిని వినియోగిస్తుంది. కానీ, డేటా సెంటర్లు కేవలం ఉష్ణోగ్రత నియంత్రణ కోసం మాత్రమే నీటిని ఉపయోగిస్తాయి. అందులోనూ ఆధునిక క్లోజ్డ్-లూప్ ఎయిర్/ వాటర్ కూలింగ్ టెక్నాలజీస్, గ్రే-వాటర్ రీసైక్లింగ్ విధానాల వల్ల నీటి వినియోగం అత్యంత కనిష్టంగా ఉంటుంది. కేవలం రాజకీయ దురుద్దేశంతో, పర్యావరణ ముసుగులో థర్మల్ ప్లాంట్లకు లేని వ్యతిరేకతను డిజిటల్ టెక్నాలజీపై చూపుతూ రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూడటం సరికాదని విజయ్ కుమార్ తెలిపారు.

**అన్ని రంగాల అభివృద్ధిలో విశాఖ టాప్**

లక్షన్నర కోట్లకు పైగా పెట్టుబడులు విశాఖకు వస్తున్నాయంటే, ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఇంజనీరింగ్, టెక్ నిపుణులకు, సానిక యువతకు అత్యున్నత ఉపాధి అవకాశాలు లభిసాయి. విశాఖపట్నం కేవలం ఒక పర్యాటక నగరంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి 'గ్రీన్ ఏఐ అండ్ డేటా హబ్'గా మారుతుంది. దీనివల్ల రియల్ ఎస్టేట్, సర్వీస్ సెక్టార్, స్థానిక వ్యాపారాలు అద్భుతమైన వృద్ధిని సాధించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. ఏసీ గదుల్లో హాయిగా కూర్చుని, గిగాబైట్ల డేటాను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తూ, అదే డేటా సెంటర్ల వ్యవస్థపై విషం చిమ్మడం విడ్డూరం. పర్యావరణ ముసుగులో కోర్టుల్లో పిటిషన్లు వేస్తూ, ప్రాజెక్టులను సంవత్సరాల తరబడి సాగదీసి, బ్లాక్ మెయిల్ చేసే లిటిగెంట్లు, సోషల్ మీడియాలో రాజకీయ లబ్ధి కోసం దుష్ప్రచారం చేస్తే రాష్ట్రం భారీగా నష్టపోతుంది. రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ, లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూనే పర్యావరణాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ సాంకేతిక విప్లవాన్ని అడ్డుకోవాలని చూసే కుట్రలను ప్రజలే తిప్పికొట్టాలని విజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.









# డా. ఎన్టీఆర్ వైద్యసేవకు కూటమి బలమైన చేయూత

- **పేదల వైద్యానికి భద్రతగా నిలుస్తోన్న పథకం**
- **రెండేళ్లలో ఈ పథకానికి రూ.8,750 కోట్లు ఖర్చు**
- **గత ప్రభుత్వంలో పేదల వైద్యానికి తూట్లు పొడిచిన జగన్**
- **నెట్ వర్క్ ఆసుపత్రులకు రూ.2,700 కోట్ల బకాయిలు**

ఆరోగ్యం వ్యాపారం కాదు.. పేదవాడి హక్కు అనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భావన. అందుకే సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించేలనే కృత నిశ్చయంతో మన రాష్ట్రంలో డా. ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని కూటమి ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. గత వైసీపీ పాలనలో నిర్వీర్యమైన ఈ పథకాన్ని ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో చెల్లింపులు చేస్తూ పేదల వైద్యానికి కొండంత బాసటగా నిలుస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విడిచిపెట్టిన రూ.2,700 కోట్ల బకాయిలను చెల్లిస్తూనే.. ఈ రెండేళ్ల కాలంలో మొత్తం రూ.8,750 కోట్లు వరకు బిల్లులు చెల్లించి ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రదర్శించింది.

**రూ.వెయ్యి కోట్లకు తాజాగా పరిపాలన అనుమతి**

పేదల ఆరోగ్యాన్ని ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్న ఎన్డీయే కూటమి 2026-27 బడ్జెట్‌లో వైద్యారోగ్య రంగానికి రూ.19 వేల కోట్ల కేటాయింపులు చేసింది. ఇందులో ఎన్టీఆర్ వైద్య సేవకు రూ.4,000 కోట్లుకేటాయించడం ద్వారా పేదల వైద్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం రెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేయగా తాజాగా మరో వెయ్యి కోట్ల రూపాయల విడుదలకు పరిపాలన అనుమతి కోరింది. దీంతో మొత్తం ఈ ఏడాదిలో మూడు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి పేద ప్రజలకు ఆరోగ్య భద్రతను కల్పించింది.

పేద కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం పడకుండా ఈ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరిస్తోంది. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ఉచిత వైద్య సహాయ పరిమితిని కూటమి ప్రభుత్వం రూ.5 లక్షలకు పెంచింది. అలానే నగదు రహిత వైద్య సేవలను రూ.25 లక్షల వరకు అందుబాటులోకి తీసుకొచ్చింది. హైబ్రిడ్ మోడల్ ద్వారా 1.43 కోట్ల బీపీఎల్ కుటుంబాలకు ఎన్టీఆర్ వైద్య సేవతో భరోసా కల్పిస్తోంది. గుండె, క్యాన్సర్, కిడ్నీ, న్యూరాలజీ వంటి ఖరీదైన చికిత్సలు కూడా పేదలకు అందుబాటులోకి రావడం ఈ పథకం ప్రాధాన్యతను మరింత పెంచింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నెలకు చికిత్స పొందుతున్న వారి సంఖ్య 1.04 లక్షల నుంచి 1.26 లక్షలకు పెరిగిందంటే ఈ పథకంపై ప్రజా విశ్వాసం పెరిగేందుకు ప్రభుత్వం చూపిస్తోన్న చిత్తశుద్దే కారణం. బకాయిల చెల్లింపులు, చికిత్స పరిధి విస్తరణ, నగదు రహిత వైద్య సేవల బలోపేతం, ఖరీదైన చికిత్సలను అందుబాటులోకి తీసుకురావడం వంటి చర్యలతో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం పేద కుటుంబాలకు ఆపద సమయంలో అండగా నిలిచే ఆరోగ్య భరోసాగా కొనసాగుతోంది.



**ఎన్టీఆర్ వైద్య సేవ పథకం :**

| చంద్రబాబు నాయుడు హయంలో | జగన్మోహన్ రెడ్డి హయంలో |
|---|---|
| ఎ. రెండేళ్లలో రూ.8,750 కోట్లు విడుదల ఏడాది రూ.2,700 కోట్లు బకాయిలు పెండింగ్ | ఎ. ఐదేళ్లలో రూ.9,000 కోట్లు, చివరి |
| బి. సగటున ఏడాదికి రూ.4,315 కోట్లు | బి. ఏడాదికి రూ.1800 కోట్లు |
| సీ. 3,257 రకాల రోగాలకు చికిత్స | సీ. 2,000పైగా రోగాలకు చికిత్స |
| డీ. లబ్ధిదారుల సంఖ్య ఏడాదికి సగటు 14లక్షలు 8లక్షలు | డీ. లబ్ధిదారుల సంఖ్య ఏడాదికి సగటు |




ఎన్. నీలం నాయుడు, ఎనలిస్టు, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

**జగన్ పాలనలో వికటించిన ఆరోగ్య రంగం**

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక సంక్షోభంతో పాటు ఆరోగ్య రంగం కూడా అనేక సమస్యలను ఎదుర్కొంది. జాతీయ ఆరోగ్య మిషన్‌తో పాటు రాష్ట్ర ఆరోగ్యశాఖ నిధుల వినియోగంపై కూడా అనేక ప్రశ్నలు తలెత్తాయి. ముఖ్యంగా జీవో నెం. 107, 108 తీసుకొచ్చి వైద్య సీట్లను ప్రైవేట్ పరం చేశారు. దీంతో పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేసి కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యులకు దూరం చేశారు. మరోవైపు మందులు, సర్జికల్ సామగ్రి సరఫరా చేసిన సంస్థలకు బకాయిలు పేరుకుపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారురూ.900 కోట్ల బకాయిలను చెల్లించడంతో సరఫరాదారులు తిరిగి మందులు, సర్జికల్ సామగ్రి అందించేందుకు ముందుకొచ్చారు. జగన్ రాజకీయ పరాకాష్టకు నిదర్శనంగా డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ పేరును మార్చారు.

ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బకాయిల చెల్లింపు, ఆసుపత్రులకు మందుల సరఫరా, వైద్య సేవల విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. గత పాలనలో పేరుకుపోయిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఆరోగ్యం వ్యాపారం కాదు.. పేదవాడికి హక్కు అనే లక్ష్యంతో ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయం.

ఒక ముఖ్యమంత్రి రోజులో ఎన్ని గంటలు పనిచేస్తారు? ఒక వారం రోజుల్లో ఎన్ని కార్యక్రమాల్లో పాల్గొనగలరు? సాధారణంగా ఇలాంటి ప్రశ్నలకు మన దగ్గర పెద్దగా సమాధానాలు ఉండవు. ఎందుకంటే ప్రభుత్వ పాలనలో జరిగే చాలా పనులు ఫైళ్లలో, సమావేశాల్లో, అధికారిక ప్రకటనల్లోనే కనిపిస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఒక ముఖ్యమంత్రి షెడ్యూల్‌ను గమనిస్తే.. ప్రభుత్వం ఏ దిశగా వెళుతుందో కూడా అర్థం చేసుకోవచ్చు.







# 7 రోజులు... 9 కార్యక్రమాలు

సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 5 వరకు ఏడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్న తొమ్మిది కార్యక్రమాలను పరిశీలిస్తే అలాంటి ఆసక్తికరమైన చిత్రం కనిపిస్తుంది. ఈ తొమ్మిది కార్యక్రమాలు ఒకే రంగానికి సంబంధించినవి కావు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు నుంచి గ్రామీణ మౌలికవసతుల వరకు.. పేదలకు ఇళ్లస్థలాల నుంచి పింఛన్ల వరకు.. రాయలసీమ హార్టికల్చర్ అభివృద్ధి నుంచి సురక్షిత తాగునీటి వరకు.. ఐటీలు, టెక్నాలజీ నుంచి స్వచ్ఛత వరకు విస్తరించి ఉన్నాయి. ఒక 26 ఏళ్ల యువకుడిగా చూస్తే ఇందులో నాకు కనిపించిన ముఖ్యమైన విషయం కార్యక్రమాల సంఖ్య కాదు. ఒక రాష్ట్రాన్ని తిరిగి నిర్మించాలంటే ఒకేసారి ఎన్నో రంగాలపై పనిచేయాల్సి ఉంటుందనే వాస్తవం.

## మొదటిరోజు..పాలన నుంచి పల్లె వరకు



సెప్టెంబర్ 29న విజయవాడలో మిషన్ కర్మయోగి ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ వర్క్‌షాప్‌ను చంద్రబాబు ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో సామర్థ్యాలను పెంచడం, పరిపాలనా నైపుణ్యాలను మెరుగుపరచడం ఈ కార్యక్రమం లక్ష్యం. అదేరోజు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో కలిసి పల్లె పండుగ 3.0ను ప్రారంభించారు. రూ.11,085 కోట్లతో గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, పంటకుంటలు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ఈ రెండు కార్యక్రమాలను కలిపి చూస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. ఒక వైపు ప్రభుత్వ యంత్రాంగం పనితీరును మెరుగుపరచడం.. మరోవైపు ఆ ప్రభుత్వ పనితీరు చివరకు కనిపించాల్సింది గ్రామంలోనే అనే ఆలోచన.

## రెండోరోజు..పేదలకు ఆస్తి



సెప్టెంబరు 30న విజయవాడ సింగ్‌నగర్‌లోని ఎంబీవీకే స్టేడియంలో 'పేదలకు పట్టాభిషేకం' కార్యక్రమం జరిగింది. 24,057 మంది నిరుపేదలకు సర్వహక్కులతో ఇళ్ల స్థలాలను అందించారు. అదేరోజు విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరి ప్రాంతాల్లో కలిపి 60 వేల మంది పేదలకు రూ.52 వేల కోట్ల విలువైన ఆస్తులను అందించే కార్యక్రమాలు జరిగాయి. పేదరికం పై మాట్లాడటం ఒక విషయం. పేద కుటుంబానికి ఒక ఆస్తి పత్రం చేతిలో పెట్టడం మరో విషయం. ఇల్లు కట్టుకోవడానికి స్థలం ఉండటం అనేది కేవలం ఒక భౌతిక అవసరం కాదు. అది ఒక కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తుపై నమ్మకాన్ని ఇస్తుంది.

## మూడోరోజు..పింఛన్ కోసం ముఖ్యమంత్రి




అక్టోబరు 1న రేపల్లెలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో స్వయంగా పాల్గొనడం ఆయన షెడ్యూల్‌లో ఒక భాగంగా మారింది. ఇది రాజకీయంగా ఎలా కనిపించినా.. ఒక వృద్ధుడికి నెల మొదటిరోజే పింఛన్ అందడం, ఒక దివ్యాంగుడికి ఆర్థిక భరోసా లభించడం వారి రోజువారీ జీవితంలో మాత్రం చాలా ముఖ్యమైన విషయం. పాలన అంటే పెద్ద ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి నెలా ఒక కుటుంబం ఎదురుచూసే చిన్న మొత్తాన్ని సమయానికి అందించడం కూడా పాలనే.

## నాలుగోరోజు..రాయలసీమకు కొత్త అవకాశం



అక్టోబరు 2న గాంధీ జయంతి రోజున మదనపల్లెలో రూ.1 లక్ష కోట్ల అంచనా పెట్టుబడితో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టారు. రాయలసీమ గురించి మాట్లాడేటప్పుడు ఇప్పటివరకు కరువు, వలసలు, వెనుకబాటుతనం వంటి పదాలే ఎక్కువగా వినిపించేవి. కానీ ఉద్యాన పంటలు, ప్రాసెసింగ్, కోల్డ్ చెయిన్, ఎగుమతులు, మార్కెట్లను కలిపి ఒక సమగ్ర హార్టికల్చర్ ఎకోసిస్టమ్ నిర్మించగలిగితే.. అదే ప్రాంతం రైతుల ఆదాయానికి కొత్త ఇంజిన్‌గా మారవచ్చు. అదేరోజు విజయవాడలో స్వర్ణాంధ్ర-- స్వచ్ఛాంధ్ర అవార్డులను అందించడం ద్వారా పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. అంటే అభివృద్ధి అంటే కేవలం పెట్టుబడులు కాదు.. ప్రజలు నివసించే పరిసరాల నాణ్యత కూడా.

## ఐదో రోజు..ఐఐటీలతో భవిష్యత్తు

అక్టోబరు 3న విజయవాడలో జరిగిన పాన్ ఐఐటీ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి అమరావతిలో పాన్ ఐఐటీ శాశ్వత కౌన్సిల్ ఏర్పాటు

### ఒక సీఎం పనివేగాన్ని అర్థం చేసుకోవడానికి ఇదొక చిన్న ఉదాహరణ




కు సంబంధించిన ప్రకటన చేశారు. ఈ అంశం యువతకు ప్రత్యేకంగా ఆసక్తికరంగా ఉంటుంది. ఈరోజు యువతకు ఉద్యోగం కావాలి. కానీ దానికంటే ముందు మంచి విద్య, పరిశోధన, టెక్నాలజీ, స్టార్టప్ అవకాశాలు, పరిశ్రమలతో అనుసంధానం కావాలి. రాష్ట్రంలో అలాంటి ఎకోసిస్టమ్ ఏర్పడితేనే వచ్చే తరం ఆంధ్రప్రదేశ్‌లోనే అవకాశాలను వెతుక్కునే పరిస్థితి వస్తుంది.

## ఆరో రోజు..సొంతింటి కలకు టెక్నాలజీ జోడింపు



అక్టోబరు 4న తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెంలో మూడు లక్షల పేదల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఇందులో ఆసక్తికరమైన అంశం 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా ఇళ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టును ప్రారంభించడం. తొలిదశలో 177 ఇళ్లను ప్రయోగాత్మకంగా నిర్మించనున్నారు. ఇది విజయవంతమైతే భవిష్యత్తులో ఇళ్ల నిర్మాణంలో సమయం, వ్యయం, సాంకేతికత వంటి అంశాలపై కొత్త అవకాశాలు తెరుచుకోవచ్చు. 2029 నాటికి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో 19 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రణాళిక వేస్తున్న నేపథ్యంలో.. ఇలాంటి కొత్త టెక్నాలజీలను పరీక్షించడం కూడా అవసరమే.

## ఏడో రోజు..చివరికి నీరే ముఖ్యం



అక్టోబరు 5న కడప జిల్లా పొద్దుటూరు మండలం కొత్తపల్లిలో జల్ జీవన్ మిషన్ 2.0-అమరజీవి జలధార కార్యక్రమాల్లో భాగంగా రూ.30,156 కోట్ల విలువైన పనులను ప్రారంభించారు. 90 లక్షల కుటుంబాలకు సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. టెక్నాలజీ ఎంత వచ్చినా, పెట్టుబడులు ఎంత వచ్చినా, చివరికి ఒక కుటుంబానికి అవసరమైన ప్రాథమిక సదుపాయాలు అందకపోతే అభివృద్ధి అసంపూర్ణమే. అందుకే తాగునీరు వంటి మౌలిక అవసరాలకు ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యం కీలకం.

## తొమ్మిది కార్యక్రమాలు..కానీ ఒకే పెద్ద చిత్రం

ఈ ఏడు రోజులను విడివిడిగా చూస్తే ఇవి తొమ్మిది ప్రభుత్వ కార్యక్రమాలుగా కనిపిస్తాయి. కానీ ఒకసారి మొత్తం చిత్రాన్ని చూస్తే..మిషన్ కర్మయోగి నుంచి పాన్ ఐఐటీ వరకు..పేదల ఇళ్ల స్థలాల నుంచి ఇళ్ల నిర్మాణం వరకు..పింఛన్ల నుంచి తాగునీటి వరకు..గ్రామీణ రోడ్ల నుంచి రాయలసీమ హార్టికల్చర్ హబ్ వరకు..స్వచ్ఛత నుంచి 3డీ టెక్నాలజీ వరకు.. ఒక రాష్ట్ర పునర్నిర్మాణానికి అవసరమైన అనేక అంశాలు ఇందులో కనిపిస్తాయి. చంద్రబాబు పని తీరుపై రాజకీయ అభిప్రాయాలు ఎవరికైనా ఉండొచ్చు. ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించే వారు ఉంటారు, విమర్శించే వారు కూడా ఉంటారు. అది ప్రజాస్వామ్యంలో సహజం. కానీ ఒక ముఖ్యమంత్రి షెడ్యూల్‌లో వరుసగా కనిపిస్తున్న ఈ అంశాలను మాత్రం గమనించకుండా ఉండలేం. ఒక రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం అంటే ఒక్క భారీ ప్రాజెక్టు పూర్తి చేయడం కాదు. వేల గ్రామాల్లో రోడ్లు వేయాలి. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. పింఛన్లు సమయానికి అందాలి. రైతులకు కొత్త మార్కెట్లు రావాలి. యువతకు విద్య, ఉద్యోగ అవకాశాలు పెరగాలి. ప్రతి ఇంటికి తాగునీరు చేరాలి. అదే సమయంలో కొత్త టెక్నాలజీ, పెట్టుబడులు, పరిశ్రమలు కూడా రావాలి. ఇవన్నీ ఒకేసారి నడవాల్సిందే. అందుకే ఏడు రోజుల్లో తొమ్మిది కార్యక్రమాలు అనేది కేవలం ఒక సంఖ్యగా చూడాల్సిన అవసరం లేదు. ఒక ముఖ్యమంత్రి ఏ స్థాయిలో పని ఒత్తిడిని తీసుకుంటున్నారు అనేదానికి ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఏడు రోజులు.. తొమ్మిది కార్యక్రమాలు.. ప్రకటనల నుంచి అమలు వైపు..హామీల నుంచి ఫలితాల వైపు.. పాలన నుంచి ప్రజల జీవితాల్లో మార్పు వైపు.. ఆంధ్రప్రదేశ్ మరో కొత్త దిశగా అడుగులు మొదలయ్యాయి.

శశికుమార్
తెలుగుదేశం సైనికుడు



## టెక్కలికి అభివృద్ధి వరాలు... రూ.3.45 కోట్ల పనులకు శ్రీకారం

- వైసీపీ పాలనలో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం
- 2029 నాటికి ప్రతి గ్రామానికి మౌలిక వసతులే లక్ష్యం
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు రాజీలేని చర్యలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



టెక్కలి (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు మహిళలు, చిన్నారుల సంక్షేమం, భూగర్భ జలాల పరిరక్షణ, పరిపాలనా సౌకర్యాల విస్తరణకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా టెక్కలి మండల కేంద్రంలో గురువారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొత్తం రూ.3.45 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు శ్రీకారం చుట్టారు.

### వైసీపీ పాలనలో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తం ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం

వైసీపీ పాలనలో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేసి, రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేశారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ తన బాధ్యతగా భావిస్తున్నానని, టెక్కలి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కాపాడేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

### మహిళలకు అండగా సఖి కేంద్రం

మహిళలు, బాలికల రక్షణ, సంక్షేమం కోసం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో సఖి వన్‌స్టాప్ సెంటర్ నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. బాధిత మహిళలు, బాలికలకు అవసరమైన సహాయాన్ని ఒకే వేదికపై అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు.

### భూగర్భ జలాల పునరుద్ధరణకు చర్యలు

టెక్కలిలో భూగర్భ జలాల పునరుద్ధరణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో టీటీ రోడ్డు నుంచి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి వరకు రూ.85 లక్షలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. MGNREGS, MPGF, GPGF నిధులను వినియోగించి నీటి వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### అంగన్వాడీ భవనానికి శంకుస్థాపన

ఏపీడీఎస్ ప్రాజెక్టు, టెక్కలి పరిధిలో రూ.కోటి అంచనా వ్యయంతో అంగన్వాడీ భవనాన్ని నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. MPGF (ICDS) నిధులతో చేపట్టనున్న ఈ భవనం ద్వారా చిన్నారులకు మెరుగైన వాతావరణంలో సేవలు అందించేందుకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు.

### డివిజన్ కార్యాలయానికి కొత్త భవనం

బొడ్డేపల్లి గోపాల్ రావు , వంశధార ప్రాజెక్ట్ ఎడమ ప్రధాన కాలువ పంచాయతీ పరిధిలో రూ.కోటితో డివిజన్ కార్యాలయ భవనాన్ని నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. దీంతో స్థానికులకు పరిపాలనా సేవలు మరింత చేరువవుతాయని చెప్పారు.

### 2029 నాటికి ప్రతి గ్రామానికి వసతులు

2029 నాటికి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, అంగన్వాడీ భవనాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

### వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యం

గత వైకాపా ప్రభుత్వ హయాంలో టెక్కలి నియోజకవర్గంలో అభివృద్ధికి తగిన ప్రాధాన్యం దక్కలేదని మంత్రి విమర్శించారు. ఐదేళ్ల పాలనలో అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారని, త్వరలో నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.

### ప్రభుత్వ భూములకు రక్షణ కవచం

ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, నకిలీ పట్టాలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివాదాల్లో ఉన్న ప్రభుత్వ భూముల రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తున్నామని, అవసరమైతే ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి అయినా ప్రభుత్వ ఆస్తులను కాపాడుతామని చెప్పారు. ప్రజా అవసరాల కోసం ప్రభుత్వ భూములను వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలకు అవసరమైన స్థలాలను కేటాయిస్తున్నట్లు చెప్పారు.

### అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఇల్లు, ఇంటి స్థలం అందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం 3.20 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా ఇళ్లు, స్థలాలు అందిస్తామని చెప్పారు.

### రైలు ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు

టెక్కలి మండల పరిధిలో ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన నలుగురి కుటుంబసభ్యులకు మంత్రి అచ్చెన్నాయుడు రూ.5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### ప్రభుత్వ స్థలంతో నెలకు రూ.11 లక్షల ఆదాయం

జగతిమెట్ట వద్ద ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వానికి నెలకు సుమారు రూ.11 లక్షల ఆదాయం సమకూరుతోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంతో పాటు వాటిని ప్రజా ప్రయోజనాలకు, ఆదాయ వనరులుగా వినియోగిస్తున్నట్లు చెప్పారు. గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఉపయోగపడేలా పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజల సహకారంతో టెక్కలి పట్టణాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, నావీజ చైర్మన్ శేషగిరిరావు, భాజపా, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- షేర్ క్యాపిటల్ 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తాం
- గ్రీవెన్స్‌లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరిస్తాం : కిమిడి నాగార్జున



పార్వతీపురం (చైతన్యరథం): పీఏసీఎస్‌లను బలోపేతం చేయడంతో పాటు వాటి ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున తెలిపారు. పార్వతీపురం డీసీసీబీ కార్యాలయంలో ఆయన గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ అధ్యక్షులు, ప్రతినిధులు తమ సమస్యలను నాగార్జున దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు సమర్పించారు. పీఏసీఎస్‌లలో హోల్డ్‌లో ఉన్న ఫెర్టిలైజర్ లైసెన్సుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, కొత్తగా పెట్రోల్ బంక్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఇప్పించాలని వారు కోరారు. మధ్యలో నిలిచిపోయిన ఎంఎఫ్‌పీసీ గోడౌన్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని, సొసైటీలకు నాన్-క్రెడిట్ వ్యాపారాలు నిర్వహించేందుకు అవసరమైన అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. క్రాప్ లోన్ల పరిమితిని పెంచాలని, గతంలో మాదిరిగానే చిరు వ్యాపారులకు పెట్టీ ట్రేడర్ రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. 1-బి ఫోటోలు అందుబాటులో లేకపోవడం వల్ల రుణాల మంజూరులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, సొసైటీలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని పీఏసీఎస్ అధ్యక్షులు కోరారు. సంబర సొసైటీ ఫెర్టిలైజర్ లైసెన్స్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కిమిడి నాగార్జున మాట్లాడుతూ... పీఏసీఎస్‌లలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంఎఫ్‌పీసీ గోడౌన్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పిలుపు



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయం నందు రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల కొరకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, జిల్లా పార్టీ నాయకులు, వార్డు ప్రెసిడెంట్లు, వార్డు సెక్రటరీలు, వార్డు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ 2-3 రోజుల్లో వచ్చే అవకాశం ఉందని, కావున నాయకులందరూ తమ తమ వార్డుల్లో ప్రజల మధ్యనే ఉంటూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అలాగే మన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌బాబు ఆదేశించినట్లు "వందకు వంద శాతం మనమే గెలవాలి", మన నియోజకవర్గానికి సంబంధించి కూటమి పొత్తు ఉన్నందువలన, మన అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఉన్న 18 వార్డుల అభ్యర్థులను కచ్చితంగా గెలిపించుకోవాలని, నాయకులు మరియు కార్యకర్తలు సమన్వయంతో కలిసి పని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో ఘనంగా "సేవా జ్యోతి యాత్ర"



పాతపట్నం (చైతన్యరథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాతపట్నం నియోజకవర్గంలో "సేవా జ్యోతి యాత్ర"లో భాగంగా ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పాతపట్నం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి కోర్టు జంక్షన్ వరకు నిర్వహించిన ఈ బైక్ ర్యాలీలో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజాసేవే పరమావధిగా 25 సంవత్సరాలుగా దేశ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సేవలు దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ నాయకత్వం కీలకమని అన్నారు. ప్రధాని మోదీ ప్రజాసేవకు అభినందనలు తెలియజేస్తూ నిర్వహించిన ఈ "సేవా జ్యోతి యాత్ర"లో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు విజన్‌తో మిగులు విద్యుత్తు: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



ఆనందపురం (చైతన్యరథం): విద్యుత్ సంస్కరణలు చేపట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను మిగులు విద్యుదుత్పత్తి రాష్ట్రంగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఆనందపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన పీఎం సూర్యఘర్ సేవా సేతు అభియాన్‌లో ఆయన పాల్గొన్నారు. సౌర విద్యుత్ ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో పీఎం నరేంద్ర మోదీ సూర్యఘర్ పథకాన్ని రూపొందించారన్నారు. నెట్ జీరో లక్ష్యంగా ప్రభుత్వ కార్యాలయాలపై సౌర పలకలు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలో అతిపెద్ద అసెంబ్లీ నియోజకవర్గమైన భీమిలిని విద్యుదుత్పత్తిలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని సూచించారు. సబ్సిడీతో అందిస్తున్న సౌర పలకలను ఇళ్లపై ఏర్పాటు చేసుకుని ప్రజలంతా సూర్య ఘర్ ఫలితాలు పొందాలని కోరారు. అతి తక్కువ సరఫరా నష్టాలతో ఈ.పి.డి.సి.ఎల్. దేశంలోనే అత్యుత్తమమైన కంపెనీగా నిలిచిందని ప్రశంసించారు.

# రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు (చైతన్యరథం): 'మీభూమి- మీహక్కు' కార్యక్రమంలో భాగంగా గురువారం రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి రైతులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. మక్కువ మండలంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు నుండి 7361 పట్టాదారు పాసుపుస్తకాలు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. భూ వివాదాలు లేకుండా స్పష్టమైన భూహక్కులు కల్పించడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, గత ప్రభుత్వంలో అడ్డగోలుగా జరిపిన ఆక్రమణ భూమి సమస్యలను పరిష్కరించి రాజముద్రతో కూడిన పాస పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేసిన ఘనత చంద్రబాబు నాయుడేదనని, గత ప్రభుత్వంలో సర్వే రాళ్లపై ఫోటోలకు 700 కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేసిందని, గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టి జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని అన్నారు. మక్కువ మండలంలో 100 కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, గత ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసి, శిలాఫలకాలకు మాత్రమే పరిమితమైంది.. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసి, నిధులు తెచ్చి ప్రారంభోత్సవాలు కూడా చేశామన్నారు.

# కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయం

**●స్థానిక సంస్థల్లో బీసీలకు తిరిగి 34% రిజర్వేషన్లు పునరుద్ధరణ**

**●ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్పష్టం**



అమలాపురం (చైతన్యరథం): హౌసింగ్ బోర్డు కాలనీలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ... సమాజంలో సగ భాగంగా ఉండి సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న బీసీ వర్గాల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని తెలిపారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లతోనే పట్టణ మరియు గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33 1/3 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పులు లేకుండా ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కూడా శరవేగంగా కొనసాగుతోందన్నారు.

**10 శాతం రిజర్వేషన్లు తగ్గించి బీసీలను జగన్ మోసం చేశాడు**

దేశంలో తొలిసారిగా బీసీలకు రాజ్యాధికారం, రాజకీయ ప్రాధాన్యత కల్పించి చట్టసభలకు తీసుకువచ్చిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఆయన గుర్తుచేశారు. నాడు నందమూరి తారక రామారావు బీసీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించారని, ఆ తర్వాత నారా చంద్రబాబునాయుడు 1995లోనే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి గ్రామీణ స్థాయి నుంచి బీసీ నాయకత్వాన్ని బలపరిచారని వివరించారు. అయితే గత ప్రభుత్వం బీసీలపై కక్షసాధింపు చర్యలతో 30 ఏళ్లగా అమల్లో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి, సుమారు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయేలా అన్యాయం చేసిందని మండిపడ్డారు.

# తెలుగుదేశం పార్టీలోకి 100 కుటుంబాలు చేరిక

**● పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి**



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బిత్రపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 100 కుటుంబాలు గురువారం నాడు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ, గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, మండల కన్వీనర్ జోగి భుంజగరావు, లంక గోపాలం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బిత్రపాడు గ్రామానికి చెందిన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# జగన్ పాలనలో ప్రజారోగ్యం గాల్లో దీపంలా మారింది : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**●ప్రజలు అభివృద్ధిని మర్చిపోయి.. దుర్మార్గాలు, అరాచకాలు, అవినీతి మధ్య బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు**



చిలకలూరిపేట (చైతన్యరథం): జగన్ పాలనలో ప్రజలు అభివృద్ధిని మర్చిపోయి... దుర్మార్గాలు, అరాచకాలు, అవినీతి మధ్య బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారని, 2024 ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాకే వారికి నిజమైన స్వేచ్ఛ లభించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. గురువారం ఆయన పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించి అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత స్థానిక 8వ వార్డులోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో రూ.1.45 కోట్లతోనిర్మించే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కు ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. అనంతరం 8, 7, 6 వార్డుల్లో రూ.60.50 లక్షలతో నిర్మించనున్న ఒక కమ్యూనిటీ హాల్, సీసీరోడ్ల నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

**జగన్ పాలనలో ప్రజలు అభివృద్ధిని మర్చిపోయారు..**

జగన్ హయాంలో ప్రజారోగ్యం గాల్లో దీపంలా మారిందని, అసలు రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆనవాళ్లు కనిపించలేదని, ప్రజలు కూడా పూర్తిగా అభివృద్ధిని మర్చిపోయారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలోనే నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధి బాటపట్టిందని, ప్రజలకు కొరత లేకుండా సంక్షేమపథకాలు అందుతున్నాయని ప్రత్తిపాటి తెలిపారు. ప్రజల ఆరోగ్య రక్షణకు కూటమిప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, దానిలో భాగంగానే నియోజకవర్గ ప్రజలకోసం శిథిలమైన ప్రభుత్వాసుపత్రి స్థానంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన ఉచిత వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అందుకోసం బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించిందని ప్రత్తిపాటి చెప్పారు.

# ఏపీకి రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడులు : రామ్మోహన్‌నాయుడు



వజ్రపుకొత్తూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశుకు 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు ముందుకొచ్చాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలో రూ.1.32 కోట్లతో నిర్మించిన చేపల వేలం హాలు, శుద్ధికేంద్రం భవనాలకు గురువారం స్థానిక ఎమ్మెల్యే శిరీషతో కలిసి ఆయన ప్రారంభోత్సవం చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. "గత వైకాపా నిరంకుశ పాలనతో రాష్ట్రానికి వచ్చిన కంపెనీలన్నీ ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయి. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కలయికతో రాష్ట్రం గాడిన పడింది. పలు కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే రూ.14లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. దీంతో 56 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోంది. ఇదే గ్రామానికి చెందిన అప్పలరాజు గత ప్రభుత్వంలో మత్స్యకార మంత్రిగా ఉండి ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి న్యాయం చేయలేదు. తీర గ్రామాల్లో అధునాతన భవనాలతో పాటు ఇసుక దిబ్బలపై రోడ్లు వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కింది. మూలపేట పోర్టుతో ఈ జిల్లా మరింత అభివృద్ధి చెందనుంది. జిల్లాలో ఎయిర్పోర్టు నిర్మాణానికి సైట్ క్లియరెన్స్ కూడా వచ్చింది" అని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసీ పత్రాలు అందజేసిన వీరంకి గురుమూర్తి



తోటవల్లూరు (చైతన్యరథం): కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ ఓ సీ పత్రాలను లబ్ధిదారులకు తోట్లవల్లూరులోని వారి ఇళ్ల వద్దనే గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యం కోసం వారికి భరోసానిచ్చేందుకు ముఖ్యమంత్రి సహాయ ద్వారా ధైర్యం నింపుతుందన్నారు. తోట్లవల్లూరు మండలం తోట్లవల్లూరు గ్రామానికి చెందిన సయ్యద్ రహీంకు రూ.1,48,408 ఎల్వోసి పత్రాలను గురుమూర్తి అందజేశారు. అలాగే చేపల వాసవికి 25000, కోటేశ్వరికి 41870, అబ్దుల్ గౌసియా బేగంకు 75090, బాగోలు ఆనంద్ కు 27,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట్లవల్లూరు గ్రామ తెలుగుదేశం పార్టీ సెక్రటరీ వల్లూరు రాంబాబు ,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వీరంకి పరశురామ్, నక్కలపూడి మురళి, అబ్దుల్ ఇర్ఫాన్, సలాం తదితరులు పాల్గొన్నారు.

# కొండవాలు ప్రాంతంలో ప్రజల భద్రతకు రక్షణ చర్యలు చేపట్టాలి

**● అధికారులకు విశాఖపట్నం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు**



విశాఖపట్నం తూర్పు (చైతన్యరథం): విశాలాక్షి నగర్ కొండవాలు ప్రాంతంలో ప్రజల భద్రతకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని, హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రహదారులను విస్తరించి ఫ్రీ లెఫ్ట్‌లను అభివృద్ధి చేయాలని విశాఖపట్నం తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు జీవీఎంసీ కమిషనర్ కేతన్ అధికారులను ఆదేశించారు. గురువారం విశాఖ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌తో కలిసి జీవీఎంసీ ఈస్ట్ జోన్ పరిధిలోని విశాలాక్షి నగర్ రామాలయం వీధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవాలు ప్రాంతంలో ఒక ఇంటి రక్షణ గోడ కూలి సమీపంలోని ఇళ్లపై పడిన ప్రదేశాన్ని కమిషనర్తో కలిసి పరిశీలించారు. అనంతరం హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన రహదారుల విస్తరణ పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ... ఇటీవల నగరంలో కురిసిన వర్షాల కారణంగా విశాలాక్షి నగర్ రామాలయం వీధిలో కొండవాలు ప్రాంతంలో ఉన్న ఒక ఇంటి రక్షణ గోడ కూలి సమీపంలోని ఇళ్లపై పడిందని తెలిపారు. ప్రమాదాన్ని గుర్తించి సంబంధిత కుటుంబ సభ్యులను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో ఎవరికీ ఎటువంటి హాని కలగలేదని వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన రక్షణ గోడను తక్షణమే నిర్మించాలని, చుట్టుపక్కల నివాసాలకు ఎటువంటి ప్రమాదం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. అలాగే హనుమంతవాక జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనాలు నిలిచిపోవడంతో తరచూ ట్రాఫిక్ రద్దీ ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

## ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవకు అభినందనలు : ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు



విజయవాడ (చైతన్యరథం): భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొని ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. ప్రజాసేవకు అంకితమైన నాయకత్వానికి గుర్తుగా నిర్వహించిన ఈ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి ప్రజాజీవితంలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశాభివృద్ధికి అందిస్తున్న సేవలను గుర్తుచేసుకున్నారు. ర్యాలీ అనంతరం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ శాంతి, సంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ స్వామివారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌ఛార్జ్ అక్కల రామ్మోహనరావు (గాంధీ), టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలను ఆర్థికచక్రంగా మారుస్తాం : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): మహిళలు స్వయం స్వావలంబన సాధించేందుకు ప్రతి అడుగులోనూ సహకారం అందిస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక అంజుమన్ ఇస్లామియా పాఠశాలలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న 40 మంది మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అంజుమన్ ఇస్లామియా ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఏర్పాటు చేశామని, దీనిని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కుట్టుశిక్షణతోపాటు ఫ్యాషన్ డిజైనింగ్ అంశాలలోనూ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. శిక్షణ అనంతరం మహిళల కుట్టుశిక్షణకు అవసరమైన మెటీరియల్ కూడా అందిస్తున్నామని తెలిపారు. మహిళలు తయారు చేసిన ప్రొడక్ట్స్ ను కొనుగోలు చేసేందుకు నవంబర్ 1వ తేదీ నుంచి అంజుమన్ ఇస్లామియాలో ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో ఇంటిలో ఒక్కరిపైనే ఆధారపడకుండా అందరికీ ఆదాయం ఉండాలని అన్నారు. అందులో భాగంగా మహిళలు తమ కాళ్లపై నిలబడిగలిగితే కుటుంబానికి వెన్నుదన్నుగా నిలుస్తారని తెలిపారు. గృహిణులు ఆర్థిక చక్రంగా మారడం వల్ల వారి పిల్లలు ఆదర్శవంతంగా మారేందుకు స్ఫూర్తిగా నిలుస్తారని చెప్పారు.

## బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో పార్టీలోకి భారీ చేరికలు

● ఆహ్వానించిన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



మంగళగిరి (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీపై నమ్మకంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారు. ఈ క్రమంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో భారీగా పార్టీలో చేరికల కార్యక్రమం జరిగింది. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు సమక్షంలో, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్దా వెంకన్న ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎస్.కే. ఖాజా, ప్రముఖ పారిశ్రామికవేత్త చెపుల ఆంజనేయులు తమ అనుచరులతో కలిసి సుమారు 200 మందితో తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

**బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలో పార్టీకి మరింత బలం**

విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుద్ధా వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమం ద్వారా తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరింది. ఎస్.కే.ఖాజా, చెపుల ఆంజనేయులు తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తెలుగుదేశం పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా ముందుకు సాగుతోందని, పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో వివిధ వర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరడం శుభపరిణామమని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

● తెలుగుదేశం పార్టీలోకి ఎమ్మెల్యే బొండా ఉమా ఆధ్వర్యంలో భారీగా చేరికలు



విజయవాడ (చైతన్యరథం): పాయకపురం MSR కన్వెన్షన్ హాల్ నందు వ్యాపారవేత్త సాయి. సంజయ్ వారి అనుచరులు 300 మందితో ప్రభుత్వ విప్ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్దార్థ సమక్షంలో తెలుగుదేశంపార్టీలో చేరారు. ఈ సందర్భంగా సాయి సంజయ్ ఆయన అనుచరులకు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలుగుదేశంపార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశంపార్టీ కుటుంబంలోకి నూతనంగా చేరిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని బొండా ఉమా తెలిపారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంపై విశ్వాసంతో సాయి సంజయ్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ టీడీపీ కుటుంబంలో భాగస్వాములేనని, అందరినీ కలుపుకుని పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

## ఆర్థిక మోసాలపై అప్రమత్తత అవసరం

●మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నాం : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని, ఆర్థిక మోసాలపై అప్రమత్తత అవసరమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మహిళా గ్రీవెన్స్ నిర్వహించి, మహిళల నుంచి పలు అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. వివిధ డివిజన్ల నుంచి వచ్చిన మహిళలు తమ వ్యక్తిగత, సామాజిక, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ప్రతి మహిళా గ్రీవెన్స్‌లో కూడా అధిక సంఖ్యలో ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని, ముఖ్యంగా చిట్టీల పేరుతో, అప్పుల పేరుతో లేదా నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని సొంత వ్యక్తులు, పరిచయస్తులకు డబ్బులు ఇచ్చి మోసపోతున్న మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కష్టపడి దాచుకున్న సొమ్ము తిరిగి రాక అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి మోసాలపై ప్రత్యేక దృష్టి సారించి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా పోలీసు శాఖ ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు అపరిచితులను, తప్పుడు హామీలను నమ్మి మోసపోవద్దని, డబ్బు లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

●వినుకొండలో 10 మంది దివ్యాంగులకు ఉచిత త్రీవీలర్ మోటార్ వాహనాల పంపిణీ చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): దివ్యాంగుల సంక్షేమం, వారి అభ్యున్నతికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు తెలిపారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 10 మంది అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా త్రీవీలర్ మోటార్ వాహనాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా రూ.17.50కోట్ల వ్యయంతో 1,750 మూడు చక్రాల మోటార్ వాహనాలను అందిస్తున్నామని వెల్లడించారు. మొదటి విడత కింద వినుకొండ నియోజకవర్గానికి 10 మందికి వాహనాలు ఇస్తున్నామని, తదుపరి విడతల్లో మిగిలిన అర్హులందరికీ అందజేస్తామని స్పష్టం చేశారు. అధికారంలోకి రాగానే దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆయన గుర్తుచేశారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోటి ఆదినారాయణకు నివాళులర్పించిన మాజీ మంత్రి దేవినేని ఉమ



మధిర (చైతన్యరథం): ఖమ్మం జిల్లా మధిర పట్టణంలోని టీచర్స్ కాలనీలో కోటి ఆదినారాయణ పెద్దకర్మ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొని నివాళులర్పించారు. ఖమ్మం పార్లమెంటరీ టీడీపీ కన్వీనర్ రామనాథం, పార్టీ నేతలు, కుటుంబ సభ్యులతో కలిసి ఆదినారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ.. మైలవరంలో ఎంఆర్ఎఫ్ టైర్ల డిస్ట్రిబ్యూషన్ వ్యాపారం నిర్వహిస్తున్న కోటి మధుసూదనరావు (మధు), గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో చంద్రబాబునాయుడిపై అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్బంధించిన సమయంలో ధైర్యంగా పార్టీకి అండగా నిలిచారని గుర్తుచేశారు. చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల్లోనూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారని తెలిపారు. ప్రజల ఆగ్రహానికి ప్రతిఫలంగానే ఎన్నికల్లో కూటమి 164 స్థానాల్లో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చిందని, వైసీపీ కేవలం 11 సీట్లకే పరిమితమై ప్రజల తీర్పుతో తగిన మూల్యం చెల్లించుకుందని అన్నారు.



# కూటమి అభ్యర్థుల అఖండ విజయమే లక్ష్యం కావాలి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, రాజంపేట నియోజకవర్గంలో కూటమి బలాన్ని మరింత పెంచడం, పార్టీ సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రతి గ్రామంలో సమన్వయంతో ముందుకు సాగడం లక్ష్యంగా గురువారం ఏబీ చంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ సమన్వయ సమావేశం నిర్వహించారు. కడప జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల అబ్జర్వర్ దీపక్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు, కడప పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి , పార్టీ పరిశీలకులు చిట్టిబాబు గారు రాజంపేట

### శ్రేణులకు నాయకుల పిలుపు

టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే ప్రధాన లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ శ్రేణులను మరింత బలోపేతం చేసి, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అలాగే టీడీపీ జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో ఐక్యతే బలం... సమన్వయమే విజయానికి మార్గం అనే నినాదంతో ముందుకు సాగాలని నాయకులు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్తను ఎన్నికల కోసం సన్నద్ధం చేయాలని కూటమి పార్టీల మధ్య సంపూర్ణ సమన్వయం సాధించాలని నిర్ణయించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామంలో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 100% విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# లో వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

### దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ.

దర్శి (చైతన్యరథం):ముండ్లమూరు మండలం, పెద్ద ఉల్లగల్లు గ్రామం లో 33/11 కెవి సబ్ స్టేషన్ గురువారం సాయంత్రం విద్యుత్ శాఖ సీఎండి పుల్లారెడ్డితో కలిసి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనకు చేస్తున్న కృషి చూస్తున్నారని, అదే స్ఫూర్తితో దర్శి నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలను కల్పించి ప్రజల అవసరాలు తీర్చే లక్ష్యంతో మన రెండున్నర ఏళ్ల కూటమి పాలనలో ప్రజా ప్రభుత్వం ముందడుగు వేసింది అన్నారు. విద్యుత్ శాఖ మంత్రి మా బాబాయి గొట్టిపాటి రవికుమార్ సంపూర్ణ సహకారంతో ఒక్క విద్యుత్ శాఖ ద్వారా దర్శి నియోజకవర్గంలో దాదాపు 200 కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. తాళ్లూరు మండలం గంగవరం లో 27 కోట్లతో 100 కేవీ సబ్స్టేషన్ నిర్మాణం, పెదవుల గల్లులో 4 కోట్ల 19 లక్షలతో సబ్స్టేషన్ నిర్మాణం, కురిచేడు మండలం కల్లూరు లో 3 కోట్ల 80 లక్షలతో సబ్స్టేషన్ నిర్మాణం, దర్శి లో విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం మరో 4 కోట్లతో పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నియోజకవర్గం లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు అత్యవసర విద్యుత్ పనులు తదితర పనులకు మరో 100 కోట్లతో ఈ రెండు నరఏళ్ళలో పనులు పూర్తి చేశామన్నారు. అంతేకాక ఉచిత సోలార్ ను ఎస్సీ ఎస్టీ వర్గాలకు మరో 50 కోట్లతో అందించడం జరిగిందన్నారు. నేడు లోకేష్ అన్నను కలవడం జరిగిందని ఆయన ఎంతో స్ఫూర్తిదాయకంగా పార్టీయే సుప్రీమ్ అని నాయకులు, కార్యకర్తలు పార్టీకి విధేయులుగా ఉండి ఐక్యంగా ముందుకు వెళ్లాలని స్థానిక సంస్థల ఎన్నికలలో అభివృద్ధి ఎజెండాగా మనం గెలవాలని ఆమె ఆమె కోరారు. రైతులకు పెండింగ్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను ఇచ్చేందుకు కూడా కృషి జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచిన తర్వాత ఒక్క రూపాయి కూడా కరెంట్ బిల్లు పెంచకపోగా కరెంట్ బిల్లు తగ్గించిన ఘనత మన కూటమి ప్రభుత్వానిదేనని మనం గర్వంగా చెప్పుకోవచ్చని డాక్టర్ లక్ష్మీ స్పష్టం చేశారు. సీఎం డి పుల్లారెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్ వస్తువుల దొంగతనాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టేందుకు ప్రజలు కూడా అప్రమత్తతతో ఉండి విద్యుత్ శాఖకు సహకరించి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. టిడిపి నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, విద్యుత్తు దర్శి ఏఎంసి చైర్మన్ దారం నాగవేణి, దర్శి మున్సిపల్ చైర్మన్ నారశెట్టి పిచ్చయ్య, ముండ్లమూరు మండల టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, మండల మాజీ ఎంపీపీ మందలపు వెంకట్రావు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు తోట రామారావు, మండల బిజెపి అధ్యక్షులు మందలపు వెంకట శేషయ్య, ఉల్లగల్లు గ్రామ టిడిపి అధ్యక్షులు శేఖర్, దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలం, ఉల్లగల్లు టిడిపి సీనియర్ నాయకులు, కూటమి శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.



# ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించాలి

### ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పిలుపు

ఒంగోలు (చైతన్యరథం): ప్రకాశం జిల్లా యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి, భవిష్యత్ ఉపాధి అవకాశాలకు వారికి ఇవ్వాలని ఈ ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్ రావు పిలుపునిచ్చారు. అదే లక్ష్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఒంగోలు ఏపీడీసీ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్, సెంటూరియన్ యూనివర్సిటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్, డ్రోన్ టెక్నాలజీస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి పాల్గొన్నారు.





# నాన్న కష్టాలు పిల్లలకు రాకూడదనే..

### మాట నిలబెట్టుకున్న మంత్రి నారాయణ ... పండుగలా సైకిళ్ళ పంపిణీ!

నెల్లూరు (చైతన్యరథం): పేద విద్యార్థుల చదువుకు దూరం అడ్డంకి కాకూడదన్న లక్ష్యంతో మంత్రి నారాయణ చేపట్టిన ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. సొంత నిధులతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా రెండో విడతలో 1,320 సైకిళ్లను గురువారం పంపిణీ చేశారు. దర్గామిట్ట జెడ్పీ హైస్కూల్ మైదానంలో జరిగిన కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భారీగా తరలిరావడంతో ప్రాంగణం క్రిక్కిరిసిపోయింది.

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 11 ప్రభుత్వ హైస్కూళ్లలో తొమ్మిదో తరగతి చదువుతున్న 770 మంది విద్యార్థినీ, విద్యార్థులకు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు షరణి సైకిళ్లను పంపిణీ చేశారు. కేపీసీ కాలేజీకి చెందిన మరో 550 మంది విద్యార్థులకు కూడా సైకిళ్లు అందజేశారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థుల ముఖాల్లో ఆనందం తొణికిసలాడింది. థాంక్యూ నారాయణ సార్ అంటూ విద్యార్థులు చేసిన నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ నా బాల్యంలో సైకిల్ కొనుగోలు చేసే స్తోమత లేక మూడు కిలోమీటర్లు నడిచి స్కూల్‌కు వెళ్లేవాడినని, పేద విద్యార్థులు నాలాగా నడిచి స్కూల్‌కు వెళ్లకూడదనే ఉద్దేశంతో సొంత నిధులతో సైకిళ్లు అందిస్తున్నానన్నారు. సిటీ, రూరల్ పరిధిలోని ప్రభుత్వ హైస్కూళ్లలో చదువుతున్న 10 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.6 కోట్లతో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగా జూలైలో తొలి విడతగా 7 వేల సైకిళ్లు పంపిణీ చేశామని, తాజాగా మరో 1,320 సైకిళ్లు అందించామని చెప్పారు. మిగిలిన విద్యార్థులకు జనవరిలో సైకిళ్లు పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈరోజు వేలాది మంది నిరుపేద పిల్లల్లో తన బాల్యంతో పాటు వారి కళ్లలో తన కల కూడా కనిపిస్తోందన్నారు. దూరం కారణంగా విద్యార్థినుల చదువు ఆగిపోకూడదని,తమ కుటుంబం ఇచ్చిన సైకిల్ వాళ్ల ప్రయాణాన్ని సులభం చేయాలని ,కలలకు మొదటి అడుగు కావాలని ఆకాంక్షించారు. పేద పిల్లల భవిష్యత్తుపై పెట్టే పెట్టుబడి కంటే గొప్ప పెట్టుబడి మరొకటి లేదన్నారు. పేదరికం తన జీవితాన్ని ఆపలేకపోయిందని,మీరు బాగా చదివి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలి. సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. పొంగూరు షరణి మాట్లాడుతూ తన తండ్రి సాధారణ కుటుంబం నుంచి వచ్చి మూడు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు వెళ్లేవారని గుర్తుచేశారు. కష్టపడి చదివి పేదరికాన్ని జయించారని, తన తండ్రిలా కష్టాలు పేద పిల్లలకు ఎదురుకాకూడదనే ఉద్దేశంతో 10 వేల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్నారని తెలిపారు. నాన్న చదివిన పాఠశాలలతో పాటు నెల్లూరులోని ప్రభుత్వ హైస్కూళ్లను కూడా ఆధునీకరిస్తున్నారని, వాటిని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. నారాయణ విద్యాసంస్థలు 30 రాష్ట్రాల్లో విస్తరించాయని, ఆయన స్ఫూర్తితో తాము సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.



### అడగగానే 3,270 సైకిళ్లు ఇచ్చారు

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పక్క నియోజకవర్గంలోని విద్యార్థులకు సైతం సొంత నిధులతో సైకిళ్లు అందిస్తున్న గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని కొనియాడారు. అడగగానే నెల్లూరు రూరల్‌కు 3,270 సైకిళ్లు ఇచ్చారన్నారు. మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి సహకారంతో రూరల్ నియోజకవర్గంలో రూ.966 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నెల్లూరు కార్పొరేషన్ చరిత్రలో ఎన్నడూ లేనంత అభివృద్ధిని మంత్రి నారాయణ చేసి చూపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో బాలాజీరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, మాజీ కార్పొరేటర్ దొడ్డపనేని రాజానాయుడు, సిటీ టీడీపీ నేతలు జహీర్, బాలాజీ, తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు. మంత్రి నారాయణ, ఆయన కుమార్తె షరణిని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సన్మానించారు.

# కూటమి ప్రభుత్వంలో పేదల వైద్యానికి భరోసా

## చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్




కదిరి (చైతన్యరథం): పేద కుటుంబాల్లో అనారోగ్యం కారణంగా ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. పేదల ఆరోగ్యం, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కదిరి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 20 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.21,21,130 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు ఆర్థిక భారంగా మారుతున్నాయని, అలాంటి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. కదిరి నియోజకవర్గంలో ఇప్పటివరకు 708 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.6,16,67,953 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసినట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పేద కుటుంబాలకు వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోడీ పాలన

## "సేవా జ్యోతి యాత్ర" ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, కూటమి నాయకులు



చిత్తూరు (చైతన్యరథం): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి పాలన సాగుతోందని, 25 ఏళ్లుగా ప్రజాసేవలో అధికారంలో కొనసాగడం మోడీ గారి క్రమశిక్షణ, ప్రజాసేవ పట్ల అంకిత భావాన్ని తెలియజేస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 25 ఏళ్ల ప్రజా పాలన పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమంలో భాగంగా గురువారం చిత్తూరులో "సేవా జ్యోతి యాత్ర" ద్విచక్ర వాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్వయంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ.. కూటమి నాయకులతో కలిసి ప్రధానమంత్రి ఫోటోతో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీవీ రెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ సర్కిల్, గిరింపేట, కాజూరు సర్కిల్, దర్గా సర్కిల్, ఎంజీఆర్ మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అనంతరం మహాత్మా గాంధీ, ఎన్టీఆర్, జ్యోతిబా పూలే విగ్రహాలకు పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 25 ఏళ్ల పాటు అధికారంలో కొనసాగడం సామాన్య విషయం కాదన్నారు. ప్రజల నమ్మకం, ప్రజాసేవ పట్ల ఆయనకున్న అంకితభావం కారణంగానే ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా కొనసాగుతున్నట్లు చెప్పారు. మోడీ గారి నాయకత్వంలో భారత్ విశ్వ గురువుగా మారిందని, ప్రపంచంలో భారత్ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని చెప్పారు. దేశ పురోభివృద్ధి కోసం అనేక సాహసోపేతమైన నిర్ణయాలు, సంస్కరణలో తీసుకున్నారన్నారు. ప్రజా పాలనలో సుదీర్ఘ అనుభవం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, నరగ తెదేపా అధ్యక్షుడు వరుణ్ కుమార్, కూటమి నాయకులు సీకే లావణ్య, అట్లూరి శ్రీనివాసులు, యశ్వంత్, వెంకటేష్ యాదవ్, ఈశ్వర రావు, అనురాధ, క్లస్టర్, డివిజన్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, భారీగా కార్యకర్తలు పాల్గొన్నారు.



# గొర్లమండి అభివృద్ధికి కృషి చేస్తా

## యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు

యర్రగొండపాలెం (చైతన్యరథం): తోకపల్లి పంచాయతీలో గోకులం షీప్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ గొర్లమండి కమిటీ సభ్యులు, యాదవ పెద్దల ఆహ్వానం మేరకు జరిగిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొర్లమండి సభ్యులు, యాదవ నాయక పెద్దలు తమ సమస్యలు, అవసరాలను ఎరిక్షన్ బాబు దృష్టికి తీసుకురాగా, వాటిని సానుకూలంగా విని గొర్లమండి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో నక్కా శ్రీను, గొర్లమండి అధ్యక్షులు ముచ్చా ఐలయ్య, సెక్రటరీ మేకల సత్యనారాయణ రాజు, గౌరవ అధ్యక్షుడు, మూడమంచు బాల గురవయ్య, ముఖ్య నాయకులు మూడమంచు కొండ గురవయ్య, తోకల ఎల్లయ్య, గిలకా వెంకటేశ్వర్లు (కొండలు), గుమ్మ ఎర్ర గురవయ్య, ఓంటేరు పంతులు, గుమ్మా అల్లూరయ్య, నరాల మల్లికార్జున, నరాల రామచంద్రుడు, మూడమంచు గురునాథం, గొర్ల గురవయ్య, గొర్లమండి సభ్యులు, మండల పెద్దలు, నాయకులు, కార్యకర్తలు, యాదవ పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి ఆధునిక సాంకేతికత అనుసంధానం అవసరం

## మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి

మార్కాపురం (చైతన్యరథం): శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి మార్కాపురం అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన కిసాన్ మేళా-2026 మరియు రైతులు-శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ డిపార్ట్మెంట్ ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సేంద్రీయ ఎరువుల వినియోగానికి సంబంధించిన స్టాల్స్‌ను రైతులు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం నారాయణ రెడ్డి మాట్లాడుతూ ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులను రైతులకు చేరవేయడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగ పడుతుంది అని తెలిపారు. ఈ సందర్భంగా పత్తి, మిరప వంటి సాధారణ పంటలతో పోలిస్తే తక్కువ నీటితో, ఎక్కువ లాభాలను ఇచ్చే పండ్లు (మామిడి, అరటి, దానిమ్మ వంటివి), కూరగాయల సాగుపై రైతులలో మార్పు తీసుకురావడం, ఉద్యానవన పంటలకు అవసరమైన డ్రిప్ సిస్టమ్స్, స్ప్రింక్లర్లు, మరియు పాలీహౌస్ సాగు విధానాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో అగ్రికల్చర్ హార్టికల్చర్ అధికారులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అంగన్వాడీ కేంద్రాల ద్వారా మెరుగైన సేవలు

## గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపు



గిద్దలూరు (చైతన్యరథం): "పోషణ్ మాసం 2026, మన అంగన్వాడీ.. మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కొమరోలు పట్టణంలో నిర్వహించిన కార్యక్రమానికి గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ముత్తుముల అశోక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. పిల్లలు, మహిళలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి ఎమ్మెల్యే అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పౌష్టికాహారం నాణ్యతను స్వయంగా పరిశీలించి, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఇతర సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సక్రమంగా అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని సూచించారు.అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా మహిళలు, శిశువులకు అందిస్తున్న పౌష్టికాహారం విషయంలో నాణ్యత, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.అనంతరం మహిళలు, శిశువులకు అందజేస్తున్న పౌష్టికాహారంపై ఎమ్మెల్యే వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలపై లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పోషణ్ మాసం కార్యక్రమం ద్వారా చిన్నారులు, మహిళల్లో పౌష్టికాహారంపై అవగాహన పెంచడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది, కూటమి నాయకులు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 24న టాంటెక్స్ 40వ వార్షికోత్సవం

**అమెరికా:** ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం (టీఏఎన్‌టీఈఎక్స్) 40వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 24న ఫ్రిస్కో ఫ్లైయర్స్ ఈవెంట్ సెంటర్‌లో జరగనున్నాయి. తెలుగు సంస్కృతి, సాహిత్యం, సంగీతం, సంప్రదాయాలను ప్రతిబింబించే మూడు ప్రత్యేక కార్యక్రమాలను ఈ సందర్భంగా ఏర్పాటు చేసినట్లు అధ్యక్షురాలు మాధవి లోకిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి బెజవాడ బేబక్క యాంకర్‌గా వ్యవహరించనున్నారు. కార్యక్రమానికి నమోదు తప్పనిసరి. ప్రవేశం ఉచితం. అట్లతద్ది వేడుకల్లో గౌరీ పూజ, గోరింటాకు, ఉయ్యాల, అట్ల వాయనం, కోలాటం ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. టాంటెక్స్ తెలుగు సాహిత్య వేదిక 19వ వార్షికోత్సవం కూడా ఇదే వేదికపై నిర్వహించనున్నారు. తెలుగు




సాహిత్యాభిమానులను, రచయితలను, సాహితీవేత్తలను, తెలుగు భాషాభిమా నులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు, వక్తల ప్రత్యేక ప్రసంగాలు, సాహిత్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు కోటి ఆధ్వర్యంలో 'కోటి మ్యూజిక ల్ లైవ్ కాన్సర్ట్' అలరించనుంది. ఈ విభావరిలో సాయి శ్రీ చరణ్, నజీరుద్దీన్, శివాని పిసుపాటి, వైష్ణవి నన్నూరు తదితర గాయకులు పాల్గొననున్నారు. లైవ్ బ్యాండ్‌లో బాబు (గిటార్), దిలీప్(బాస్), శ్రీధర్ వైద్యనాథన్ (కీబోర్డ్స్), కృష్ణ యమన్ (డ్రమ్స్) సహకరిస్తారు. ఈ కార్యక్రమానికి కేదార్ జోస్యుల, గీతికలు ఎంసీలుగా వ్యవహరించనున్నారు. తెలుగు కుటుంబాలు, సాహిత్యాభి మానులు, సంగీతప్రియులు, ఉత్తర టెక్సాస్‌లోని తెలుగు సమాజం ఈ చారిత్రాత్మక 40వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని టాంటెక్స్ నిర్వాహకులు ఆహ్వానించారు.

## నెబ్రాస్కా తెలుగు సమితి కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**అమెరికా:** యూఎస్ తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా 2026-2027 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఒమాహా నగరంలోని హిందూ టెంపుల్ సోషల్ హాల్‌లో నిర్వ హించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ నూతన కార్యవర్గం అక్టోబరు 1, 2026 నుంచి సెప్టెంబరు 30, 2027 వరకు పదవిలో కొనసాగనుంది. ఈ వేడుకలో భాగంగా మాజీ అధ్యక్షుడు కొల్లి ప్రసాద్ గత ఏడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాల వివరాల నివేదికను సభ్యులకు వివరించారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తాతారావు కోసూరి మాట్లాడుతూ గత కార్యవర్గం వేసిన బలమైన పునాదిపై మరింత ముందుకు వెళుతూ భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు.ప్రమాణం చేసిన వారిలో ఉపాధ్యక్షులు సాంబ దివ్వెల, కార్యదర్శి రమేష్ రాయపాటి, కోశాధికారి యుగంధర్ పంగా, సాంస్కృతిక కార్యదర్శి వినీల నాయుడు, జాయింట్ సెక్రటరీ వీరేంద్రనాథ్ ముప్పవరపు, జాయింట్ ట్రెజరర్ బాలకామిరెడ్డి, జాయింట్ కల్చరల్ సెక్రటరీ నాగ స్వప్న అడగిరి ఉన్నారు.

# విద్యార్థులకు తానా చేయూత




### స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ



**అమెరికా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్-అట్లాంటిక్ విభాగం వారు స్కూల్ పిల్లల కోసం నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక కమ్యూనిటీకి తమ వంతుగా సహాయం చేసేందుకు కోసం తానా ప్రతిఏటా గివింగ్ బ్యాక్ టు ది కమ్యూనిటీ పేరుతో కార్యక్ర మాన్ని నిర్వహిస్తూ వస్తోంది. అందులో భాగంగా తమ తమ ప్రాంతాల్లో ఉన్న స్కూల్ పిల్లలకు బ్యాక్ ప్యాక్ పేరుతో వారికి అవసరమైన బ్యాగులు, ఇతర వస్తువులను అందజేస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా హ్యారీస్‌బర్గ్‌లోని డౌనీ స్కూల్ విద్యార్థులకు బ్యాగులు, వస్తువులను అందజేసింది. నూతన విద్యా సంవత్సరా న్ని ఆనందంగా ప్రారంభించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సేవా కార్యక్రమానికి నాయకత్వం వహించి తమ మద్దతు అందించిన తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, తానా బోర్డ్ డైరెక్టర్ రవి పొట్లూరికి మిడ్ అట్లాంటిక్ విభా గం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. తానా ఈవీపీ శ్రీనివాస్ లావు, కమ్యూనిటీ సర్వీస్ కో ఆర్డినేటర్ సాయి బొల్లినేని, తానా బెనిఫిట్స్ కోఆర్డినేటర్ వెంకట్ సింగు, తానా మిడ్-అట్లాంటిక్ రీజినల్ రిప్రజెంటేటివ్ ఫణి కంతేటి ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా కృషి చేశారు. ఈ కార్యకమా నికి తోడ్పడిన వలంటీర్లకు, ఆర్థిక సహాయం అందజేసిన మా గ్రాండ్ స్పాన్సర్లు షిన్‌టెక్ ఇంక్, బ్రైట్ రేట్ మోర్ట్‌గేజ్ ఎలఎల్‌సికి నిర్వాహకులు మిడ్ అట్లాంటిక్ టీమ్ ధన్యవాదాలు తెలియజేసింది.

### రియాద్ ప్రవాస భారతీయ సమాఖ్యలో

# తెలుగు మహిళకు స్థానం



**సౌదీ అరేబియా:** ఆకాశంలో సగం అవకాశాలలోనూ సగం అంటూ ఇంటా బయటా మహిళలు దూసుకుపోతున్నారు. అబల కాదు సబలలం అని అంటున్నారు. ఉద్యోగాలలోనే కాదు, సామాజిక జీవనంలోనూ పాత్రను కోరుకుంటున్నారు. ఇప్పటివరకూ కేవలం పురుషాధిక్యత కలిగిన సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్‌సీ అనే ప్రవాస భారతీయ సంఘాల సమాఖ్యలో సత్యసాయి జిల్లాకు చెందిన మహిళకు స్థానం దక్కింది. భారతీయ ఎంబసీ ఆధ్వర్యంలో పనిచేసే ఈ సంస్థలో అడుగిడిగిన తొలి మహిళగా చేతన జగదీష్గారి ఖ్యాతి పొందారు. వివిధ అంతర్జాతీయ, ప్రాంతీయ సదస్సులలో పర్యావరణ, వాతావరణ మార్పుల అంశాలపై వక్తగా చేతన పాల్గొన్నారు. సందర్భానుసారం భారతీయ మహిళల సమస్యల పరిష్కా రం కోసం తన వంతుగా కృషి చేస్తారనే పేరుపొందారు. ఒక్క సౌదీ అరేబి యాయే కాకుండా మొత్తం గల్ఫ్ దేశాలలో స్త్రీ స్వావలంబనకు శ్రీకారం చుట్టిన సాటా (సౌదీ అరేబియా తెలుగు సంఘం) నాయకురాలిగా ఉన్న ఆమె ముక్కు సూటిగా మాట్లాడే నాయకురాలిగా పేరొందారు. యూనిఫాం ధరించి నెత్తిపై టోపి పెట్టి ఆగే ముఢ్ అంటూ పురుషుల మెజార్టీలో కవాతు చేసే ఎన్.సి.సిలో మహిళలు అసలు కనిపించని కాలంలో ఆమె చేరడమే కాకుండా దాని ఉత్తమ కమాండర్‌గా ప్రతిష్ఠాత్మక అవార్డును గవర్నర్ చేతులమీదుగా పొందారు. రైఫిల్ షూటింగ్‌తో పాటు కరాటేలో బ్లాక్ బెల్ట్ కలిగిన చేతన వ్యక్తిత్వ వికాస అభివృద్ధి నిపుణురాలు కూడా.



### శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో

# 'మ్యూజిక్ డాన్స్ ఫర్ విజన్'



**అమెరికా:** టెక్సాస్‌లోని అర్వింగ్‌లో ఉన్న అర్వింగ్ ఆర్ట్స్ సెంటర్‌లో శంకర నేత్రాలయ యుఎస్ఏ ఆధ్వర్యంలో 'మ్యూజిక్ అండ్ డాన్స్ ఫర్ విజన్ 2026' కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ద్వారా గ్రామీణ భారతదేశంలో నివా రించగల అంధత్వాన్ని నిర్మూలించే ఈ బృహత్తర లక్ష్యానికి సమాజం నుంచి అద్భుతమైన మద్దతు లభించింది. 300 మందికి పైగా హాజరైన ఈ వేడుకను చాప్టర్ వైస్ ప్రెసిడెంట్ చినసత్యం వీర్నపు, బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు డాక్టర్ రెడ్డి ఊరిమిండి ఆహ్వానంతో ఘనంగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమానికి శిరీష కోటమరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. డాలస్ చాప్టర్ https://sankaranethralayausa. org/dallas-chapter. html ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించింది. సమన్విత మాడ ఆలపించిన అమెరికా, భారత జాతీయ గీతాలాపనతో ఈ సాంస్కృతిక సాయంకాలం ప్రారంభమైంది. డల్లాస్-ఫోర్ట్ వర్త్ ప్రాంతానికి చెందిన సెంటర్ ఫర్ కూచిపూడి డాన్స్-టెక్సాస్, నాట్యోం డాన్స్ అకాడమీ, గురు పరంపర స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, నాట్యాంజలి కూచిపూడి డాన్స్ స్కూల్, రాగలీన డాన్స్ అకాడమీ, తాండవం-స్కూల్ ఆఫ్ కూచిపూడి, రాగమయూరి స్కూల్ ఆఫ్ డాన్స్ వంటి ప్రముఖ అకాడమీలు అద్భుతమైన ఇతివృత్తాత్మక ప్రదర్శనలను ఇచ్చి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

**2,000 కంటి శుక్లం శస్త్రచికిత్సలకు నిధుల సేకరణ**

బాలారెడ్డి ఇందుర్తి అధ్యక్షుడిగా చేపట్టిన ఎనిమిదేళ్ల నాయకత్వంలో శంకర నేత్రాలయ యూఎస్ఏ సంస్థ ఏడు నగరాల నుంచి ముప్పై నగరాలకు విస్తరించడమే కాకుండా మొబైల్ కంటి శస్త్రచికిత్స యూనిట్లను ఐదుకు పెంచింది. బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సభ్యులు డాక్టర్ రెడ్డి ఊరిమిండి అడాప్ట్-ఎ-విలేజ్ కార్యక్రమం, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ల గణాంకాలను వివరించారు. మహాదాతలైన ప్రకాష్ బెడపూడి, తిరుమల్ రెడ్డి కుంభం, శ్రీని వీరవెల్లి, సునీత ఒ డాక్టర్ రాజు కోసూరి, అర్జున్ మదాడి, డాక్టర్ కృష్ణబాబు చుండూరి, జె.కె.రెడ్డి, ఖీజూ, భీమా పెంటా, సుధాకర్ గార్లంక, ప్రేమ్ కలిదిండి వంటి దాతల ఉదారత కారణంగా సుమారు 2,000 కంటి శుక్లం శస్త్రచికిత్సలకు అవసరమైన నిధులు సేకరించారు. ముఖ్య అతిథి, శంకరరత్న పురస్కార గ్రహీత ప్రసాదరెడ్డి కాటమ్‌రెడ్డి, డాక్టర్ రెడ్డి ఊరిమిండి, చినసత్యం వీర్నాపు, కమిటీ సభ్యుల సమక్షంలో దాతలు, సంఘ నాయకులు ప్రత్యేకంగా సత్కరించారు.



# జీఎస్టీ అధికారుల అరెస్ట్ అధికారాలు రద్దు

### కౌన్సిల్ నిర్ణయాన్ని వెల్లడించిన కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్



దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే దిశగా జీఎస్టీ కౌన్సిల్ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు పెద్దపీట వేస్తూ పలు సంస్కరణలకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా వ్యాపార వర్గాల నుంచి ఎప్పట్నుంచో డిమాండ్ ఉన్న జీఎస్టీ అధికారుల అరెస్ట్ అధికారాలను కౌన్సిల్ రద్దు చేసింది. ఈ విధానం ప్రకారం.. నిర్దిష్ట సమాచార ఆధారంగా మాత్రమే సరకులను అడ్డుకుని తనిఖీ చేయాల్సి ఉంటుంది. దీంతో జీఎస్టీ అధికారులు యథేచ్ఛగా వాహనాలను ఆపి చెక్ చేసే అవకాశం ఉండదు. సరకుల స్వాధీనం కూడా సరఫరా జరిగే రాష్ట్రం లేదా సరకు చేరే రాష్ట్రానికి చెందిన అధికారులు మాత్రమే చేపట్టేలా నిబంధనలను మార్చాలని మండలి సిఫార్సు చేసింది. దీంతోపాటు నేర విచారణకు సంబంధించిన కనీస పరిమితిని కూడా రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచుతున్నట్టు కౌన్సిల్ నిర్ణయించింది. ఇకపై జరిమానా, జైలు శిక్ష లేదా రెండింట్లో ఏది విధించాలన్నది కేసును బట్టి న్యాయస్థానాలే నిర్ణయిస్తాయని స్పష్టం చేసింది. నిర్దిష్ట జరిమానా లేని ఉల్లంఘనలకు విధించే సాధారణ జరిమానానూ రూ.25 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించింది. పన్ను చెల్లింపుల్లో ఆలస్యం చేయడం, చిన్న చిన్న పొరపాట్లు చేయడం, రిటర్నులు ఆలస్యంగా దాఖలు చేయడం వంటి సందర్భాల్లో.. పన్ను వసూలు, వడ్డీ, నిబంధనలకు అనుగుణంగా జరిమానా మాత్రమే ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.

# దోబూచులాడితే కుదరదు

### ఎఫ్‌సీఆర్ఏ దరఖాస్తుదారులకు మద్రాసు హైకోర్టు చురకలు



ఎఫ్‌సీఆర్ఏ చట్టం కింద రిజిస్ట్రేషన్‌ను కేంద్రం నిరాకరించడాన్ని సవాలు చేసిన కొడైకెనాల్ జెన్ ధ్యాన ట్రస్ట్‌కు మద్రాస్ హైకోర్టులో చుక్కెదురైంది. అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు సమర్థించింది. తమ కార్యకలాపాలకు సంబంధించి పూర్తి వివరాలను వెల్లడించాల్సిన బాధ్యత రిజిస్ట్రేషన్‌ను కోరే సంస్థలపై ఉంటుందని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కోర్టు జోక్యానికి పరిమితులు ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ తీర్పు వెలువరించింది. తాము మతపరమైన సంస్థ కాదని ట్రస్టు తన దరఖాస్తులో పేర్కొందని కోర్టు తెలిపింది. అదే సమయంలో, తాము జెన్ బౌద్ధ ఫిలాసఫీని అనుసరిస్తామని స్వయంగా ట్రస్టు పేర్కొందని చెప్పింది. మతపరమైన సంస్థలకు ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్‌కు హక్కు ఉన్నప్పటికీ దరఖాస్తుదారులు తమ కార్యకలాపాల గురించి కచ్చితమైన వివరాలు ఇవ్వాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. దోబూచులు ఆడితే కుదరదని తేల్చి చెప్పింది. ధ్యాన కేంద్రం నిర్వహించినంత మాత్రాన తమను మతపరమైన సంస్థగా చూడకూడదని ట్రస్టు వాదించే ప్రయత్నం చేసింది. అయితే, కోర్టు మాత్రం కేంద్రం నిర్ణయాన్ని సమర్థించింది. ఈ నిర్ణయాన్ని సమీక్షించే అధికారానికి పరిమితులు ఉన్నాయని చెప్పింది. ట్రస్టు అప్పీలును కొట్టేసింది.

# ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మరింత ఉధృతం



### 33 మంది మృతి, 18 మందికి గాయాలు

ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మరింత తీవ్రతరం అవుతున్నాయి. తూర్పు ఉక్రెయిన్‌లోని క్రామటోర్స్క్ నగరంలో రెండు ప్రయాణికుల బస్సులను లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడిలో కనీసం 33 మంది మరణించారు. మరో 18 మంది గాయపడ్డారు. గురువారం జరిగిన ఈ దాడిని ఉక్రెయిన్ అధికారులు తీవ్రంగా ఖండించారు. తూర్పు ఉక్రెయిన్ ప్రాంతంలో రష్యా నియంత్రణలో లేని కీలక నగరాల్లో క్రామటోర్స్క్ ఒకటి. ఈ నగరంపై రష్యా దాడులు ఇటీవలి కాలంలో పెరిగాయని ఉక్రెయిన్ అధికారులు చెబుతున్నారు. ప్రయాణికులతో వెళ్తున్న రెండు బస్సులు రోడ్డుపై ఉన్న సమయంలో ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో బస్సులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ దాడిలో కనీసం 33 మంది మరణించారు. మరో 18 మంది గాయపడ్డారు. దాడికి గైడెడ్ బాంబ్ ఉపయోగించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

డొనెట్స్క్ ప్రాంత గవర్నర్ వాదిమ్ ఫిలాష్కిన్ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రయాణికులతో ఉన్న బస్సుపై దాడి చేయడం ద్వారా సాధారణ పౌరులను రష్యా లక్ష్యంగా చేసుకుందని ఆయన ఆరోపించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ కూడా ఈ ఘటనను ఖండించారు. కాగా, ఈ దాడికి ఒక రోజు ముందు కూడా ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడులు చేసింది. ఉత్తర ఉక్రెయిన్‌లోని ప్రిలుకీ నగరంలో నివాస భవనంపై జరిగిన క్షిపణి దాడిలో 22 మంది మరణించారు. వారిలో ఐదుగురు చిన్నారులు ఉన్నారు.



# సైన్యంలో జీవించిన నటధీరుడు

### కెరీర్ అత్యున్నత స్థాయిలో ఉన్నప్పటికీ.. సినిమాలకు విరామమిచ్చి ఆర్మీ క్విక్ రియాక్షన్ టీమ్‌లో చేరిన దేశభక్తుడు నానా పటేకర్

నటుడిగా తెరపై విభిన్న పాత్రలు పోషించిన నానా పటేకర్.. నిజ జీవితంలోనూ దేశం కోసం ఎన్నో సేవలు చేశారు. కార్గిల్ యుద్ధ సమయంలో తన సినీ కెరీర్‌కు బ్రేక్ ఇచ్చి మరీ సైన్యంలో చేరారు. సుమారు 60 రోజులపాటు సైనికులతో కలిసి విధుల్లో పాల్గొన్నారు. 75 ఏళ్ల వయసులో నానా పటేకర్ గురువారం గుండెపోటుతో కన్నుమూసిన నేపథ్యంలో ఆయన సైనిక సేవలను స్మరించుకుంటూ, 1980 ఆఖర్లో నానా పటేకర్ టెరిటోరియల్ ఆర్మీలో చేరారు. 1991లో వచ్చిన 'ప్రహార్: ది ఫైనల్ అటాక్' సినిమాలో ఆర్మీ కమాండో పాత్ర కోసం ఏకంగా మూడేళ్లపాటు మరాఠా లైట్ ఇన్‌ఫెంట్రీలో శిక్షణ తీసుకున్నారాయన. అప్పుడే సైన్యంపై ఆయనకు మరింత ఆసక్తి, అనుబంధం ఏర్పడింది. ఇక 1999లో కార్గిల్ యుద్ధం ప్రారంభమైన సమయంలో సైన్యంలో చేరేందుకు స్వచ్ఛందంగా ఆసక్తి కనబరిచారు. అయితే.. అందుకు రక్షణ శాఖ పర్మిషన్ తప్పనిసరి అని అధికారులు చెప్పడంతో నాటి రక్షణ మంత్రి జార్జ్ ఫెర్నాండెజ్‌ను కలిశారు. తనను ముందు వరుసలో సైనికులతో కలిసి సేవ చేసేందుకు అనుమతించాలని మంత్రిని కోరారు పటేకర్. ఈ నేపథ్యంలో తనకున్న షూటింగ్ నైపుణ్యం, గతంలో సాధించిన విజయాల గురించి కూడా ప్రస్తావించారు. పటేకర్ విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందిస్తూ.. సైన్యంలో చేరేందుకు అనుమతి ఇచ్చింది రక్షణ శాఖ. దీంతో అప్పట్లో కెరీర్ అత్యున్నత స్థాయిలో ఉన్నప్పటికీ.. సినిమాలకు విరామమిచ్చి ఆర్మీ క్విక్ రియాక్షన్ టీమ్(క్యూఆర్‌టీ)లో చేరారు పటేకర్. శ్రీనగర్, ద్రాస్, లెహ్ ప్రాంతాల్లో సైనికులతో కలిసి సుమారు 60 రోజులు విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలో భిన్న వాతావరణం, ఎత్తైన కొండ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా అనుభవించారు. సైన్యంలోకి చేరడానికి ముందు 76 కిలోల బరువున్న ఆయన.. తిరిగొచ్చే సరికి 56 కిలోలకు తగ్గినట్టు గతంలో పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారు.

5 దశాబ్దాల పాటు చిత్ర పరిశ్రమకు విశేష సేవలందించిన నానా పటేకర్ కోట్ల ఆస్తులు సంపాదించారు. వాటి విలువ రూ.50 కోట్ల నుంచి రూ.80 కోట్ల వరకు ఉంటుందని అంచనా. పూణే సమీపంలోని ఖడక్‌వాస్లాలో 25 ఎకరాల ఫామ్‌హౌస్ కూడా ఆయనకు ఉంది. ఇన్ని ఆస్తులు సంపాదించినా నానా పటేకర్ సాధారణ జీవితాన్నే ఇష్టపడ్డారు. అనవసర ఆడంబరాలు వద్దనుకున్నారు. అందుకే ముంబైలోని ఒక సాధారణ 1బీహెచ్‌కే ఫ్లాట్‌లోనే నివసించారు. అప్పుడప్పుడు సినిమా షూటింగ్‌లకు ఆటోలో కూడా వెళ్లారు. మరోవైపు కష్టాల్లో ఉన్నవారి కోసం ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడేవారు కాదు. రైతుల బాధలు చూసి చలించిపోయిన నానా పటేకర్.. 'నామ్ ఫౌండేషన్' స్థాపించి వేలాది రైతు కుటుంబాలకు అండగా నిలబడ్డారు. కాగా నానా పటేకర్ (75) గురువారం ఉదయం 5:20 నిమిషాలకు గోవాలోని మణిపాల్ ఆసుపత్రిలో కన్నుమూశారు. గుండెపోటు కారణంగా ఆయన తుదిశ్వాస విడిచారని వైద్యులు తెలిపారు. సుమారు 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినా, ఫలితం లేకపోయిందని వెల్లడించారు. ఆయన మృతిపై సినీ ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని దెబ్బతీయొద్దు

### ఎన్నికల సంఘానికి మాజీల మద్దతు

ఓటర్ల జాబితా సవరణ, ఓటు చోరీ ఆరోపణలపై విపక్షాల ఆందోళనలు కొనసాగుతున్న వేళ.. ఎన్నికల సంఘానికి మద్దతు లభిస్తోంది. ఈ మేరకు 42 మంది మాజీ న్యాయమూర్తులు, రాజ్యాంగ పదవుల్లో విధులు నిర్వర్తించి రిటైర్ అయిన పలువురు ప్రముఖులు మద్దతుగా నిలిచారు. ఈసీ, న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ సంస్థలపై జరుగుతున్న ప్రచారంపై ఆందోళన వ్యక్తం చేస్తూ.. నిన్న(గురువారం) వారు ఓ బహిరంగ లేఖ రాశారు. 'రాజ్యాంగ సంస్థలను విమర్శించడమనేది ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి హక్కు. అయితే.. వ్యక్తిగత దూషణలు, సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ఆరోపణలు చేయడం సరికాదు' అని మాజీ న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఉన్నతస్థాయి అధికారులను బహిరంగ వేదికలపై 'దొంగలు', 'కీలుబొమ్మలు', 'రాజీపడినవారు' అంటూ విమర్శించడం సరికాదన్నారు. 'ఓటు చోరీ' అని ఆరోపిస్తున్న వారు.. వాటిని ఆధారాలతో సహా కోర్టుల్లో ఎందుకు సమర్పించట్లేదని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం ప్రమాణపత్రంతో వివరాలివ్వాలని కోరినప్పుడు కూడా.. ఎవరూ స్పందించడం లేదన్నారు. ఎన్నికల్లో ఓటమి పాలైనప్పుడు ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేయడం, గెలుపొందినప్పుడు వాటి గురించి అసలు ప్రస్తావించకుండా ఉండటాన్ని కూడా వారు తప్పుబట్టారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) అనేది చట్టపరమైన ప్రక్రియలో భాగమేనని మాజీ జడ్జిలు స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 21(3) ప్రకారం.. ఓటర్ల జాబితాలను సవరించే అధికారం ఈసీకి ఉంటుందని గుర్తుచేశారు. చనిపోయిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లను, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారిని జాబితాలోంచి తొలగించడం, అర్హులైన ఓటర్లను కొనసాగించడమే దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. 'సర్'లో నోటీసులు, విచారణ, అభ్యంతరాలు, అప్పీల్‌కు అవకాశం వంటి వెసులుబాట్లు ఉన్నాయన్న వారు.. ఇది పూర్తిగా ఈసీ అధికార పరిధిలోనే ఉందని, సుప్రీంకోర్టు కూడా దీనిని చట్టబద్ధమైనదిగా పరిగణించినట్లు లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల సంస్థలపై పదేపదే అనుమానాలు వ్యక్తం చేయడంతో ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని మాజీ న్యాయమూర్తులు హెచ్చరించారు. ప్రజలు తమ ఓటుకు విలువ లేదనే పరిస్థితి వస్తే.. ప్రజాస్వామ్యంపై విశ్వాసం తగ్గే ప్రమాదముందన్నారు. ఆయా రాజకీయ పార్టీలు తమ అభ్యంతరాలను ఆధారాలతో సహా ఈసీ, న్యాయస్థానాల ముందుంచాలని సూచించారు. 'ఎన్నికల్లో నిలబడండి.. కానీ ఎన్నికల వ్యవస్థను మాత్రం చెల్లనిదిగా చూపొద్దు' అని కోరారు. నిరాధార ఆరోపణలకు మీడియా కూడా ప్రాధాన్యం ఇవ్వొద్దని ఈ సందర్భంగా మాజీ జడ్జిలు సూచించారు. ఒక విషయాన్ని పదేపదే చెప్పినంత మాత్రాన అది నిజమైపోదన్నారు. రాజ్యాంగ సంస్థలు ఏ ఒక్క ప్రభుత్వానికీ తొత్తులు కావని.. అవి పూర్తిగా దేశ ప్రజలకు సంబంధించినవని పేర్కొన్నారు.

## ఎలాన్ మస్క్, సత్య నాదెళ్లకు

# అమెరికా అత్యున్నత పురస్కారాలు



అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశంలోనే అత్యున్నతమైన శాస్త్రీయ, సాంకేతిక పరిశోధనా పురస్కారాలను ఎలాన్ మస్క్, సత్య నాదెళ్ల, జెన్సన్ హువాంగ్‌తో పాటు ఇతర ప్రముఖ టెక్ దిగ్గజాలకు వైట్‌హౌస్‌లో ప్రదానం చేయనున్నారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవార్డులను ప్రదా నం చేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. వైట్‌హౌస్‌లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 'సైన్స్: ఎ న్యూ గోల్డెన్ ఏజ్ సమిట్' వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ అవార్డు వచ్చిన వారిలో ఎలాన్ మస్క్ : టెస్లా, స్పేస్‌ఎక్స్ సీఈవో, సెర్గీ బ్రిన్: గూగుల్ సహ వ్యవస్థాపకుడు, జెన్సన్ హువాంగ్: ఎన్విడియా సీఈవో, లిసా సు: ఏఎమ్‌డీ సీఈవో ఉన్నారు. నేషనల్ మెడల్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ పురస్కారాలు వచ్చిన వారిలో సత్య నాదెళ్ల: మైక్రోసాఫ్ట్ సీఈవో, మైఖేల్ డెల్: డెల్ టెక్నాలజీస్ సీఈవో ఉన్నారు. గతేడాది డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ నుంచి మస్క్ వైదొలిగిన తర్వాత, ట్రంప్ పన్ను, బడ్జెట్ బిల్లులపై విమర్శలు చేయడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. అయితే ఇటీవల మస్క్ మళ్లీ ట్రంప్ యంత్రాంగంలో రక్షణ రంగానికి చెందిన 'ప్రాజెక్ట్ మెరిడియన్'కు సహ నాయకత్వం వహిస్తూ రక్షణ సాంకేతికతపై సలహాదారుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అధ్యక్షుడు ట్రంప్‌కు ఈ అవార్డుతో ఒక పర్సనల్ కనెక్షన్ ఉంది. ఆయన మేనమామ జాన్ జి.ట్రంప్ భౌతికశాస్త్రం లో చేసిన విశేష సేవలకుగాను గతంలో అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ చేతుల మీదుగా మరణానంతరం 'నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్' అందుకున్నారు. సూపర్ ఇంటెలిజెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజె న్స్, ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్‌ల ద్వారా పరిశోధనలను వేగవంతం చేసి ప్రపంచంలో అమెరికా సాంకేతిక ఆధిపత్యాన్ని నిలబెట్టడమే ఈ సమిట్ యొక్క ప్రధాన ఉద్దేశం. అమెరికా కాంగ్రెస్ 1959లో నెలకొల్పిన నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ అనేది దేశంలో సైంటిస్టులు, ఇంజనీర్లకు ఇచ్చే అత్యున్నత గౌరవం. భౌతిక, జీవ, గణిత, ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ రంగాల్లో దేశానికి అత్యుత్తమ సేవలు అందించిన ప్రతిభావంతులకు అధ్యక్షుడు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఇప్పటివరకు 529 మంది ప్రముఖులకు మాత్రమే ఈ మెడల్ అందించారు.

# హూతీ స్థావరాలపై ప్రతీకార దాడులు!



సౌదీ అరేబియా: సౌదీ అరేబియాలోని పౌర విమానాశ్రయా లపై యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు క్షిపణి, డ్రోన్ దాడులకు తెగబడ్డ నేపథ్యంలో సౌదీ నాయకత్వంలోని సైనిక కూటమి అత్యంత భారీ ప్రతీకార చర్యకు దిగింది. యెమెన్‌లోని వివిధ ప్రావిన్సుల్లో ఉన్న 82 హూతీ సైనిక స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు సౌదీ కూటమి అధికారికంగా ప్రకటించింది. పౌరులు, పౌర మౌలిక సదుపాయాలపై జరిగే క్రూరమైన దాడుల ను ఉపేక్షించేది లేదని, ఈ చర్యలకు తీవ్ర పర్యవసానాలు ఉంటాయని సౌదీ దళాల అధికార ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్-మాలికి హెచ్చరించారు. అక్టోబరు 6, 7 తేదీలలో సౌదీ రాజధాని రియాద్‌లోని కింగ్ ఖలీద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, అభాలోని అభా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లను లక్ష్యంగా చేసుకు ని హూతీలు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ముగ్గురు మరణించగా, 36 మంది తీవ్రంగా గాయపడ్డారు. అభా ఎయిర్‌పోర్ట్‌లో ఇద్దరు, రియాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడులకు ప్రతీకారంగా సౌదీ కూటమి యెమెన్‌లోని సాదా, అల్ హుదైదా, అల్ జౌఫ్, మారీబ్ ప్రాంతా ల్లోని 82 హూతీ స్థావరాలపై బాంబుల వర్షం కురిపించింది. ధ్వంసమైన వాటిలో 11 పర్వత శ్రేణుల బాలిస్టిక్ మిస్సైల్ నిల్వ కేంద్రాలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి.

# ఖతార్‌కు ఉత్తరాన ట్యాంకర్‌పై మిస్సైళ్ల దాడి



దోహా: గల్ఫ్ జలాల్లో వాణిజ్య నౌకలపై దాడులు కొనసాగు తున్నాయి. ఖతార్‌కు ఉత్తరాన ఓ ఆయిల్, కెమికల్ ట్యాంకర్‌పై శనివారం పలు మిస్సైళ్లు దూసుకెళ్లాయి. ఈ ఘటనలో నౌక సిబ్బందిలో కొందరు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ధ్రువీకరించింది. అయితే, మృతులు, గాయపడిన వారి వివరాలను వెల్లడించలేదు. ఖతార్‌లోని మదీనత్ అల్-షమాల్‌కు సుమారు 51 నాటికల్ మైళ్ల దూరంలో ఈ దాడి జరిగినట్లు యూకేఎంటీవో తెలిపింది. సముద్ర భద్రతా సంస్థ వాన్‌గార్డ్ ప్రకారం.. ఆంటిగ్వా అండ్ బార్బుడా జెండాతో ప్రయాణిస్తున్న 'ఏకర్స్' అనే ఆయిల్, కెమికల్ ట్యాంకర్‌పై దాడి జరిగింది. సరకుతో హోర్ముజ్ జలసంధి వైపు వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. మరోవైపు, సెప్టెంబర్ 9 ఘటన తర్వాత హోర్ముజ్ జలసంధికి ఇంత పశ్చిమాన వాణిజ్య నౌకపై దాడి జరగడం ఇదే తొలిసారని ఈవోఎస్ రిస్క్ గ్రూప్ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు జరిగిన 93 దాడి ఘటనల్లో కనీసం 24మంది నావికులు మర ణించినట్లు అంతర్జాతీయ సముద్ర రవాణా సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇదిలా ఉండగా గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఫుజైరాకు తూర్పున గురువారం మరో ట్యాంకర్‌లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఈ నౌక మార్షల్ దీవుల జెండా కలిగిన 'ధల్కుత్' అని భావిస్తున్నప్పటికీ.. అగ్నిప్రమా దానికి గల కారణం ఇంకా అస్పష్టంగానే ఉంది. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో దాదాపు ఐదో వంతు హోర్ముజ్ జలసంధి మీదుగా సాగుతుంది. తాజా దాడులతో అంతర్జాతీయ ఇంధన సరఫరాపై ఆందోళనలు పెరుగుతు న్నాయి. అయితే గత రెండు వారాల్లో ఈ మార్గం ద్వారా రోజుకు సగటున 1.2 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా జరిగినట్లు కెప్లర్ అంచనా వేసింది.

## కెనడా రచయిత్రికి సాహిత్యంలో నోబెల్



కెనడా: కెనడాకు చెందిన ప్రముఖ కవయిత్రి, వ్యాసకర్త ఆన్ కార్సన్‌ను 2026 సంవత్సరానికి సాహిత్యంలో నోబెల్ బహుమతి వరించింది. సాహసోపేతమైన, వినూత్న సాహిత్య రచనలకు గాను 76 ఏళ్ల కార్సన్‌ను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపిక చేసినట్లు స్వీడిష్ అకాడమీ గురువారం ప్రకటించింది. సాంప్రదాయ సాహి త్యంతో ఆధునిక సాహిత్యానికి కొత్తదనం అద్దిన కార్సన్ ఈ అవార్డుకు అర్హురాలని పేర్కొంది. కెనడాలోని టొరంటోలో జన్మించిన ఆన్ కార్సన్ రచనల్లో ప్రాచీన గ్రీకు, రోమన్ సాహిత్య ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఆమె కవిత్వం, వ్యాసాలు, గద్య రచనలు, అనువాదాలను కలిపి ప్రత్యేకమైన రచనా శైలిని అభివృద్ధి చేశారు. ప్రాచీన గ్రీకు సాహిత్యాన్ని అనువదించడం లోనూ కార్సన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. పదాల మూలాలు, భాష, కవిత్వం మధ్య సంబంధాన్ని ఆమె రచనల్లో విభిన్నమైన రీతిలో ఆవిష్కరించారు. 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్', 'ఎరోస్ ది బిటర్‌స్వీట్', 'మెన్ ఇన్ ది ఆఫ్ అవర్స్', 'నార్మా జీన్ బేకర్ ఆఫ్ ట్రాయ్' వంటివి కార్సన్ రచనల్లో ప్రముఖమైనవి. కవిత్వం, గద్యరచన, నాటకం, అనువాదం వంటి విభిన్న సాహిత్య ప్రక్రియ లను కలిపి ఆమె రచనలు సాగుతాయి. కాగా, 2026 సాహిత్య నోబెల్ బహుమతి విజేతకు 12 మిలియన్ స్వీడిష్ క్రోనర్ నగదు పురస్కారం అందిస్తారు. ఇది సుమారు 1.2 మిలియన్ అమెరికన్ డాలర్లకు సమానం. మన కరెన్సీలో రూ.10 కోట్లకు పైగానే ఉంటుంది.

### స్టార్‌లింక్‌ను అడ్డుకుంటున్నారు..

## భారత టెలికాం దిగ్గజాలపై మస్క్ ఆరోపణలు




అమెరికా: భారత్‌లో ఉపగ్రహ ఇంటర్నెట్ సేవల రంగానికి సంబంధించిన ప్రముఖ వ్యాపారవేత్త, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో స్టార్‌లింక్ ప్రవేశించకుండా మార్కెట్‌ను శాసించే కొందరు బడా కుబేరులు అడ్డుకుంటున్నారని, ఇది భారత ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరమని సంచలన ఆరోపణలు చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన మస్క్.. పేరు ప్రస్తావించ కుండానే భారతదేశ టెలికాం రంగాన్ని శాసిస్తున్న బడా పారి శ్రామికవేత్తలపై ఘాటుగా విరుచుకుపడ్డారు. 'దురదృష్టవ శాత్తూ, భారత ప్రజలపై తమకున్న ఏకఛత్రాధిపత్యాన్ని కాపాడుకోవడం కోసం కొందరు స్టార్‌లింక్‌ను అడ్డుకుంటు న్నారు. వారు ఎవరో మీరు ఊహించవచ్చు... ఇది భారత ప్రజలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరం!' అని ఎలాన్ మస్క్ అన్నారు. ప్రస్తుత ప్లాన్ల ధరలను భరించలేని వారికి, ఇంటర్నెట్ సదుపాయమే లేని మారుమూల ప్రాంతాల వారికి స్టార్‌లింక్ ద్వారా అత్యంత వేగవంతమైన, సరసమైన ఇంటర్నెట్‌ను అందించవచ్చని మస్క్ పేర్కొన్నారు. గతంలోనే స్టార్‌లింక్ భారత్‌లో 20 గేట్‌వే సైట్లను సిద్ధం చేసినప్పటికీ లైసెన్సింగ్ ప్రక్రియను, స్పెక్ట్రమ్ కేటాయింపులను ఈ కార్పొరేట్ శక్తుల ఒత్తిడి వల్లే ఆలస్యం చేస్తున్నారనే ఉద్దేశంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు భావిస్తున్నారు.



# ఇరాన్ యుద్ధంతో 'పెద్దన్న'కు భారీ నష్టం

### కాంగ్రెషనల్ రిసెర్చ్ సర్వీస్ నివేదిక వెల్లడి

అమెరికా: ఇరాన్‌తో యుద్ధం కారణంగా అమెరికా భారీగా నష్టపోయింది. 3.3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.31,700 కోట్లు) విలువైన 81 యుద్ధ విమానాలు, డ్రోన్లు, హెలికాప్ట ర్లను కోల్పోయింది. ఫలితంగా ప్రపంచానికి పెద్దన్నగా భావించే అమెరికా యుద్ధ సామర్థ్యాలపై పెద్ద దెబ్బపడింది. అంతేగాక దెబ్బతిన్న విమానాల మరమ్మతులకు అగ్రరాజ్య మిలిటరీపై భారీగా ఆర్థిక భారం కూడా పడింది. ఇరాన్‌తో యుద్ధం మొదలైనప్పటి నుంచి యూఎస్ కోల్పోయిన ఆయుధాల వివరాలను కాంగ్రెషనల్ రిసెర్చ్ సర్వీస్ (సీఆర్ఎస్) నివేదిక తాజాగా వెల్లడించింది. అమెరికా నష్టపోయిన వాటిలో 12 ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్ ఫైటర్ జెట్లు, ఒక ఎఫ్-35ఏ లైట్నింగ్-2 స్టెల్త్ ఫైటర్, ఒక ఈ-3 సెంట్రీ నిఘా విమానం, దజన్ల కొద్దీ ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు ఉన్నాయి. ఈ యుద్ధంలో ఇవి కీలకమైన పాత్ర పోషించాయి. ఒక్కోటి 30 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 290 కోట్లు) విలువైన మూడు ఎఫ్-15ఈ ఫైటర్లు మార్చి 2న కువైత్‌లో ధ్వంసం కాగా, మరొక విమానాన్ని ఏప్రిల్‌లో తమ గగనతలంపై ఇరాన్ కూల్చివేసింది. మరో 8 ఎఫ్-15ఇలు సెప్టెంబరు 8, 9 తేదీల్లో జోర్డాన్‌లోని ఎయిర్‌బ్ట?సపై ఇరాన్ దాడులతో స్వల్పంగా ధ్వంసం కాగా, వాటికి మరమ్మతులు చేస్తున్నారు. ఇక 45 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లను అమెరికా కోల్పోయింది. ఒక్కో రీపర్ డ్రోన్ దానిలోని టెక్నాలజీ, నిర్మాణాన్ని బట్టి 30మిలియన్ డాలర్లు (సుమారు రూ. 290 కోట్లు) నుంచి 50మిలియన్ డాలర్లు (సుమారు రూ.483 కోట్లు) వరకు ఉంటుందని ఆ నివేదిక పేర్కొంది. ఈ డ్రోన్లను దాడుల కోసమే కాకుండా నిఘా కార్యకలాపాల కోసం అమెరికా ఎక్కువగా వినియోగించింది.

# పంజాబ్ కింగ్స్‌కు బిగ్ షాక్.. ఇద్దరు కోచ్‌లు రాజీనామా





2027 సీజన్‌కు సంబంధించి ఐపీఎల్ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ జట్లలో ఒకటైన పంజాబ్ కింగ్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు ఫీల్డింగ్ కోచ్ బ్రాడ్ హాడిన్ (ఆస్ట్రేలియా), ఫాస్ట్ బౌలింగ్ కోచ్ జేమ్స్ హోప్స్ (ఆస్ట్రేలియా) తమ పదవులకు రాజీనామా చేశారు. వీరిద్దరికి బిగ్ బాష్ లీగ్‌లో కొత్త బాధ్యతలు లభించినట్లు సమాచారం. ఆ కారణంతోనే పంజాబ్ కింగ్స్ జట్టులో తమ పదవులకు రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. పంజాబ్ కింగ్స్ జట్టుకు ప్రధాన కోచ్‌గా ఆస్ట్రేలియాకు చెందిన రికీ పాంటింగ్ ఉన్నసంగతి తెలిసిందే. పాటింగ్, హాడిన్, హోప్స్ వృత్తిపరంగా అత్యంత సన్నిహితులు. ముఖ్యంగా హోప్స్, పాంటింగ్ బెస్ట్ ఫ్రెండ్స్ అని క్రీడా వర్గాల్లో టాక్. పాంటింగ్ ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి పంజాబ్ కింగ్స్‌లోకి వచ్చిన సమయంలోనే హోప్స్‌ను కూడా తనతో పాటు తెచ్చుకున్నాడు.దీని బట్టి వాళ్లిద్దరీ సాన్నిహిత్య సంబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అలానే హాడిన్ గతంలో పంజాబ్ కింగ్స్‌కు కోచ్‌గా ఉన్న ట్రెవర్ బేలిస్ హయాం నుంచి కొనసాగుతున్నాడు. మరోవైపు స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే కూడా ఇప్పటికే పంజాబ్ కింగ్స్‌ను వీడాడు. ఆ వెంటనే గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలోని భారత జట్టు సపోర్ట్ స్టాఫ్‌లో స్పిన్ బౌలింగ్ కోచ్‌గా బహుతులే చేరాడు. కోచింగ్ బృందంలో కీలక వ్యక్తులు వైదొలగడంతో పంజాబ్ కింగ్స్ కొత్త వారి కోసం వేటసాగిస్తోంది. ఈ బాధ్యతను ప్రధాన కోచ్ పాంటింగ్‌కే అప్పగించినట్లు తెలుస్తోంది. అయితే పాంటింగ్ కూడా పంజాబ్ జట్టును వీడుతాడని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. మొత్తంగా పంజాబ్ కింగ్స్ జట్టులో జరుగుతున్న పరిణామాలు అందరిలో ఆసక్తిరేపుతున్నాయి. 2027 సీజన్ ప్రారంభమయ్యే నాటికి పంజాబ్ జట్టు స్వరూపం ఎలా ఉండబోతుందా అని క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# హర్మన్‌ప్రీత్ కౌర్ బాటలో శ్రీలంక కెప్టెన్

భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ తన పదవికి రాజీనామా చేస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అకస్మాత్తుగా ఆమె తీసుకున్న ఈ నిర్ణయంతో క్రీడ వర్గాలు విస్మయానికి గురయ్యాయి. తాజాగా పురుషుల విభాగంలో శ్రీలంక టెస్టు క్రికెట్ జట్టు కెప్టెన్ ధనంజయ డి సిల్వ కూడా సంచలన నిర్ణయం తీసుకున్నాడు. నాయకత్వ బాధ్యతల నుంచి తక్షణమే తప్పుకొంటున్నట్లు ఇవాళ (గురువారం) ప్రకటించాడు. శ్రీలంక సెలక్షన్ కమిటీకి ధనంజయ్ రాసిన లేఖలో పలు అంశాలను పేర్కొన్నాడు. కొత్త తరానికి కెప్టెన్సీ బాధ్యతలు అందజేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాన్ని తాను మనస్ఫూర్తిగా తీసుకున్నానని ధనంజయ డి సిల్వ వెల్లడించాడు. నాయకుడిగా వైదొలిగినప్పటికీ ఆటగాడిగా మాత్రం జట్టులో కొనసాగుతానని ఈ సందర్భంగా స్పష్టం చేశాడు. ధనంజయ డి సిల్వ నిర్ణయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు స్వాగతించింది.



లంక క్రికెట్ సీఈఓ ఆష్లే డి సిల్వ మాట్లాడుతూ.. 'డి సిల్వ భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటున్నాం. మా టెస్టు జట్టుకు నాయకుడిగా సేవలు అందించినందుకు ధన్యవాదాలు' అని పేర్కొన్నాడు. 1991లో కొలంబోలో జన్మించిన డి సిల్వ 2015లో శ్రీలంక తరపున అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టాడు. ఇప్పటి వరకు 69 టెస్టులు, 93 వన్డేలు, 48 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. ధనంజయ టెస్టుల్లో 4431, వన్డేల్లో 1924, టీ20లలో 890 పరుగులు సాధించాడు. అదే విధంగా.. టెస్టుల్లో 43, వన్డేల్లో 48, టీ20ల్లో 17 వికెట్లు పడగొట్టాడు ఈ రైటార్మ్ ఆఫ్ బ్రేక్ స్పిన్నర్. డి సిల్వ 2024 జనవరిలో దిముత్ కరుణరత్నె నుంచి శ్రీలంక టెస్టు కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించాడు. మొత్తంగా 18 మ్యాచ్‌లలో సారథిగా వ్యవహరించి.. ఏడు టెస్టుల్లో జట్టును గెలిపించాడు. కెప్టెన్‌గా 1130 పరుగులు సాధించడంతో పాటు.. 44.44 బౌలింగ్ సగటుతో 9 వికెట్లు సాధించాడు. కాగా చివరిగా.. టీమిండియాతో ఈ ఏడాది జూలై- ఆగస్టులో జరిగిన టెస్టు సిరీస్ సందర్భంగా ధనంజయ డి సిల్వ లంక కెప్టెన్‌గా వ్యవహరించాడు.

# ముగిసిన అగార్కర్ పదవీకాలం



భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) సెలక్షన్ కమిటీ చీఫ్‌గా మాజీ క్రికెటర్ అజిత్ అగార్కర్ పదవీకాలం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ నెల 4వ తేదీతో అగార్కర్ పదవీకాలం ముగిసింది. వెంటనే ఖాళీగా ఉన్న సెలక్టర్ పదవి కోసం బీసీసీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. కొత్తగా రాబోయే సెలక్టర్‌ని బట్టి తదుపరి చీఫ్ సెలక్టర్ ఎంపిక ఉండబోతోంది. ఈ క్రమంలో భారత సీనియర్ ఆటగాడు రవీంద్ర జడేజా ఆసక్తికర పోస్టు పెట్టాడు. ప్రస్తుతం ఆ పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. బీసీసీఐ దరఖాస్తుల నోటిఫికేషన్‌కు సంబంధించిన పోస్టును షేర్ చేసిన

### జడేజా పోస్ట్ వైరల్

జడ్డూ.. 'ప్రాసెస్ ఏంటి?' అంటూ నవ్వుతూ ఉన్న ఎమోజీని జోడించాడు. దీంతో ఆ పోస్టుకు రవీంద్ర జడేజా ఏమైనా అప్లై చేసుకుంటాడా? పలువురు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. రెండేళ్ల క్రితం అగార్కర్ నాయకత్వంలోని సెలక్షన్ కమిటీ రవీంద్ర జడేజాను కొన్ని వన్డే సిరీస్‌లకు పక్కన పెట్టింది. అప్పుడు వీరిద్దరి మధ్య సంబంధాలు చెడినట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే జడేజా తాజా పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది ఆరంభంలో స్వదేశంలో జరిగిన ఆఫ్ఘనిస్థాన్ వన్డేలకు, యూకేలో జరిగిన ఇంగ్లాండ్ వన్డేలకు దూరమైన జడేజా, వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్ సందర్భంగా జట్టులోకి పునరాగమనం చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో కలిపి జడేజా 10 ఓవర్లలో 2/75, 0/54 బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. 2025 నుంచి ఆడిన తన చివరి 15 వన్డేలలో, జడేజా 10 ఇన్నింగ్స్‌లలో 29.80 సగటుతో 149 పరుగులు చేశాడు. అతని అత్యుత్తమ స్కోరు 32 కాగా, స్ట్రైక్ రేట్ 95కు పైగా ఉంది. ఈ ఆల్‌రౌండర్ 15 మ్యాచ్‌లో 47.93 సగటుతో 14 వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

# మన కుర్రాళ్లు.. క్లీన్‌స్వీప్ చేశారు

*రెండో యూత్ టెస్టులో ఆసీస్ అండర్-19పై ఘన విజయం*

అహ్మదాబాద్: ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో జరిగిన రెండు యూత్ టెస్టుల సిరీస్‌ను భారత అండర్-19 జట్టు 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. స్పిన్నర్ తన్మయ్ బలోదా మొత్తంగా 14 వికెట్లతో విజృంభించడంతో బుధవారం ముగిసిన రెండో టెస్టులో భారత యువ జట్టు 10 వికెట్ల తేడాతో గెలిచింది. పది పరుగుల స్వల్ప ఛేదనతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన టీమిండియా 0.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 11 రన్స్ చేసి గెలిచింది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 86/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. తన్మయ్ (8/41) ధాటికి 151 పరుగులకే కుప్పకూలింది. బ్లేక్ కాటిల్ (63) టాప్ స్కోరర్. తన్మయ్ తొలి ఇన్నింగ్స్‌లోనూ ఆరు



వికెట్లతో అదరగొట్టాడు. ఇక, మొదటి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 174, భారత్ 315 రన్స్ చేశాయి. కాగా, అంతకుముందు ఆసీస్ అండర్-19పై జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను కూడా యువ భారత్ 3-0తో నెగ్గిన సంగతి తెలిసిందే.

**తన్మయ్ రికార్డ్**

రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 73 పరుగులిచ్చి 14 వికెట్లతో చెలరేగిన తన్మయ్ బలోదా.. యూత్ టెస్టు చరిత్రలో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన క్రికెటర్‌గా అరుదైన రికార్డు సాధించాడు. ఈ క్రమంలో 2007లో టిమ్ సౌథీ (92 పరుగులిచ్చి 12 వికెట్లు) రికార్డును తన్మయ్ అధిగమించాడు.



**రంజీ ట్రోఫీకి బిహార్ జట్టు ప్రకటన**

# వైభవ్ సూర్యవంశీకి దక్కని చోటు

దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ 2026-27 సీజన్ కోసం అన్ని రాష్ట్రాలు రెడీ అవుతున్నాయి. ఇప్పటికే పలు క్రికెట్ సంఘాలు తమ జట్లను ప్రకటించాయి. తాజాగా బిహార్ క్రికెట్ అసోసియేషన్(బీసీఏ) 17 మంది సభ్యులతో కూడిన తమ జట్టును ప్రకటించింది. అయితే ఇది తొలి రెండు మ్యాచుల కోసమే. బీసీఏ నియమించిన పరిశీలకుల ఆధ్వర్యంలో పూర్తి పారదర్శకంగా ఈ జట్టు ఎంపిక జరిగింది. ఈ జట్టులో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కలేదు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ భారత సీనియర్ జట్టు తరపున బిజీగా ఉన్నాడు. ఈ కారణంతోనే బిహార్ క్రికెట్ అసోషియేషన్ వైభవ్‌ను జట్టులోకి తీసుకోలేదు. గత సీజన్‌లో వైభవ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈసారి అతడు బాధ్యతలను హిమాన్షు సింగ్‌కు అప్పగించారు. అదేవిధంగా మరోసారి బిహార్ జట్టును ముందుండి నడిపించేందుకు ఆల్‌రౌండర్ సకీబుల్ ఘని సిద్ధమయ్యాడు. రంజీ ట్రోఫీ జట్టు కోసం ఆటగాళ్ల ఎంపిక ప్రక్రియను బీసీఏ నామినేటెడ్ సెలెక్టర్లైన హర్విందర్ సింగ్, ఎస్.శరత్, అమితాబ్ విజయవర్గియాల పర్యవేక్షణలో నిర్వహించారు. సకీబుల్ ఘని సారథ్యంలోని బిహార్ జట్టు అక్టోబర్ 11న ఉత్తరప్రదేశ్‌తో తమ తొలి మ్యాచ్‌ను ఆడనుంది. కొత్తగా నిర్మించిన 'రాజ్‌గిర్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం' వేదికగా జరగనున్న ఈ పోరు బిహార్ చరిత్రలో ప్రత్యేకంగా నిలవనుంది. ఈ మైదానంలో జరుగుతున్న తొలి రంజీ ట్రోఫీ మ్యాచ్ ఇదే కావడం విశేషం.

**బిహార్ రంజీ జట్టు:**

సకీబుల్ ఘని (కెప్టెన్), హిమాన్షు సింగ్ (వైస్ కెప్టెన్), ఆయుష్ లోహరుకా, మంగళ్ మహ్రూర్, నమన్ గౌరవ్, పీయూష్ సింగ్, బిపిన్ కుమార్ సౌరభ్ (వికెట్ కీపర్), శర్మన్ నిగ్రోధ్ (వికెట్ కీపర్), ఆకాశ్ రాజ్, పృథ్వీ రాజ్, ఖాలిద్ ఆలం, సూరజ్ కుమార్ కశ్యప్, షకీబ్ హుస్సేన్, ఎండి ఇజార్, షబ్బీర్ ఖాన్, రాఘవేంద్ర సింగ్, ఆమోద్ యాదవ్.

స్టాండ్‌బై ఆటగాళ్లు: నవాజ్ ఖాన్, మలయ్ రాయ్, దానిష్ ఆలం, తను కుమార్ సింగ్, సచిన్ కుమార్ సింగ్, ప్రశాంత్ కుమార్ సింగ్.




## నమ్మలేకపోతున్నాం.. నానా పటేకర్ మృతిపై సెలబ్రిటీలు



భారతీయ సినీ యవనికపై తనదైన అద్వితీయనటనతో చెరగని ముద్ర వేసిన బాలీవుడ్ దిగ్గజ నటుడు, పద్మశ్రీ, జాతీయ అవార్డు గ్రహీత నానా పటేకర్ (75) గురువారం కార్డియాక్ అరెస్ట్‌తో హఠాన్మరణం చెందారు. పాన్-ఇండియా స్థాయిలో గుర్తింపు పొందిన ఈ విలక్షణ నటుడి ఆకస్మిక మృతి యావత్ సినీ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అసలు ఈ విషయాన్ని నమ్మలేకపోతున్నామంటూ సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులెందరో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు రజనీకాంత్, చిరంజీవి, పవన్‌కళ్యాణ్, జూనియర్ ఎన్టీఆర్ వంటి ప్రముఖులు 'ఎక్స్' వేదికగా నానా పటేకర్ మృతికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## నటుడు తనికెళ్ల భరణికి పురస్కారం



రంగస్థలానికి భజరప్ప చేసిన సేవలు ఎనలేనివని ఆయన నాటక రంగాభివృద్ధికి ఎంతో దోహదపడ్డారని విశ్రాంత ఐఏఎస్ డా. కేవీ రమణాచారి అభివర్ణించారు. బుధవారం రవీంద్రభారతి లో సిరిమువ్వ కల్చరల్స్ సంస్థ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు, దర్శకుడు దివంగత భజరప్ప స్మారక పురస్కారాన్ని నటుడు, రచయిత తనికెళ్ల భరణికి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి పురస్కార గ్రహీత తనికెళ్ల భరణిని సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన భజరప్ప చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన పేరిట నెలకొల్పిన పురస్కారాన్ని తనికెళ్ల భరణికి అందజేయడం సముచితమైన నిర్ణయమని తెలిపారు. భరణి అటు సినిమాల్లో ఇటు రంగస్థలంలో తనదైన పాత్ర పోషిస్తున్నారని కొని యాడారు. రచయితగా, నటుడిగా, దర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందుతున్నారని అన్నారు. ఈతరం యువతకు తనికెళ్ల భరణి ఆదర్శప్రాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డి.ఎస్.ఎన్.మూర్తి, కోట శంకరరావు, బి.సంధ్యారెడ్డి, సంజయ్ కిషోర్ తదతరులు పాల్గొన్నారు. సభకు ముందు ట్రాప్ నాటికను ప్రదర్శించారు. చిలువూరు నాగేశ్వరరావు రచించిన ఈ నాటకానికి మంజునాథ దర్శకత్వం వహించారు. చక్కటి నటనతో నటీనటులు ఆకట్టుకున్నారు.

## 'కొత్త బంగారు లోకం' పెయిర్ మళ్లీ వచ్చేశారు!

టాలీవుడ్‌లో మంచి హిట్ కోసం ఎదురుచూస్తోన్న హీరోల్లో వరుణ్ సందేశ్ కూడా ఒకరు. 'హ్యాపీ డేస్', 'కొత్త బంగారు లోకం' వంటి క్లాసిక్స్‌తో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న వరుణ్.. ఆ తరువాత కొన్ని సినిమాల్లో నటించినా విజయాలు మాత్రం దక్కలేదు. ఇక మధ్యలో కొన్నేళ్ళు సినిమాలకు గ్యాప్ ఇచ్చి న ఆయన ఈమధ్య కొత్త కొత్త కథలతో ప్రేక్షకులను అలరించడా నికి సిద్ధమవుతున్నాడు. తాజాగా వరుణ్ సందేశ్ హీరోగా నటించి న చిత్రం 'నా వైఫ్ మిస్సింగ్. ఆహా ఒరిజినల్ ప్రెజెంటేషన్‌లో రూపొందుతున్న ఈ సస్పెన్స్ మిస్టరీ థ్రిల్లర్‌కి స్వాతి ప్రకాష్ దర్శకత్వం వహిస్తుంది. ఇక కొత్త బంగారు లోకం తరువాత వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రసాద్ జంటగా నటిస్తోన్న చిత్రం కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా నా వైఫ్ మిస్సింగ్ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది.టీజర్ లో మొదట వరుణ్, శ్వేతకు పెళ్లి చూపులు జరగడం, పెళ్లి కావడం.. ఎంతో సంతోషంగా జీవితాన్ని గడుపుతున్నట్లు చూపించారు. ఇక పెళ్లి చూపుల్లోనే శ్వేత నేను వర్జిన్ కాదు అని చెప్పడంతో వరుణ్ లో అనుమానం పెరగడం చూపించారు. ఇక చివర్లో పోలీస్ స్టేషన్‌కి వెళ్లి నా వైఫ్ మిస్సింగ్ అని కంప్లైంట్ ఇవ్వడం వంటి సన్నివేశాలతో టీజర్ ఎంతో ఆసక్తికరంగా సాగింది.

### తెలుగువారితో నానా పటేకర్‌కు

# ప్రత్యేక అనుబంధం

### కృష్ణవంశీ సినిమాలతో మరింత బంధం

విలక్షణ నటన - అంతే విలక్షణమైన వ్యక్తిత్వం నానా పటేకర్ సొంతం. తెరపై విలన్ రోల్స్‌లో భయపెట్టిన నానా పటేకర్ నిజజీవితంలో పది మందికి సాయం చేయాలనే తపనతో సాగారు. నానా పటేకర్ ఇక లేరు అన్న చేదు నిజాన్ని అభిమా నులు భరించలేక శోకసముద్రం లో మునిగారు. తెలుగు సినిమా లో నటించకపోయినా... నానా పటేకర్‌కు తెలుగు సినిమాతో ప్రత్యేక బంధం ఉంది.

నానా పటేకర్ పేరు వినగానే ఆయన ధరించిన అనేక విలక్షణమైన పాత్రలు మన స్మృతిపథంలో మెదలుతాయి. మరాఠీ, హిందీ చిత్రాలతో అలరించిన నానా పటేకర్ తెలుగు సినిమాల్లో నటించ లేదు. కానీ, తెలుగువారితో అనుబంధం ఉంది. తెలుగు నిర్మాత రామోజీరావు నిర్మించిన 'ప్రతిఘటన' రీమేక్ 'ప్రతిఘాత్' లో రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ గా నానా పటేకర్ నటించారు. 'ప్రతిఘటన'లో సుత్తివేలు ధరించిన పాత్రను హిందీలో నానా పటేకర్ పోషించారు. 'ప్రతిఘాత్' నటునిగా నానా పటేకర్‌కు ఎంతో పేరు సంపాదించి పెట్టింది. అలాగే తెలుగు దర్శకుడు కృష్ణవంశీ తెరకెక్కించిన 'శక్తి-ద పవర్'లోనూ నానా పటేకర్ విలక్షణమైన పాత్ర ధరించారు. ఈ చిత్రానికి కృష్ణవంశీ 'అంతఃపు రం' మాతృక. తెలుగులో ప్రకాశ్ రాజ్ ధరించిన పాత్రను 'శక్తి'లో నానా పోషించారు. విశేషం ఏమంటే నానా పటేకర్ కెరీర్ ప్రారంభంలో ఈ సినిమా వచ్చింది. అయితే మళ్ళీ చాలా యేళ్ళ తర్వాత నానా పటేకర్ నటించిన మరాఠీ చిత్రం 'నటసమ్రాట్'ను కృష్ణవంశీ తెలుగులో 'రంగమార్తాండ'గా రీమేక్ చేశారు. మరాఠీ లో నానా పటేకర్ పోషించిన ప్రధాన నాయకుడి పాత్రను తెలుగు లో ప్రకాశ్‌రాజ్ చేయడం విశేషం. ఇలా కృష్ణవంశీ సినిమాలతో నానా పటేకర్‌కు ప్రత్యేక అనుబంధం ఏర్పడింది. మహారాష్ట్రలోని మురద్- జంజిరాలో జన్మించిన నానా పటేకర్ అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. చిన్నప్పటి నుంచీ చిత్రకళ అంటే నానాకు ప్రాణం. ముంబైలోని ప్రఖ్యాత 'సర్ జె.జె. కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్'లో నానా అప్లైడ్ ఆర్ట్స్ చేశారు. కొన్ని మరాఠీ నాటకాల్లోనూ నటించా రు నానా. 1978లో తెరకెక్కిన 'గమన్' చిత్రంతో వెండితెరపై తొలిసారి కనిపించారు. అనేక చిత్రాలలో విలక్షణమైన పాత్రలు పోషిస్తూ సాగారు నానా పటేకర్. 'అగ్నిసాక్షి', 'పరిందా' చిత్రాల ద్వారా బెస్ట్ సపోర్టింగ్ యాక్టర్‌గా నేషనల్ అవార్డు అందుకున్నా రు. 'క్రాంతివీర్' చిత్రం ద్వారా జాతీయ స్థాయిలో ఉత్తమ నటునిగా నిలిచారు నానా. "ప్రహార్, తిరంగా, ఖామోషీ, శక్తి, అపహరణ్" వంటి చిత్రాలు నానాకు నటునిగా ఎనలేని పేరు సంపాదించి పెట్టాయి. అర్జున్ 'బొమ్మలాట్టం', రజనీకాంత్ 'కాలా' వంటి సౌత్ మూవీస్‌లోనూ నానా నటించారు.

నానా పటేకర్ నటించిన అనేక చిత్రాలు తెలుగులో రీమేక్ అయ్యాయి. ఆయన హిందీ సినిమా 'క్రాంతివీర్'ను తెలుగులో మోహన్‌బాబు 'పుణ్యభూమి నా దేశం' పేరుతో రీమేక్ చేశారు. అలాగే చాలా కాలం తర్వాత నానా పటేకర్ నటించిన 'టాక్సీ నంబర్ 9211' మూవీ మోహన్‌బాబే తెలుగులో 'గేమ్' పేరుతో తానే నటించి పునర్ నిర్మించారు. తెరపై ప్రతినాయక పాత్రల్లో జడిపించిన నానా పటేకర్ నిజజీవితంలో దానధర్మాలు ఎన్నో చేశారు.

మహారాష్ట్రలోని రైతులను ఆదుకోవడానికి నానా పటేకర్ తన సహ నటుడు మకరంద్‌తో కలసి 'నామ్ ఫౌండేషన్' నెలకొ ల్పారు. ఆపదలో ఉన్నవారికి చేతనైన సాయం అందించడానికి ముందుండేవారు నానా పటేకర్. నటునిగా, వ్యక్తిగా తనదైన బాణీ పలికించిన నానా పటేకర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన చిత్రాల ద్వారా జనం మదిలో నిలచే ఉంటారు.

# వార్ మోడ్‌లో 'ఇండియన్ 3'

### కమల్, శంకర్ మరో భారీ అప్‌డేట్ - 10 రోజుల్లో షూటింగ్

యూనివర్సల్ స్టార్ కమల్‌హాసన్, స్టార్ డైరెక్టర్ శంకర్, ప్రెస్టీజియస్ చిత్రాలను నిర్మిస్తోన్న భారీ నిర్మాణ సంస్థ కాంబోలో రూపొందుతోన్న చిత్రం 'భారతీయుడు -3'. 1996లో విడుదలైన బ్లాక్ బస్టర్ మూవీకి స్వీకెల్‌గా భారతీయుడు-2, భారతీయుడు - 3 చిత్రాలను కమల్, శంకర్ కాంబోలో రూపొందించటానికి లైకా సంస్థ సిద్ధమైంది. అందులో భాగంగా 2024లో భారతీయుడు 2 విడుదలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'భారతీయుడు-3'ను చిత్రీకరించటానికి మేకర్స్ సిద్ధమయ్యారు.ీ ఇప్పటికే 'భారతీయుడు3'లో కొంత భాగాన్ని చిత్రీకరించారు. దానికి సంబంధించిన ఎడిటింగ్ వర్క్ శరవేగంగా జరుగుతోంది. 10 రోజుల్లో 'భారతీయుడు3'కి సంబంధించిన మిగిలిన భాగాన్ని పూర్తి చేయటానికి షూటింగ్‌ను స్టార్ట్ చేయబోతున్నారు. త్వరలో రిలీజ్ డేట్‌ను కూడా అనౌన్స్ చేస్తామని చిత్ర యూనిట్ తెలియ జేసింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసింది. ముగ్గురు వ్యక్తులు గుర్రాలపై వేగంగా వెళుతుంటే దుమ్ము, దూళి రేగుతున్నట్టుగా ఉండే ఫొటో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తోంది. 'భారతీయుడు 3' ఎలా ఉండబోతుందనే విషయాన్ని 'భారతీ యుడు 2' క్లైమాక్స్‌లో చూపించారు. మరి ఈసారి సేనాపతి లంచాన్ని అంతమొందించటానికి చేసే పోరాటం ఎలా ఉంటుందో వేచిచూడాలి. 'భారతీయుడు 3'లో ఎస్.జె. సూర్య,



ప్రియ భవానీ శంకర్, కాజల్ అగర్వాల్, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్ సింగ్, నెడుముడి వేణు, వివేక్, కాళిదాస్ జయరాం, గుల్షన్ గ్రోవర్, సముతిరఖని, బాబీ సింహా, బ్రహ్మానందం, జాకీర్ హుస్సేన్, ప్రియూష్ మిశ్రా, గురు సోమసుందరం, ఢిల్లీ గణేశ్, జయప్రకాశ్, మనోబాల, అశ్వినీ తంగరాజ్ కీలక పాత్రలు పోషించారు. అనిరుధ్ రవి చందర్ సంగీతాన్ని అందించిన ఈ సినిమాకు తెలుగులో పాటల ను శ్రీమణి, సంభాషణలను హనుమాన్ చౌదరి అందిస్తున్నారు.